# సాగరసంగమము

ఆనందారామం

ఆనందం మూర్తీభవించి నట్లుగా ఉంది కళాశాల కోలాహలం. రంగు రంగుల సిల్కుచీరెలూ, నైలాను మిలమిలలూ, పంజాబీదుస్తులూ, కొన్ని బురఖాలూ, మరికొన్ని ఫ్రాకులూ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నాయి. కొంత మంది అమ్మాయిలు తమ పైటచెంగుకు వాలంటీరుబాడ్జీ తగిలించుకొని, నచ్చినవారందర్నీ ఆహ్వానించి కూర్చోబెడుతున్నారు. "ఆదివారం మా కాలేజీ వార్షికోత్సవం; రాకపోతే చూడు" అని నిరంజని వారంరోజుల్నించీ సుధాకర్‌ని రోజూ హెచ్చరిస్తూంది. "ఆడవాళ్ళ కాలేజీకి నేనెందుకూ?" అన్నాడు విసుగ్గా. అతడికి తగని మొహమాటం. "మహా మొగధీరుడివి బయలుదేరావు లెద్దూ! కాలేజీ ఆడవాళ్ళదయినా వార్షికోత్సవానికి లెక్కలేనంతమంది వస్తారు. నువ్వు రానని తప్పించుకుంటే ఊరుకోను," అంది నిరంజని బుంగమూతితో. సుధాకర్ వస్తానని ఒప్పుకున్నాడు. నిరంజని వాలంటీర్‌గా తన పేరుకూడా ఇచ్చింది. ఆ కారణంగా ఉత్సవం ప్రారంభసమయానికంటె ముందుగా వెళ్ళవలసి వచ్చింది.

"నిన్నేపిల్లీ ఎత్తుకుపోదుగాని, తప్ప



తుందా రా, సుధన్నయ్యా!" అని మరీ మరీ చెప్పి వెళ్ళింది నిరంజని.

సుధాకర్‌కు ఈ అహ్వానం పెద్ద సంతోషాన్ని కళిగించలేదు. ఇంతకంటె హాయిగా క్లబ్బుకు పోయి, కాసేపు పేకాడుకుంటేనే అతని ప్రాణానికి హాయిగా ఉండేది.

రిక్షా దిగితూనే అక్కడి జనసమూ



హాన్ని చూసి కొన్ని క్షణాలు విశ్రాంతి కలిగింది సుధాకర్‌కి. అతని కళ్ళు క్షణంలో సగం కాలం నిరంజనికోసం చుట్టూ చూశాయి. నిరంజని ఎక్కడా కనిపించలేదు. అలా ఆడపిల్లలవంక తేరి చూడడం అసహ్యంగా ఉంటుందని ఆ ప్రయత్నం విరమించుకొన్నాడు తడ బాటుతో అటూ, ఇటూ చూస్తుంటే ఎవరో విద్యార్థిని "ఇటు రండి" అంటూ దారి చూపించింది. సుధాకర్ రెండడుగులు వేసేసరికి, తన ప్రక్కగా ఒక పండు ముసలిది కర్ర చేత్తో పట్టు కుని వణుకుతూ తూలిపోతూ రావడం కనిపించింది. అడుగు తీసి అడుగు పెట్ట లేకపోతూంది ఆ ముసలమ్మ. అక్కడ వున్న పందలాది ఆడపిల్లలలో ఒక రయినా, పాపం, ఆ ముసలిదానివంక చూడటంలేదు. ముగ్గుబుట్టలాంటి తలతో ఊగుతూవచ్చే ఆ ముసలమ్మ నడవలేక కొద్దిగా తూలింది. వెంటనే సుధాకర్ ఆ ముసలమ్మ పక్కగా వచ్చి "అవ్వ గారూ! నేను తీసికెడతాను రండి," అంటూ ఆవిడ చెయ్యి పట్టుకున్నాడు. ఆ ముసలమ్మ మరింత వణుకుతూ "వద్దులే నాయనా!... నువ్వు నడు..." అంటూ చెయ్యి వదిలించుకోబోయింది.


కాని సుధాకర్ ఆమె చెయ్యి వదల కుండా "ఫరవాలేదు అవ్వగారూ! నేను కూడా మీ మనవడ్నే అనుకోండి, రండి రండి" అంటూ ఆవిడని నడిపించ సాగాడు. "నూ...రే...ళ్ళు... వర్ధిల్లు...తండ్రీ" అంది ముసలమ్మ. అతని వెనకనే నడుస్తూ. తమ వెనకాలే జేబురుమాలు నోటి కడ్డం పెట్టుకుని, ముసిముసిగా నవ్వుకుంటున్న ఆడపిల్లల్ని చూసేసరికి, సుధాకర్‌కు అరికాలిమంట నెత్తి కొచ్చింది. వీళ్ళు సహాయం చెయ్యరు, పైగా సహాయం చేసేవాళ్ళని చూసి నవ్వుతారు' అనుకున్నాడు కసిగా.

కొద్ది దూరంలో నిరంజని కనుపిం చింది. ప్రాణం లేచివచ్చి నట్లయింది సుధాకర్‌కు. "నిరూ"... అన్నాడు. ఎవరితోనో మాట్లాడుతున్న నిరంజని సుదాకర్ వంకతిరిగి, ఒక్కసారి నిర్ఘాంత పోయి "ఇదేమిటి?" అంది.

"మానవధర్మం" అన్నాడు సుధాకర్ రొమ్ము విరుచుకొని.

నిరంజని పకాలున నవ్వింది. అక్క డున్న చాలామంది ఆడపిల్లలు కొంత మంది ముసిముసిగా నిరంజనితో శృతి కలిపారు. సుధాకర్‌కు ఉడుకుమోత్తనం, రోషం పెరిగిపోయాయి.

"ఏందు కొచ్చిన చదువులూ, సంస్కారం లేకపోయాక ........." కోపంగా అన్నాడు. సుధాకర్ కోపానికి కూడా నిరంజని దగ్గర్నుంచి పెద్ద నవ్వే సమాధాన మయింది. సుధాకర్ చిరాకు పడ్డాడు నిరంజని అంతటితో సర్దుకుని ఆ ముసలావిడ చెయ్యి తను తీసికొని "నేను ఈవిడను భద్రంగా కూర్చో




పెడతానులే! నువ్వు వెళ్ళి కూర్చో; అదిగో అక్కడనే మొగవాళ్ళ సీట్సు ఉన్నాయి" అంది.

సుధాకర్ 'బతుకు జీవుడా!' అనుకున్నాడు. ఆ ముసలావిడ మళ్ళీ వణికే గొంతుకతో "నూ...రే...ళ్ళు... చల్లగా...వర్ధిల్లు ...నాయనా" అంది.

నిరంజనీ, మిగిలిన విద్యార్థినులూ నవ్వులు మళ్ళీ ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్లుగా ఇంచుమించు పరుగు లాంటినడకతో తన సీటు చేరుకున్నాడు సుధాకర్. అతని అదృష్టం బాగుంది. అక్కడికి అతడిక్లాస్‌మేట్ ధర్మారావుకూడా వచ్చాడు. ఇద్దరూ హాయిగా కబుర్లలో పడ్డారు. కొద్దిక్షణాలలోనే తెర లేచింది. ప్రసంగాలూ, నాటికలూ, నృత్యాలూ అయి, బహుమతిప్రదానఘట్టం వచ్చింది. ఆటలలో గెలుపొందినవారికీ, పరీక్షలలో అత్యుత్తమ మయిన మార్కులు సంపాదించినవారికీ, నాటికలలో ఉత్తమ నటన ప్రదర్శించినవారికీ బహుమతులీయబడ్డాయి 'ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్, ఫస్ట్ ప్రైజ్ — ముసలమ్మ' అని మైక్‌లో ఎనౌన్స్ చేశారు. ముసలమ్మ వేషధారిణి స్టేజీమీదకు వచ్చి బహుమతి అందుకొంది. సభలో కరతాళధ్వనులు మార్మోగుతూంటే సుధాకర్‌కు పూర్తిగా మతిపోయింది. ఇందాకటి విద్యార్థినుల నవ్వులకు కారణం తెలిసింది. నిరంజని ఎందుకు నిర్ఘాంతపోయిందో, తర్వాత ఎందుకంత నవ్విందో బోధ పడింది. సిగ్గుతో కుంచించుకుపోయాడు.

"ఆ ముసలమ్మవేషం వేసిన మానస మా మరదలు. వేషధారణ, నటన చాల చక్కగా ఉన్నాయి కదూ! ఇంటిదగ్గర నాతో తను ముసలమ్మలా నటిస్తున్నా నని

చెప్పబట్టికాని, లేకపోతే నేనుకూడా గుర్తు పట్టలేకపోయేవాడినే।" అన్నాడు ధర్మారావు.

సుధాకర్ ఏం మట్లాడలేక అవు నన్నట్లు తల ఊపాడు. అందరూ లేచారు నిరంజని వచ్చి సుధాకర్‌ను కలిసి కొంది. సుధాకర్ ధర్మారావును పరి చయం చేసాడు। నిరంజని నవ్వి, నమ స్కారం చేసి ''ఈయనతో నాకు పరి చయం లేకపోయినా తెలుసు మా మానస బావగారు." అని తన ప్రక్కనే ఉన్న అమ్మాయిని సుధాకర్‌కు పరి చయం చేస్తూ, "ఈమె మానస, నా క్లాస్ మేట్, నా స్నేహితురాలు. ఇందాక నువ్వు విశాల హృదయంతో సహాయం చేసిన ముసలమ్మ." అంది. అందమైన మానస ముఖంలో చిరునవ్వు వెలిగింది గులాబీ మొగ్గలవంటి చేతులు జోడిం చింది. సుధాకర్ ముఖం ఎఱ్ఱబడింది తడబడుతూ ''క్షమించండి" అన్నాడు. మానస చిరునవ్వుతో "క్షమించడానికి మీ రేం తప్పు చేశారూ? మిమ్మల్ని నా మనవడిగా భావించమన్నారుగా. అలాగే భావించాను." అంది. నిరంజని మళ్ళీ పకపక నవ్వింది విషయం తెలి యని ధర్మారావు ఆశ్చర్యంగా ''ఏం జరి గింది?'' అన్నాడు. మానస నవ్వుతూ జరిగింది వివరించేసరికి, అతడుకూడా హాయిగా పకపకా నవ్వాడు. పాపం, అసలే సంకోచపడే స్వభావం గల సుధా కర్ పరిస్థితి మరీ దయనీయంగా తయా రయింది.

"ఇంక మేం సెలవు తీసికొంటాం। రా సుధన్నయ్యా।'' అంది నిరంజని.

ధర్మారావు అడ్డు తగిలి తన కారులో వా రిద్దరినీ డ్రాప్ చేస్తానని అన్నాడు. మొదట నిరంజనీ, సుధాకర్‌లు మొహ మాట పడ్డారు; కాని మానసకూడా గట్టిగా బలవంత పెట్టేసరికి ఒప్పుకున్నారు.

కారు డ్రైవ్ చేస్తూ ధర్మారావు "మానసా। నీ వేషధారణ, నటనం అద్భుతం అనడానికి ఇంతకంటే పెద్ద నిదర్శనం ఏం కావాలి?'' అన్నాడు.

సుధాకర్ ఇంకా సిగ్గుపడుతూ "నాకు కొంచెం కూడా అనుమానం కలుగలేదు చాలా సహజంగా ఉంది.'' అన్నాడు.

''ఇప్పటికి మూడేళ్ళనుంచీ మానసదే ఫస్టు ప్రైజు, ప్రతి ఏడాదీను. లాస్ట్ ఇయర్ కూరగాయ లమ్మిగా వేషం వేసింది. బిఫోర్ లాస్ట్ ఇయర్ సోదమ్మి వేషం వేసింది. అప్పుడూ అందరూ ఇలాగే ప్రశంసించారు" అంది నిరంజని.

"జరిగిన సంఘటన, నా సామర్థ్యం కంటే మీ అన్నయ్య సంస్కారానికే ఎక్కువ నిదర్శనం" అంది మానస.

"సంస్కారం లేనిదాన్నని నన్ను తిట్టిపోశాడు,'' అంది నిరంజని.

"నిజంగా, నిరూ। అప్పుడు మీ అన్నయ్య చూపించిన ఆప్యాయత తలుచు కొంటే, ఇప్పటికీ చాలా గౌరవం కలుగు



"నిన్ను తప్పక పెళ్ళి చేసుకుంటాను మీనా! నీ మాదిరిగా ఇదివరకు చాలా మందిని చేసుకున్నాను. నిన్నుమాత్రం ఎందుకు నిరాశపరుస్తాను."

తుంది మీది చాలా జాలిగుండె సుధాకర్ గారూ'' అంది మానస.

ధర్మారావు అందుకుని "ఇంకా మెల్లిగా అంటావా? నవనీతం. కాలేజీలో కూడా వీడి సోషల్ సర్వీస్‌కు అంతుండదు. ఇంత మందికి ఇన్ని విధాల సహాయం చేస్తాడు కాని. మొన్న పరీక్షలలో కామేశానికి ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పమని ఎంత దీనంగా బ్రతిమాలుకున్నా వీడిగుండె కరగ లేదు," అన్నాడు.

"ఎలా ధర్మా! అది నా అంతరాత్మకు విరుద్ధమయినపని. కొన్నికొన్ని సందర్భాలు జాలి చూపించకూడదనివి ఉంటాయి. ఇది అట్లాంటిది. ఇక్కడ జాలి చూపటమే అన్యాయం," అన్నాడు సుధాకర్.

క్రమంగా సుధాకర్ ధర్మారావులు వాళ్ళ కాలేజీ కబుర్లలో పడిపోయారు. ఇంతలో నిరంజని ఇల్లు సమీపించింది. ధర్మారావు కారు ఆపుచేశాడు. సుధాకర్ నిరంజని దిగి ధర్మారావుకు, "థేంక్స్" చెప్పారు. దర్మారావు "నో మెన్షన్" అని తనకారును గృహోన్ముఖం చేశాడు,

# 2

మానవుని ప్రతి చిన్న అనుభవమూ మనస్సుకు సంబంధించినది. ఒక వృద్ధురాలికి సహాయపడుతున్నట్లుగా, తాను భావించినంతకాలమూ, మానస హస్తస్పర్శ; సుధాకర్‌లో ఏ విధమయిన సంచలనమూ కలిగించలేదు కాని ఆ వ్యక్తి వృద్ధురాలు కాదు; 'మానస అని తెలిసిన తరువాత స్పర్శాకాలంలో ఏమీ అనుపించని ఆ స్పర్శాస్మృతి అతనికి గిలిగింతలు పెడుతూంది. మానసతో జరిగిన సంభాషణా, కాంతులు విరజిమ్మే ఆమె కళ్ళూ, వెన్నెలలాంటి ఆమె మందహాసమూ తప్ప అతని మనోవీధిలో మరొకటి స్థానం కల్పించుకోలేకపోతూంది. తన కొడుకు పరధ్యానము గుర్తించిన సీతమ్మ చాలా కలవరపడింది. సుధాకర్ పరధ్యానం ఆమె కలవాటయినదే అయినా, ఈసారి మరీ శృతిమించి రాగాన పడింది. చారూ అన్నం తిని పెరుగుమాట మర్చిపోయి, చెయ్యి కడిగేసుకున్నాడు సుధాకర్. వంటింట్లోంచి పెరుగుగిన్నెతో ఇవతలకు వచ్చిన సీతమ్మగారు ఆశ్చర్యపోయి "సుధా! పెరుగుపోసుకోవా?" అంది.

తను పెరుగు పోసుకోలేదన్న సంగతి అప్పటికి తెలిసింది సుధాకర్‌కు. సిగ్గుపడి "కొంచెం జలుబు చేసిందమ్మా అందుకు ఇవాళ పెరుగు మానేద్దా మనుకున్నాను," అన్నాడు. "అన్నీ అబద్ధాలు. నీకు జలుబెక్కడ చేసిందీ? పెరుగు సంగతి మర్చిపోయావు. దేన్ని గురించి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావో చెప్పు" కష్టంగా అంది సీతమ్మ.

"పరీక్షలు దగ్గరి కొస్తున్నాయమ్మా!" తప్పించుకోవా లని చూశాడు సుధ.

"అందుకే అంతగ చదువుతున్నావు." అప్పుడే అక్కడికి వచ్చిన నిరంజని అందుకొంది. వాస్తవానికి అప్పటికి పది పదిహేను రోజుల్నుంచీ అంటే నిరంజని ఆహ్వానంమీద వుమన్స్ కాలేజీ కెళ్ళి వచ్చినప్పటినుండీ, సరిగ్గా పుస్తకం తెరవలేదు సుధ.

సుధాకర్ నవ్వుతూ నిరంజని నెత్తిమీద ఒక మొట్టికాయ వేసి బయటకు వెళ్ళిపోయాడు.

"చూడు నిరూ! ఈ మధ్య వీడి ధోరణి ఇలా తయారయింది." అంది దిగులుగా సీతమ్మ. నిరంజని నవ్వుతూ "పెళ్ళి చేసేసెయ్యి పిన్నీ! అన్ని రోగాలూ కుదిరిపోతాయి" అంది.

సీతమ్మగారు ఉలిక్కిపడి "ఆదేమిటి నిరూ, మొన్న మీ కాలేజీకి వచ్చినప్పుడేమైనా జరిగిందా? అప్పటినుంచే బొత్తిగా ఇలా తయారయ్యాడు," అంది.

నిరంజని తెల్లబోయింది. ఆ పైమాట లామె కేవలం నవ్వుతాలకు అంది. తన పినతల్లి ఇలా మాట్లాడగానే నిరంజని మనస్సులో మానస మెదిలింది. సౌందర్యానికి నిర్వచనం మానస. ఆమె



ఎవరి హృదయాన్నైనా ఆకర్షించగలదు. కొంపదీసి సుధన్నయ్య తన హృదయంతో మానసను ప్రతిష్ఠించుకోలేదు గదా! ఇంతకంటె అవాంఛనీయమైన సంగతి మరొకటి ఉండదు. ఇదే నిజమైతే ఈ భావనను మొగ్గలోనే తుంచెయ్యాలి. తన పినతల్లి ఏం మాట్లాడిందిగూడా వినిపించుకోకుండా గబగబ బయటకు వచ్చింది నిరంజని. ముందు వరండాలో పడకకుర్చీలో కూర్చుని ఇలస్ట్రేటెడ్ వీక్లీ తిరగేస్తున్నాడు సుధ. నిరంజని వచ్చి ఆతని పక్కన కూర్చుంది. ఎన్నో విషయాలు అతనికి చెప్పాలని; కాని ఎలా చెప్పాలో అసలు విషయాన్నెలా కదపాలో నిరంజని కర్థం కావటంలేదు

"నిరూ!" సుధాకర్ తానే పిలిచాడు.

"ఏమి టన్నయ్యా?"

"నీ కామె బాగా దగ్గర స్నేహితురాలా?"

"ఎవరూ?"

"నీకు తెలుసులే! చెప్పవూ?"

"బాగుంది! నువ్వు చెప్పకుండా నా కెలా తెలుస్తుందీ?"

"నీకు తెలుసనడానికి నీ పెదవులమీది అల్లరినవ్వే సాక్ష్యం"

"మానస సంగతేనా?"

"ఊ! ఎప్పుడూ నీతో మనింటికి రాలేదుకదూ! నువ్వు రమ్మంటే రాదా!"

"అయ్యబాబోయ్! అప్పుడే అంత వరకూ వచ్చిందా కథ?"

"నీ తలకాయ, కథాలేదు కాకరకాయా లేదు ఊరికే అడుగుతూంటే..."

కథలేదు కాని, కాకరకాయ తప్పకుండా ఉంది. అంటే కాకరకాయ చేదులాంటి నిజం నీయెత్తు ధనం పోసినా మానస మనింటికి రాదు"

"అదేం నిరూ? అంతగర్వమా?"

"ఏకోశానా గర్వంలేదు."

"మరి."

"చెప్పమంటావా ? మనం హరి జనులం, మన ఇంటి పరిసరాలకుకూడా మానస రాదు ఒకవేళ కర్మవశాత్తూ వస్తే వెంటనే ఇంటికి వెళ్ళి, తలారా స్నానం చేస్తుంది "

సుధాకర్ అత్యంతాశ్చర్యంగా నిరంజనివంక చూశాడు.

"ఏమిటి నిరూ ! అంత చదువు కొన్నది. మాటలలో అంతసంస్కారం కనుపిస్తుంది. అంత సంకుచితమైన కుల తత్వాలు కలిగి ఉంటుం దంటావా ?"

"అనక తప్ప దన్నయ్యా ! నిజంగా మానసను ఎంత పొగిడినా తనివి తీరదు. చక్కని చుక్క, నిగర్వి, మిత భాషి, హుషారైనది, నవనీతంలాంటి మనసు, ఎంతో తెలివైనది. అయితేనేం చంద్రుడిలో మచ్చలాగ ఆ అమ్మాయిలో విపరీతమైన కులతత్వం నిండిఉంది. పళ్ళు తప్ప కాలేజీలో ఏమీ తినదు ఆ పళ్ళయినా తక్కిన బ్రాహ్మణ పిల్లలతో కలిసితప్ప తినదు నాతో తను ఇంత స్నేహంగా ఉండటానికి కారణం నా కులం తనకు తెలియకపోవటమే ! నేనే తెలియనియ్యలేదు 'చాదస్తం' అని మేము వెక్కిరిస్తే 'అలాగే అనుకోండి, ఆ విషయంలో నన్ను వదిలివేయండి." అంటుంది నవ్వుతూ, ఒకరోజు ఏదో పుస్తకం కావలసివచ్చి తనతో కాలేజీ నుంచి వాళ్ళింటికి వెళ్ళాను తను లోపలకు వెళ్ళకుండా బయటే నిల్చుని వాళ్ళ అమ్మగారిని పుస్తకం అందియ్య మంది. నేను ఆశ్చర్యంతో కారణం అడిగాను.

"కాలేజీ బట్టలతో ఇంట్లోకి వెళ్ళను. ఈబట్టలు మార్చి స్నానం చేసి అప్పుడు లోపల తిరుగుతాను. మా అమ్మకు చాలా మడీ, ఆచారం. తన ఆచారం నే నెందుకు పాడుచెయ్యాలి ? అదీగాక ఎవరిసంప్రదాయం వారు అనుసరించా లనే నా మతం అందులోనే ఉంద ముంది." అని సమాధానం చెప్పింది. విభ్రాంతితో ఇంకేమీ వాదించలేక పోయాను రోజూ తనలాగే చేస్తుం దట. ఇప్పుడు చెప్పన్నయ్యా ! మాన సను మనింటికి తీసికొనిరావటం సాధ్య మవుతుందా ? ఇట్లాంటి ఆలోచనలు రానియ్యకు."

సుధాకర్ కళ్ళు భారంగా మూతలు పడ్డాయి.

"నిరూ !" అన్నాడు కష్టంగా.

"నిజం అన్నయ్యా ! మానస మన ఇంటికి రాదు. ఇంకోసంగతి..." నిరం జని అనింది.

"చెప్పు" కుతూహలంగా అడిగాడు సుధాకర్.

"ధర్మారావుగారు నీకూ తెలుసుగా ? ఆయన మానసకు మేనత్త కొడుకు. మానస మాటలనుబట్టి వాళ్ళిద్దరిమధ్యా అనురాగం ఉందేమో ననిపిస్తుంది."



సాంబారులో ఈగా! హుష్!! ఏదీ!
కాకి ఎత్తుకుపోయింది- ఇహ భోంచెయ్యగలం.

"నిజమా?"

"నాకు తెలియదు. అలా అనిపించింది."

సుధాకర్ తన తల రెండుచేతులతో గట్టిగా పట్టుకున్నాడు. నిరంజని ఆ చేతులను తొలగించి తన చేతులలోకి తీసుకొని "ఆ ఆకాశంలో చందమామ కావాలని ఆరాటపడటం పసివాళ్ళ లక్షణం అన్నయ్యా! పిచ్చివాళ్ళుతప్ప జ్ఞానం వచ్చినవాళ్ళెవరూ అట్లాంటి కోరికలు కలుగనియ్యరు. నీకు చెప్పేపాటి విజ్ఞానిని కాదు; ఆలోచించుకో!" అంది అనునయంగా.

"కాదు నిరూ: నేను పిచ్చివాడి ననుకున్నా నాకు బాధలేదు కాని, నాకు ఆ చందమామ కావాలి. చందమామను నా దగ్గరకు తెచ్చుకొంటాను, లేక నేనైనా చందమామదగ్గరకు వెళ్తాను. ఏమో నిరూ! నే నేం మాట్లాడుతున్నానో నాకే అర్థం కావటంలేదు. నువ్వెళ్ళు—" జీరబోయిన గొంతుకతో అన్నాడు సుధాకర్. నిరంజని గుండెల్లో రాయి పడింది. సుధ ఈ విషయంలో ఇంత లోతుకు పోయాడని ఆమె ఊహించలేదు. మానసవంటి సౌందర్యవతిని చూసి ఏదో మానవసహజంగా కలలు కంటున్నాడనుకొంది. 'మానసగురించి వివరంగా చెప్తే ఆ కలలు కరిగిపోతా'యని ఆశించింది కానీ ఇంతక్షోభ పడ్తాడనుకోలేదు. ఏం చెయ్యాలో తోచక సీతమ్మతో చెప్పి, దిలుగుగా తమ ఇంటికి బయలుదేరింది. (సశేషం)

# సాగరసంగమము

ఆనందారామం

[చాలా వింతపరిస్థితిలో సుధాకర్‌కు మానస పరిచయమైంది, అతనిలో ఆమెపై ప్రేమ అంకురించింది. సుధాకర్ పినతల్లికూతురు నిరంజని అతని విషయం తెలుసుకొని మానసకూ తమకూ ఎంతో అంతరం ఉన్నదని చెపుతుంది. కాని సుధాకర్ మానస మీది ప్రేమను మరల్చుకోలేకపోయాడు]

—తరువాత

## 3

రాత్రి పదిగంట లయింది. భోజనాలు పూర్తి చేసి అందరూ నిద్రపోతున్నారు. చీపురు చప్పుడు వినిపించి మానస పక్కమీదనుంచి లేచివచ్చింది. అన్నపూర్ణమ్మగారు వంటిల్లు కడుక్కుంటున్నారు.

"అమ్మా! ఇంత వయసు వచ్చి నీకెందు కీ యాతన? నువ్వు ఇవతలకు రా, నేను కడుగుతాను." అంటూనే రెండడుగులు ముందుకు వేసింది మానస.

అన్నపూర్ణమ్మగారు గాభరా పడిపోతూ "ఆ! ఆ! మానసా! నువ్వు లోపలకు రావద్దు, నేను కడుక్కుంటాను. నువ్వు పోయి పడుకో." అంది.

మానస ఆగిపోయి "అదే మమ్మా! నీ మడికి నేనుకూడా పనికిరానా?" అంది.

ఆమె కంఠధ్వనిలో ఏదో ఆవేదన అవ్యక్తంగా ధ్వనించింది. వెంటనే అన్నపూర్ణమ్మగారు తను చీపురు క్రింద పడేసి బయటకు వచ్చి కూతురిని దగ్గరగా తీసికొని ఆర్ద్రకంఠంతో "అయ్యో! ఎంతమాటన్నావే? నాకు లోకమంతా నీ తర్వాతనే! ఆ ఒక్క దేవుడి గడిమాత్రం నాకోసం, నా ఒక్కదానికోసం అని కేటాయించుకొన్నాను. నువ్వు వీల్లేదంటే అది కూడా వదిలేస్తాను." అంది. ఆమె కంఠస్వరంలోనూ ఏదో గంభీర విషాదం దోబూచులాడింది. మానస కరిగిపోయింది.

"వద్దమ్మా! ఊరికే నువ్వు కడుక్కుంటూంటే చూడలేక అన్నాను నీకెలా తృప్తిగా ఉంటే అలాగే చేసికో!" అంటూ వెళ్ళి మళ్ళీ మంచంమీద పడు



కుంది. ఆ రాత్రి నిశ్శబ్దతలో అన్నపూర్ణమ్మగారు మళ్ళీ స్నానం చేస్తున్న చప్పుడు చక్కగా వినిపించింది మానసకు. తనను ముట్టుకున్న కారణంగా, తిరిగి స్నానం చేసి మరీ దేవుడి గదిలోకి వెళ్తుంది. తను నిష్కారణంగా తల్లికి మరింత కష్టం కలిగించినందుకు చాలా బాధపడింది మానస. అయినా తన తల్లికి, మరీ, ఇంత చాదస్తమేమిటో? కన్నకూతుర్ని ముట్టుకుంటే


కూడా తిరిగి స్నానం చెయ్యాలా? అమ్మ దినచర్య అంతా ఈ మడి తడుల తోనే గడుస్తుంది. తనకు జ్ఞానం వచ్చిన దగ్గర్నుంచీ ఒక్కసారయినా అమ్మా, నాన్నగారూ కులాసాగా మాట్లాడుకోగా చూడలేదు. నాన్నగారు అమ్మకెంతో గౌరవమిస్తారు. ప్రతి విషయంలోనూ, ఆమె సలహా పాటిస్తారు. అయినా చిలిపిగా అల్లరిగా మాత్రం ఎన్నడూ మాట్లాడరు కొంపదీసి, నాన్నగారితో మాట్లాడటానికి కూడా అమ్మకు తన మడి అడ్డం కాదుగదా! అయినా, ఇద్దరూ మాత్రం తనమీద అమృతం వర్షిస్తారు. అమ్మ మరీను. తనే ప్రాణం, తనే లోకం. ఒక్కరోజు కాలేజినుండి రావడానికి, ఒక్క క్షణం, ఆలస్య మయితే చాలు, అమ్మముఖం చూడాలి. లోకం లోని ఆవేదన అంతా తన ముఖంలోనే నివాసం చేస్తుంది. దేవత అమ్మ. తన మూలంగా అమ్మ మనస్సుకు ఎన్నడూ ఏ విధంగానూ నొప్పి కలుగకూడదు. తను కాలెజీనుంచి వచ్చి బట్టలు మార్చుకుని, స్నానం చేసి మరీ లోపలకు వస్తే అమ్మ నవ్వుతూ "ఈ చాదస్తా లన్నీ నాలో జీర్ణించుకు పోయి, ఎలానూ నన్ను వదలవు. నీకుకూడా ఎందుకూ?" అంటుంది.

"మరి కాలేజీ బట్టలతో వస్తే ఇంట్లో తిరగనిస్తావా?" ఆశ్చర్యంగా అంది తను.

"ఆ! ఇల్లంతా నీ ఇష్టం. ఎలా తిరిగినా నే నేం అడగను. నా దేవుడిగది మాత్రం నాకు వదిలెయ్యి, చాలు!" అంది

అమ్మ అలా అనడానికి తనమీది వాత్సల్యమే కారణ మని తన ఊహ. అయినా అమ్మ అలా అన్నంత మాత్రాన, తను అమ్మ కిష్టంలేని పనులు చేయగలదా? సాయంత్రం కాలేజీనుండి వచ్చి స్నానం చేస్తుంటే. అమ్మ కళ్ళలో ఎంతజాలీ!! "ఇంకా నిద్రపోలేదా మానసా?" పీట తలక్రింద పెట్టుకొని కటిక నేలమీద నడుం వాల్చబోతూ అడిగారు అన్నపూర్ణమ్మగారు.

తనతల్లి అలా పడుకోవడం మానస ఎంతమాత్రం సహించలేదు. అయినా ఆమె అశక్తురాలు ఎన్ని విధాల మానస ప్రయత్నించినా తల్లిని మంచం మీద కానీ, పరుపుమీద కానీ, చివరకు చాపమీదకానీ పడుకోబెట్టలేకపోయింది. ఒకరోజు మానస తనుకూడా క్రింద పడుకొని "నువ్వు మంచంమీద పడుకోంటేనే కాని, నేనూ పడుకోనూ," అని పట్టుబడితే అన్నపూర్ణమ్మగారు, ఎన్ని విధాల లాలించి బుజ్జగించినా మానస తనపట్టు విడువలేదు. చివరకు అన్నపూర్ణమ్మగారు విసిగి "మానసా! నువ్వు క్రింద పడుకోటానికి వీలులేదు, లేచి మంచంమీద పడుకో," అని ఆజ్ఞాపించింది. అన్నపూర్ణమ్మగారు సాధారణంగా ఎవ్వరినీ ఆజ్ఞాపించదు.




ఎప్పుడూ వెన్నెలవలె మందహాసం వెలిగే ఆమె ముఖం గంభీరమయి శాంత దృఢ స్వరంతో ఆజ్ఞాపించినపుడు మాత్రం, ఆ ఆజ్ఞను కాదనేశక్తి ఆ ఇంట్లో ఎవరికీ ఉండదు. మానస అంత పట్టుదలా ఏమయిపోయిందో, వెంటనే లేచి మంచంమీదకు వచ్చేసింది. ఇవాళ్ళ తల్లి కటికనేలమీద పడుకుంటూంటే, మళ్ళీ మానస కెంతో కష్టం కలిగింది. వద్దని చెప్పే సాహసంమాత్రం లేదు.

"అమ్మా! నువ్వన్ని విషయాల లోనూ, ఎంతో సంస్కారం కలదాని లాగా ప్రవర్తిస్తావు. ఇంత తీవ్రమైన మడి ఏమిటమ్మా!" అంది.

"ఏం? ఇలా మడిగా ఉండటం సంస్కారం కాదంటావా?" అంది అన్నపూర్ణమ్మ.

"ఎవరినీ ముట్టుకోకూడ దనటం, ముట్టుకుంటే స్నానం చెయ్యాలనడం, కులతత్వం, ఇదంతా సంస్కార మంటారా,"

"సంస్కార మని దేన్నంటారో దేన్ననరో నాకు తెలియదే మానసా! కానీ, నేను హిందూకుటుంబానికి చెందిన దాన్ని. ప్రాచీన హైందవ సంప్రదాయానుసరణమే నా లక్ష్యం. కులవిభజన మన జాతీయ జీవన విధానానికి తగినది ఇన్ని కులా లున్నాయి. ఏది ఎక్కువ, ఏది తక్కువ అన్న ప్రశ్న లేదు. దేని ఎక్కువ దానిది; ఎవరి ఆచారాలు వాళ్ళవి.

వాళ్ళవాళ్ళ మనస్తత్వాలను బట్టీ, అనుసరించే జీవనవిధానాన్ని బట్టీ ఆచారాలూ, సంప్రదాయాలూ ఉంటాయి 'నాకు కులం పట్టింపు లేదు. అంతా ఒకటే' అని నోటితో అంటూ, ప్రవర్తనలో మాత్రం కులపక్షపాతం చూపించేవాళ్ళందర్నీ ఏమంటావు? ఒక విధానం నా కలవాటయింది. అది అమాంతంగా మార్చుకోవలసినంత దోషంకానీ, అవసరంకానీ నా కందులో కనపించలేదు. ఇంకో కులంవాళ్ళను ముట్టుకోను. నిజమే. కాని, నా మనసుకి మాత్రం ప్రపంచంలోని వ్యక్తులందరూ సమానమే! అందర్నీ ఒక్కలాగ అభిమానిస్తాను ధర్మము కాలాధీనము. కానీ అన్ని ధర్మాలకూ అతీతమయినది హృదయము. దీనిని నీ గురువుగా స్వీకరిస్తే నువ్వెప్పుడూ న్యాయమార్గంలోనే నడుస్తావు. ఈ ఆచారాలు వదిలివేయటానికి నా హృదయం అంగీకరించదు. అత్యంత సున్నితమైన నా హృదయాన్ని క్షోభింపచేసి కులతత్వాన్నీ, ఆచార సంప్రదాయాల్నీ వదులుకోవలసిన అవసరమేమొచ్చింది చెప్పు? ఇంకొక సంగతి; ఇదంతా కేవలం నా ఒక్కదానికే సంబంధించినది ఇంకెవర్నీ, చివరకు నిన్నుగూడా, నేను ఇదే మార్గంలో నడవమని శాసించను. మీకు న్యాయమని తోచిన మార్గంలో మీరు నడవండి."

ఇంక మాట్లాడవలసిందేమీ లేనట్లు అటు తిరిగి కళ్లు మూసుకొన్నారు అన్నపూర్ణమ్మగారు. మానసకూడా విధిలేక కళ్ళు మూసుకుంది. కానీ, తిరిగి తిరిగి తల్లిమాటలే ఆమె గుండెలలో ప్రతిధ్వనిస్తున్నాయి. తను తన తల్లిని అనుసరించకపోయినా ఆమె అభ్యంతరపెట్టదు. కానీ, తన తల్లిని వ్యతిరేకించటమే! అమ్మో! జన్మలో అలాంటిపని జరగదు. అయినా కులతత్వం హైందవ జాతీయ జీవన విధానంలో జీర్ణించుకుపోయింది. విదేశీయ పరిపాలనా ప్రభావం వలననే ఇది దురాచారమనే అభిప్రాయం ప్రజలలో వ్యాప్తమయింది కానీ మొదటి నుండీ ఇటువంటి కులాచారాలను పాటించుకొంటూనే మనవారంతా సుఖసంతోషాలతో నివసించారు విదేశీయులను అన్ని విధాలా అనుసరిస్తున్నాం మనం ఎందుకు అనుకరించాలి? ఎవరి అలవాట్లూ, ఎవరి సంప్రదాయాలూ ఎవరు వదులుకొంటున్నారూ ఒక్క మనం మాత్రం వెంగళప్పల్లా ఎవరినిపడితే వారిని అనుకరించడానికి తయారవుతున్నాం ఈ ఆలోచనల మధ్య ఎప్పుడో నిద్రపట్టేసింది మానసకు.

## 4

రాత్రి భోజనాలయిన తరువాత మానస మంచంమీద పడుకొని ఏదో నవల చదువుకొంటూంది, "మానసా!" అని పిలిచిన ధర్మారావు గొంతుక వినిపించి ఆశ్చర్యంగా లేచికూర్చుంది. ఆ సమయంలో సాధారణంగా ధర్మారావు ఎప్పుడూ



"చూడమ్మా! నీవు ఎం. ఏ. చదువు, పిహెచ్. డి. చదువు,
కాని, పాలిటిక్స్‌లో మాత్రం దిగొద్దు."

మానసగదిలోకి రాదు దానితోడు అతని ముఖం ఎప్పటిలా ప్రశాంతంగా లేకుండా అదోక మాదిరిగా ఉండటంతో మానస అతనివంక వింతగా చూస్తూ "ఏం కావాలి బావా?" అంది

"నువ్వు కొంచెంసేపు డాబామీదికి రాగలవా?"

ధర్మారావు గొంతు వణికింది మానస మరింత తెల్లబోయింది. వెంటనే లేచి "అమ్మ నడిగివస్తాను" అని వంటింట్లోకి వెళ్ళింది. ధర్మారావుముఖం కొద్దిగా నల్లబడింది. చేతులు వెనక్కు కట్టుకొని అశాంతిగా అటూ ఇటూ తిరుగసాగాడు. కొద్ది క్షణాలలోనే మానస వచ్చి "అమ్మ వెళ్ళమంది; రా!" అంటూ తనే పైకి దారి తీసింది.

ద్వాదశిచంద్రుని చల్లని కాంతులలో పైకి ప్రాకిపోయిన మాధవీలత నీడలు దోబూచులాడుతుంటే ఇద్దరూ డాబా పైన కూర్చున్నారు.

"నాతో కొంచెంసేపు ఇక్కడికి రావడానికికూడా అమ్మ నడగాలా, మానసా?" అన్నాడు ధర్మారావు.

అతని గొంతు జీరలో, అతని హృదయంలోని ఆవేదన స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.

ఇంతచిన్న విషయానికి బావ ఎందుకింత బాధపడాలో మానస కర్థంకాలేదు.

"ఇందులో తప్పేముందీ! అమ్మ నడగకుండా ఏ పనైనా చేశానా బావా?"

"ఒకవేళ్ళ అత్తయ్య నిన్ను పైకి వెళ్ళవద్దని అందే అనుకో! అప్పుడు?"

"మానేస్తాను!" నిశ్చింతగా అంది మానస. ధర్మారావు ముఖం పూర్తిగా నల్లబడింది. లోగొంతుకతో "అంతేనా? పోనీ, కనీసం రాలేకపోయినందుకు బాధపడ్తావా?"

మానస కీ సంభాషణంతా అయోమయంగా ఉంది.

"నువ్వివాళ చాలా చిత్రంగా మాట్లాడుతున్నావు బావా! ఎందు కిలా నన్ను ఇరుకున పెడ్తున్నావూ?"

"చాలా చిన్నప్పటినించీ మనం కలిసి మెలిసి తిరుగుతున్నాం మానసా! అయినా ఇప్పటికీ నిన్ను సరిగా అర్థం చేసికోలేకపోతున్నాను."

"అంత తలపగలకొట్టుకోవలసిన అర్థం కాని దేముంది బావా నాలో? ఐనా, ఒకవేళ అర్థం కాకపోతే మాత్రం కొంప మునిగిపోయేదేముంది?"

ధర్మారావు బరువుగా నిట్టూర్చాడు.

"నువ్వు ఎదుటి వ్యక్తుల్ని బొత్తిగా అర్థంచేసుకోలేవు మానసా!"అన్నాడు.

మానస ధర్మారావు కభిముఖంగా కూర్చుని మాట్లాడుతున్నదల్లా గిరుక్కున వెనక్కు తిరిగింది. ఎంతకూ మానస దగ్గర్నుండి ఏ సమాధానమూ రాకపోయేసరికి ధర్మారావు మళ్ళీ "మానసా" అని పిలిచాడు; అప్పటికీ మానసదగ్గర్నుండి సమాధానం రాక పోవటంతో, ధర్మారావు చటుక్కున కూర్చున్నచోటునుంచి లేచి, మానస ప్రక్కగా వచ్చి తన చేతులతో ఆమె ముఖాన్ని తన వైపుకు తిప్పుకొని నీళ్ళు నిండిన ఆమె కళ్ళు చూసి, ఆశ్చర్యంతో, బాధతో, "నిన్నంత నొప్పించానా మానసా?" అన్నాడు. ఆశించని ఈ పరాత్వంఘటనకు మానస విచలితురాలై, వణికిపోతూ తన ముఖాన్ని ధర్మారావు చేతులనుండి తొలగించుకొని అక్కడినుండి లేచి గోడ కానుకొని నిలబడింది. ధర్మారావు తనుకూడా లేచి, ఆమెకు కొంచెం దగ్గిరగా వచ్చి, నన్ను క్షమించు మానసా! ఇంక క్రిందకు పోదాం పద." అన్నాడు.

మానస తలెత్తి, కళ్ళు తుడుచుకుని, "ఇంతకూ నువ్వు నన్ను పైకి పిలిచింది, నన్ను తెలివితక్కువ దాన్నని చెప్పి ఉడికించటానికా?" అంది.

ధర్మారావు పోబోతున్నవాడు ఆగి ఆశ్చర్యంగా మానస ముఖంలోకి చూశాడు. ఆమె కన్నీటికి కారణం, కేవలం ఉడుకుమోతుతనమే అని అర్థమయిన తరువాత అతని గుండెలలోంచి కొండంత బరువు దించిన ట్లయింది. "ఇప్పటికీ నేను చెప్పదలచుకొన్నది నీ కర్థం కాలేదా?" అన్నాడు నిమ్మళేనట్లు.



"నేను తెలివితక్కువదా న్నని నువ్వే అన్నావుగా!" రోషంగా అంది మానస.

ధర్మారావు నవ్వి "నాకు మెడ్రాస్‌లో ఉద్యోగ మయింది," అన్నాడు.

"అది చెప్పడానికా ప్రత్యేకం ఇక్కడకు లాక్కొచ్చావు? ఆ సంగతి నాకు తెలిసిందేగా!"

"అదికాదు..."

ఇంకా సస్పెన్సేనా?"

ధర్మారావు ఏం మాట్లాడకుండా అటూ ఇటూ తిరగడం మొదలుపెట్టాడు. మానస అసహనంగా తన చూపులతో అతనిని వెంబడించసాగింది. ధర్మారావు ఆగి మానస ముఖంలోకి చూస్తూ "నతో నిన్నుకూడా మెడ్రాస్ తీసికెళ్లా మని అనుకొంటున్నాను," అన్నాడు.

మానస నిర్ఘాంతపోయింది.

"అదెలా సాధ్యం? అమ్మ ఒప్పుకుంటుందా?"

"నువ్వు నా భార్య వయినపుడు ఎవరు మాత్రం ఒప్పుకోక ఏం చేస్తారూ? మానసా నిన్ను వదిలి ఉండాలనే ఆలోచననుకూడా నేను సహించలేకపోతున్నాను నేను చెప్పదలచుకున్న దింతే! నీ సమాధానం చెప్పు."

మానస తల వంచుకుని అలానే స్థాణువులా నిలబడింది. ఎంతకూ ఆమె దగ్గరనుండి ఎలాంటి ప్రతివచనమూ రాకపోవడంతో ధర్మారావు తిరిగి "ఏదో ఒకటి మాట్లాడు మానసా!" అన్నాడు.

మానస నెమ్మదిగా తలెత్తి వణుకుతున్న గొంతుకతో అంది —

"ఇట్లాంటి విషయంలో నా సమాధాన మేముంటుంది బావా! అమ్మ సమాధానమే నా సమాధానం."

"అత్తయ్య సమాధానంగురించి నాకేం సందేహం లేదు. కానీ నువ్వు చెప్పేదేమీ లేదా?"

మానస తన కనురెప్పలు బరువుగా ఎత్తి లిప్తమాత్రం అతని కళ్ళలోకి చూసి రెప్పలు వాల్చుకుంది.

"సరే! క్రిందకు పద." అంటూ మెట్లవైపు నడిచాడు ధర్మారావు. మానస మౌనంగా అతడి ననుసరించింది.

## 5

ధర్మారావు తన నిర్ణయాన్ని, అన్నపూర్ణమ్మగారికి తెలియజేయగానే, ఆవిడ నెత్తిన పిడుగుపడినట్లయింది. కాతర స్వరంతో "వీల్లేదు ధర్మా! మానస నీ భార్య కావటానికి వీల్లేదు. మీ మనసులో ఇలాంటి ఆలోచన రాకూడదని నేను జాగ్రత్త పడుతూనే ఉన్నాను. చివరకు భయపడినంతా అయింది. మానస నీ భార్య కావటం పూర్తిగా అసంభవం ధర్మా!" అంది.

ఆశించని ఈ సమాధానానికి ధర్మారావు ఒక్కక్షణం నిర్ఘాంతపోయాడు. మరుక్షణం అతనికి లోకమంతా గిర్రున తిరుగుతున్నట్లు అనిపించసాగింది. తనదే నని నిశ్చయంగా నమ్మిన మానస తనది కాకుండా పోతుందా? ఎందుకూ? తనకేం తక్కువని? ఒక్కసారిగా అతనికేదో కారణం స్ఫురించింది. ఆ కారణం తోచగానే అతని హృదయం కసితోనూ, అవమానంతోనూ భగ్గున మండింది. పరుషకంఠంతో "నన్ను క్షమించవత్తయ్యా! మీ, నా అంతస్తులు గమనించకుండా నా కోరిక బయటపెట్టడం నాదే పొరపాటు. నన్ను క్షమించు." అంటూనే బయటకు నడిచాడు.

"ధర్మా, ధర్మా!" నిలవలేక కూలబడిన అన్నపూర్ణమ్మగారి గొంతునుండి వెలువడినది పిలుపుకాదు, ఆర్తనాదం.

చివరకు ధర్మ తన నెంత నీచంగా అర్థం చేసికున్నాడన్నదే, ఆమె అవేదన. తన హృదయంలో అనుక్షణమూ "పూర్ణా! మానసను మాత్రం మన ధర్మ భార్యగా చెయ్యకు ఇదొక్కటీ నా చివరి కోరిక," యీ మాటలే ప్రతిధ్వనిస్తూంటై.

తన అన్న మరణశయ్యమీద ఉండి తనను కోరిన చివరికోరిక అది. అన్నకు ప్రమాదంగా ఉందని తెలిసి ప్రయాణమైంది తను. ఎక్కడినుంచో మానస పరుగున వచ్చి కాళ్ళను చుట్టుకుంది. అప్పటి కది మూడేళ్ళ పాప! తన భర్త బలవంతంగా దాన్ని తీసికెళ్ళబోయారు. అది గోలపెట్టి ఏడ్చింది సహించలేక తనే చేతులు చాచి మానసనందుకుని "అది నా కూతురు నాతోనే, ఆమె ఉంటుంది." అని మానసను తీసికొనే బయలుదేరింది.

తాను చేరేటప్పటికే అన్న పరిస్థితి చాలా విషమించింది ఇవాళో రేపో అనేలా ఉన్నాడు. తనను చూడగానే అన్న కళ్ళు మెరిశాయి. "వచ్చావా పూర్ణా! నువ్వు వస్తావని నాకు తెలుసమ్మా! నువ్వు నిజంగా అన్నపూర్ణవే!" అన్నాడు




"ఆఖరికి ఇక్కడ తేలావన్నమాట"

"అదేమిటన్నయ్యా! నేను రాకేమవుతానూ? నీకు పరాయిదాన్నా?' అంది.

అన్నయ్య అతికష్టంగా మాట్లాడాడు

"మీ వదిన అదృష్టవంతురాలు అంతా సుఖంగా ఉన్నప్పుడే దాటిపోయింది ఇద్దరు ఆడపిల్లల్ని మింగేశాను. ఈ ధర్మ ఒక్కడే మిగిలాడు. వాడిని నీ చేతులలో పెడుతున్నాను తల్లివైనా తండ్రివైనా నువ్వే!''

తనకు కన్నీళ్ళు కాల్వలు కట్టాయి. "అలా మాట్లాడకన్నయ్యా! జబ్బు నయమైపోతుంది అయినా, ధర్మ విషయం నువ్వు నాకంతగా చెప్పాలా? నా కళ్ళల్లో పెట్టుకొని పెంచుకొంటాను వాడి కేలోటూ రానియ్యను," అంది.

అన్నయ్య కళ్ళు తృప్తిగా మూతపడ్డాయి ధర్మారావుకోసం కళ్ళతో వెతికాడు. అల్లంతదూరాన, మానసా ధర్మా కేరింతలు కొడుతూ ఆడుకోవటం అతనికి కనుపించింది. అంతటి నీరస స్థితిలోనూ వెంటనే అసహనంగా దేవబోయి తూలాడు తను పట్టుకొని సమంగా పడుకోబెట్టింది.


ఒక్కసారి తన కళ్ళలోకి తీక్షణంగా చూశాడు. తను తలవంచుకొంది అన్నయ్య బరువుగా నిట్టూర్చి "పూర్ణా! నిన్నేమైనా, అనే అధికారం నాకు లేదు కానీ, ఎలాంటి పరిస్థితులలోనూ, మానసా ధర్మలను భార్యా భర్తలను కానియ్యనని మాటియ్యి" అని చెయ్యి చాపాడు

తను కన్నీళ్ళు ఆపుకుంటూ, "నా కంఠంలో ప్రాణం ఉండగా ఒక్కనాటికీ అలా జరుగదు," అని జాపిన అతని చేతిలో చెయ్యి కలిపింది. అన్న తెలివితో ఉన్న ఆఖరు రోజు అదే! ఆ మరునాడే ఆత డీ లోకాన్ని వదిలిపెట్టాడు. తను అన్నకిచ్చిన వాగ్దానం పాటించడానికే శాయశక్తులా ప్రయత్నిస్తూ ఉంది. ధర్మారావు కూడా బుద్ధిమంతుడు. చక్కగా చదువుకొని ప్రయోజకుడయ్యాడు ఒకే ఇంట్లో నివసించటం వల్ల కలిగే కొద్దిపాటి చనువు తప్ప, ఏ రకమైన అనుబంధాలూ, మానసా ధర్మారావుల మధ్య ఏర్పడకుండా ఉండడానికి తను చిన్నప్పటినుండీ కృషి చేసింది. అయినా, చివరకు తను భయపడినట్లే జరిగింది. మానస మనసు ఎలా ఉందో? విషాదకరంగా తన మూలంగా ఆ లేత హృదయాలు ఎంత క్షోభిస్తాయో, కానీ తనేం చెయ్యగలదూ? ఈ లోకంలో లేని తన అన్నకు మరణశయ్యమీద ఇచ్చిన వాగ్దానాన్ని తను ఎలా భంగం చెయ్యగలదూ?

ఆ రోజు ఉదయమే బయటకు వెళ్ళిన ధర్మారావు ఆ రోజూ, ఆ తరువాత రెండురోజులయ్యాక కూడా ఇంటికి చేరకోలేదు. అన్నపూర్ణమ్మకు మనసు మనసులో లేదు; తిండి నోటికి పోలేదు; కంటికి కునుకు రాలేదు; చివరకు నిత్యమూ భక్తి శ్రద్ధలతో కావించే భగవదారాధనలో కూడా ఆమె మనసు నిలువ లేదు. మానస ముఖంలో ఎక్కడా కళాకాంతులు లేవు కాలుకాలిన పిల్లిలా ఇల్లంతా కలయతిరుగుతూంది బెంగగా తల్లిముఖంలోకి చూస్తుంది, అయితే నోరువిప్పి మాత్రం ఏం మాట్లాడలేక పోతూంది. ఆనాటిరాత్రి ధర్మారావు చూపిన భావోద్వేగం ఇప్పుడిప్పుడే అర్థం కాసాగింది. ఆ రాత్రేకాదు, అప్పుడప్పుడు ధర్మారావు. వ్యంగ్యంగా సూచించిన కొన్ని భావాలుకూడా యిప్పుడే అర్థమవుతున్నాయి.

విచిత్రం! ఇన్నాళ్ళనుండీ ఇంత సన్నిహితంగా ఉన్నా ఒక్కసారికూడా బావపట్ల తన మనసులో అలాంటి భావమే రాలేదు ధర్మారావు గంభీర హృదయుడు. ఏ విషయంలోనూ, లేకిగా తేలిపోడు. అతని సౌందర్యానికి గాంభీర్యము ప్రత్యేకాకర్షణ నిస్తుంది

మానస ఇదమిత్థమనలేని ఆవేదనతో కృంగిపోతూంది. తనలో యింత ఆవేదన ఎందుకూ? అమ్మ తమ వివాహానికి ఆటంకం తెలిపినందుకా? కాదేమో ననిపిస్తుంది. ధర్మారావు తనంతట తాను ఆ ప్రసక్తి తెచ్చేవరకూ, వివాహం గురించి తాను ఆలోచించనే లేదు. తరువాతనయినా ఎందుకనో, దాన్ని గురించి ఎక్కువగా ఆలోచించలేక పోతూంది. అమ్మ అంగీకరించే ఉంటే ధర్మారావును వివాహం చేసికొని




ఉండేది తన ఆవేదన అమ్మ కాదన్నందుకు కాదు. అమ్మ కాదన్నప్పటి ధర్మారావు ముఖంలో స్పష్టంగా ద్యోతకమయిన దుర్భర విషాదాన్ని తలచుకొని. అదు యీ మూడునాలుగు రోజులుగా ఇంటికి రాకపోవడంలో అతడనుభవిస్తున్న వ్యధను తలచుకొని.

ఆ తరువాత వారం రోజులకుగాని ధర్మారావు ఇంటికి జేరుకోలేదు. ఈ వారంరోజులూ, అన్నపూర్ణమ్మగారు దుర్భరమైన అశాంతితోనే గడిపారు.

ఎవరితోనూ, ఏం మాట్లాడక తన వస్తువులు సర్దుకుంటున్న ధర్మారావు దగ్గరకు వచ్చింది మానస.

"ఇంతమంది నిలా క్షోభపెట్టి ఇక్కడినుండి వెళ్ళిపోయే అధికారం నీకు లేదు బావా ? అమ్మను చూడు !"

చివరిమాటలు ధర్మారావు వినిపించుకోలేదు,

"నేను వెళ్ళిపోవటం, నీకు బాధ కలిగిస్తుందా, మానసా ?"

కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా, ముఖం పక్కకు తిప్పుకుంది మానస

ధర్మారావు ఉప్పొంగిపోయాడు. ప్రతి విషయమూ మన మనసులోని భావానుగుణంగా దర్శింపగలగటం- మానస కన్నీళ్ళు మండుతున్న అతని హృదయాన్ని పన్నీటిజల్లులా తాకాయి. ఆ తవరకూ అనుభవించిన ఆవేదన మంచులా కరిగిపోయింది. ఆర్ద్రస్వరంతో "నిన్ను కాదనేశక్తి నాలోలేదు మానసా ? నీ అనుమతి లేకపోతే, నేనేమి

చెయ్యలేను," అన్నాడు.

మానస హాయిగా నవ్వింది.

"నీలో మెత్తదనంగాక, కోపం కూడా ఎంత తీవ్రంగా ఉంటుందో చాలా చక్కగా చూపించావు బావా!"

"నా కసలు కోపం లేదు," నవ్వుతూ అన్నాడు ధర్మారావు.

"దీన్నే నంటారో!"

ధర్మారావు సమాధాన మియ్యలేదు. అన్నపూర్ణమ్మగారు ఆ క్షణంలో ఏమీ ఆలోచించే స్థితిలో లేరు. ధర్మారావుపట్ల ఆమె మనసులో నిండివున్న అనురాగమంతా వెల్లువగా ప్రవహించసాగింది. దగ్గర కూర్చుని బలవంతపెట్టి తినిపించింది. ఎక్కడకు వెళ్ళావని కాని, ఎందుకు వెళ్ళావని కాని, ఒక్క మాటయినా అడుగలేదు. మానస అంతకంటే అతడిని ఒక క్షణమైనా విడవకుండా కూడా కూడా తిరగసాగింది. ఆరోజంతా ఏవిధయిన కల్లోలమూ లేకుండా అందరికీ చాలా హాయిగా గడిచిపోయింది. ఆ మరునాడు అన్నపూర్ణమ్మగారు వీలు చూసుకొని ధర్మారావును తనదగ్గర కూర్చోపెట్టుకుని సంభాషణ ప్రారంభించింది.

"ధర్మా! పదేళ్ళ పాపడుగా ఉన్నప్పుడు నా ఒడిలోకి వచ్చావు. ఈ నాటికీ, నన్నర్థం చేసికోలేవురా?"

అన్నపూర్ణమ్మగారి మాటలకు సిగ్గుతో తలవంచుకున్నాడు ధర్మారావు.

"క్షమించ త్తయ్యా! నా కన్నతల్లిని నేనెరుగను. కానీ, నీ దయవల్ల మాతృప్రేమనుమాత్రం సంపూర్ణంగా అనుభవించాను. తల్లిలేని కొరత నాకేనాడూ అనుభవంలోకిరాలేదు. నీమీది కోపంతో నేను వెళ్ళిపోలేదు. కానీ..."

ధర్మారావు ఆగిపోయాడు. అన్నపూర్ణమ్మ హృదయం బరువైంది. ధర్మారావు చెప్పదలుచుకున్న దామెకు తెలుసు. ఆమె పెదవులు వణికాయి.


"నాకు తెలుసు ధర్మా! నువ్వూ మానసా నా కళ్ళపండువుగా, భార్యాభర్తలు కావటంకన్న ఈ వయసులో నేను సంతోషింపదగింది మరొకటిలేదు. కానీ, మీ నాన్నగారికి నేను చేసిన వాగ్దానాన్ని పాలించే నిమిత్తమే, నీ కంతకఠినమైన సమాధాన మియ్యవలసి వచ్చింది."

ధర్మారావు తెల్లబోయాడు.

"చాలా విచిత్రంగా మాట్లాడుతున్నావ త్తయ్యా!"

"విచిత్రం కాదు బాబూ! నిజంగానే అలా జరిగింది. మీ నాన్నగారి చేతిలో చెయ్యి వేసి, తన కొడుకును నా అల్లుడుగా ఏనాడూ చేసికోనని ప్రమాణం చేశాను. ఏది ఏలా జరిగినా ఆ ప్రమాణానికి భంగం కలిగించటం నా తరం కాదు ధర్మా!"

ధర్మారావుకు తల తిరిగింది. తను తిరిగి వచ్చినప్పటి అత్తయ్యా, మానసల ఆదరణను చూసి, మానస తనదే నని నమ్మాడు. ఇప్పుడిక ఆ ఆలోచనకే




"పిల్లాడు, కేర్ మనగానే మూర్ఛపోయ్యాడు. ఆరుగురు ఆడపిల్లల తరువాత ఈసారికూడా ఆడపిల్ల అనుకున్నట్టున్నాడు."

తావులేదు అత్తయ్యను తనకు జ్ఞానం వచ్చినప్పటినుండీ తెలుసు ఆమె మాటలలో సత్యాసత్యాలను శంకించే శక్తి తనకు లేదు

"అత్తయ్యా! నాన్నగా రావిధంగా కోపించటానికి కారణమేమిటో నీకుతెలుసా?"

అన్నపూర్ణమ్మగారి ముఖం తెలతెల పోయింది.

"తెలుసు—కానీ చెప్పమని అడగకు. పరిస్థితుల ప్రాబల్యంవల్ల తప్పనిసరి అయితే తప్ప, ఆ సంగతులేవీ నేను ఎక్కడా చెప్పదలచుకోలేదు."

ఇక సంభాషణ పొడిగించటం ఇష్టం లేనట్లు అన్నపూర్ణమ్మగారు అక్కడి నుంచి లేచిపోయారు.

## 6

ఒక్కసారి మానసతో ఏకాంతంగా మాట్లాడాలని ధర్మారావు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. కానీ, సాధ్యపడటంలేదు. మానస ఎప్పుడూ తల్లివెంటే ఉంటోంది. అన్నపూర్ణమ్మగారి పక్కన ఉన్న మానసను వెనుకటిలా స్వతంత్రంగాపిల్చే ధైర్యం ధర్మారావుకు కలగటంలేదు ఒక ప్రక్కన తాను మెడ్రాస్‌లో డ్యూటీలో చేరవలసిన రోజు దగ్గిర కొస్తోంది. అకస్మాత్తుగా ధర్మారావు ఎప్పుడూ ఆశించని రీతిగా భగవంతు డాలసిని

కరుణించాడు. అన్నపూర్ణమ్మగారి బంధువుగా లోకతె ప్రసవించింది. ఎన్నడూ పెత్తనాలకూ, పేరంటాలకూ పోని అన్నపూర్ణమ్మను, ఆవిడ స్వయంగా వచ్చి "పాపకు, నీ ఆశీర్వాద మివ్వు పిన్నీ! నలుగురిని కన్నాను. కానీ, ఒక్కళ్ళూ దక్కలేదు. దీనినైనా నీ ఆశీర్వాద బలంవల్ల దక్కించుకుంటాను." అని ప్రార్థించి బలవంతపెట్టి తనఇంటికి తీసుకెళ్ళింది ఆ వచ్చిన బాంధవి కానీ, ఇటు అన్నపూర్ణమ్మగారు కానీ చిన్న పిల్ల అనే ఉద్దేశంతో మానసను రమ్మనక పోవటంవల్ల మానస ఆగిపోయింది.

"హమ్మయ్యా! ఇట్లాంటి క్షణం వస్తుందనే ఆశ పూర్తిగా వదులు కొన్నాను. ఎంతైనా పూర్తిగా దుర దృష్టవంతుణ్ని కాను మానసా! ఏమంటావూ?" అన్నాడు ధర్మారావు తన మేనత్త అటు గుమ్మం దిగగానే!

మానస నిజంగానే ఆశ్చర్యపోయింది.

"ఎట్లాంటి క్షణం? ఏది అదృష్టం? ఏది దురదృష్టం?" అంది అయోమయంగా.

ధర్మారావు సమాధానం చెప్పకుండా మానస కూర్చున్న కుర్చీకి దగ్గరగా తన కుర్చీ లాక్కుని "నిజం చెప్పు మానసా! నేను కాస్త బాగుంటానా?" అన్నాడు.

మానస పకాలున నవ్వింది.

"డార్విన్ సిద్ధాంతం నీవల్ల ఋజు వవుతుంది."

ధర్మారావుకూడా నవ్వి అంతలోనే గంభీరంగా "వేళాకోళం కాదు నిజంగా చెప్పు" అన్నాడు

మానస నిస్సంకోచంగా ధర్మారావు ముఖంలోకి చూస్తూ "నువ్వు చాలాచాలా చా.........లా బాగుంటావు బావా! నిజం!" అంది.

"నాకు కాస్త తెలివితేటలున్నాయా?"

"గంపెడు, తట్టెడు, బుట్టెడు, బోలెడు......"

"నేను భార్యా బిడ్డలకు తిండి పెట్ట గలనా?"

"ఏమో! అది నాకు తెలియదు. ఎక్కడ లేనిదీ నీకే సరిపోదు"

"అదిగో మళ్ళీ వేళాకోళం — సరిగ్గా చెప్పు. సంపాదనపరుడి వనే అనుకో గలవా?"


"యూనివర్సిటీలో లెక్చరర్ వి. నీ కేం తక్కువ?"

"మరి! మరి! — నాభార్య కావటం కే స్త్రీ కైనా వాంఛనీయమేనా?"

మానస ఉలికిపడింది. ఇప్పు డామెకు ధర్మారావు చెప్పబోయేది పూర్తిగా అర్థ మయింది. కొంచెం ఆగి —

"కేవలం వాంఛనీయమే కాదు, బావా! అది ఆమె అదృష్టం! తన తలి దండ్రుల అనుమతితో నిన్ను చేపట్ట గలిగే యువతి ధన్యురాలు" అంది.

మానస వేసిన ఈ ముందరి కాళ్ళ బందానికి గతుక్కు మని ఆమె తెలివిని మనసులో మెచ్చుకొన్నాడు. ఇక తను




ఏం చెప్పి ప్రయోజనం లేదని, అర్థమై వూరుకోలేక తిరిగి "ఈ మాటలు నువ్వు మనస్ఫూర్తిగానే అన్నట్లయితే ఆ అదృష్టవంతురాలివి నువే అయి, నన్ను దురదృష్టవంతుడ్ని కాకుండా రక్షించలేవా?" అన్నాడు.

మానస వంచిన తల ఎత్తలేకపోయింది.

"నన్నెందుకిట్లా ఇరుకున పెడతావు బావా! నీకు తెలియని దేముందీ?"

"అన్నీ తెలుసు అందుకనే చెప్తున్నాను పెద్దవాళ్ళ అర్థం లేని పంతాలకు మన జీవితాలు ఆహుతి కావలసిందేనా? చిన్నప్పటినుండీ, ఒకరికోసం ఒకరుగా బ్రతుకుతున్న మనం ఎవరో ఎప్పుడో ఇచ్చిన వాగ్దానం కారణంగా దూరం కావలిసిందేనా?"

ఆవేశంలో ధర్మారావు ముఖం ఎఱ్ఱబడిపోయింది. అతని ఆవేశానికి తెల్లబోయింది మానస అతని మాటలలో ఒక్కటి కూడా ఆమె హృదయంలో సరిగా ప్రతిధ్వనించలేదు. ధర్మారావు అనుభవిస్తున్న ఆవేదనకు జాలి తప్ప, వేరొక భావోద్వేగత యేదీ ఆమెలో కలుగనే కలుగలేదు. మానస మాట్లాడక ఊరుకోవటం చూసిన అతడు, మానస చేతిని తన చేతిలోకి తీసుకొని "ఏమంటావు మానసా! ఎవరు అవునన్నా, ఎవరు కాదన్నా, మనం భార్యాభర్తలమే! నాతో మెడ్రాస్ వచ్చేయి. అక్కడ మనం లాంఛనప్రాయంగా పెళ్ళి చేసుకోవచ్చు." అన్నాడు.

మానస మృదువుగా తన చెయ్యి విడిపించుకొని, అతడి ముఖంలోకి

చూసింది. ఆ ముఖం చూసేసరికి, ఆమె చెప్పాలనుకున్న అనేక విషయాలు ఆమె గొంతుకలోనే నిలిచిపోతున్నాయి. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"నన్ను క్షమించు బావా! ఈ విషయం నువ్వు భావించినంత తీవ్రంగా నేను భావించలేకపోతున్నాను. అంతేగాక నాకు అమ్మ మాట వేదవాక్కు. నన్ను అమ్మ ఏ విషయంలోనూ నిర్బంధించదు. మనం మెడ్రాస్ పారిపోనక్కర్లేదు నేను పట్టుబడితే అమ్మ కాదనదు. కానీ, అమ్మ అభిప్రాయానికి వ్యతిరిక్తమయిన ఊహ కూడా నాకు రాదు ఏనాడూ అమ్మ తన నోటితో మన వివాహం అసంభవ మని అందో, ఆనాటినుండీ నీ విషయంలో నా కా సంబంధమయిన ఆలోచన లన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. నేను నిన్ను ఎప్పుడూ ప్రాణాధికంగా అభిమానిస్తాను. కానీ, పెళ్ళిప్రస్తావన మాత్రం వద్దు."


ధర్మారావు ఉసూరుమన్నాడు. అతని కిదంత పెద్ద దెబ్బకాదు. మానస దగ్గర నుండి ఏదో ఇటువంటి సమాధానమే ఆశించాడు. అయినా ఆశ చంపుకోలేక అడిగాడు - యుక్తవయస్కురాలు అయినా తనదైన అభిప్రాయం లేక 'అమ్మ అమ్మ' అనే ఈ మానస అతనికి ఆశ్చర్యాన్ని, ఆవేదననూ, జాలినీకూడా కలగచేసింది. వేదనతో గొంతు వణుకుతూ ఉండగా "అయితే మనిద్దరమూ జీవితాంతమూ ఇలా అవివాహితులుగానే ఉండిపోవలసిందేనా ?" అన్నాడు.

మానస మరింత ఆశ్చర్యపోయింది. ఏమిటీ బావ? ఎంత ఆలోచించినా, ఇతని మనసు తనకు అర్థం కావటంలేదు. ఎందుకింత ఆవేదన? పైగా ఇలా మాట్లాడతాడేమిటీ?

మానస మౌనానికి ధర్మారావు కృంగిపోయాడు. మొదటిసారిగా మానస తూష్ణీభావానికి తల్లి అనంగీకారం ఒకటే కారణం కాదేమో నని అనిపించింది.

"క్షమించు మానసా ! మనిద్దరం అన్నాను కదూ! ఎంత వెఱ్ఱివాణ్ణో చూడు నిన్ను వివాహం చేసికోవద్దనటానికి నేనెవర్ని? నీకు నచ్చిన యువకుడిని చేసికొని కలకాలం సుఖంగా ఉండు! నా మీద దయ ఉంచి నన్ను పిలిస్తే వచ్చి ఆశీర్వదిస్తాను."

అతని కళ్ళల్లో లీలగా సుడులు తిరిగిన నీళ్ళు చూసి మానస ద్రవించింది. తన బావ ఎంతటి గంభీరుడో, ఆమె ఎరుగును. అట్లాంటివాడు ఇంత బేలయిపోతూంటే, మానసకు కడుపులో దేవినట్లయింది, చటుక్కున ధర్మారావు రెండుచేతులూ పట్టుకుని "నీకు పుణ్యముంటుంది, ఇలా మాట్లాడకు బావా ! నేను నిన్ను ఎంత అభిమానిస్తున్నానో చెప్పినా నమ్మలేవు, నిజం చెప్పాలంటే, ఎందుకనో, పెళ్ళినిగురించిన ఆలోచన లేనీ నన్ను కదిలించటంలేదు. నీ ఆవేదన చూడలేకపోతున్నాను. ఎందుకంత బాధ



పడాలో అర్థం కావటంలేదు కూడా! ప్రస్తుతం నాకున్న పెద్దకోరికల్లా, నువ్వు సంతోషంగా సుఖంగా ఉండాలనే! అమ్మ మాట కాదనటం కానీ, అమ్మ కనంగీకారమైన పని చేయటంకానీ నాకు పూర్తిగా అసంభవం. నాకోసం, నా మనశ్శాంతికై హాయిగా నవ్వి, వెనుకటిలా మాట్లాడు బావా!" అంది ఆర్ద్రకంఠంతో.

ధర్మారావు బరువుగా నిట్టూర్చి, మానస చేతులనుండి తన చేతులు విడిపించుకొన్నాడు. పేలవమైన చిరునవ్వు పెదవులమీదకు తెచ్చిపెట్టుకొని "ఇలాంటి ఆవేదన స్వానుభవైకవేద్యం మానసా! నీ శ్రేయోభిలాషిగా నీ కిలాంటి ఆవేదన అనుభవంలోకి రాకూడదనే వాంఛిస్తున్నాను. సరే నే వెళ్తాను."

అంటూ ధర్మారావు లేవబోయాడు. అతనిని ఆపు చేస్తూ "నువ్వెందాక జీవితాంతం అవివాహితుడిగా ఉంటానన్నావు అలా వీల్లేదు బావా! నీకు తగిన కన్యను చూచి నువ్వు వివాహమాడి తీరవలసిందే! అలా చేస్తానని నాకు మాటివ్వు" అంది చేతులు జాపుతూ.

మానసకంఠంలో వాత్సల్యం తొణికిసలాడింది. సౌందర్యం రూపు కట్టిన ఆ ముగ్ధమోహన నిర్మలమూర్తిని చూస్తూ ధర్మారావు కొద్దిక్షణాలు అచేతనంగా నిలబడ్డాడు. తరువాత ఆమె జాపిన చేతిలో తనచేతిని ఉంచుతూ, "అలాగే మానసా! నువ్వు చెప్పినట్లే చేస్తాను. ఈరోజేకాదు, నా జీవితంలో ఏరోజూ నీ ఇష్టానికి వ్యతిరేకమయినపని చేయను. నీ శ్రేయోభిలాషి, ఆప్తమిత్రుడూ ఏవేళలోనైనా, ఎట్లాంటి సహాయమైనా చేయగలవాడూ నీ బావ ఉన్నాడని గుర్తుంచుకో!" అని ఆమె సమాధానంకోసం ఎదురు చూడకుండానే అక్కడినుండి వెళ్ళిపోయాడు.

# 7

నిరంజనికికూడా మెడ్రాస్‌లోనే ట్యూటర్‌గా ఉద్యోగం దొరికిందన్న సంగతి మానసకు అంతులేని ఆనందాన్ని కలిగించింది – నిరంజనిని కష్టం మీద ఒప్పించి, ధర్మారావుతోపాటే ప్రయాణం కట్టించింది – తన బావకు మంచికంపెనీ ఉంటుంది

ఆరోజే, నిరంజనీ ధర్మారావులు ప్రయాణ మవుతున్నారు – మానస, సుధాకర్ స్టేషన్‌కు వెళ్లారు. సుధాకర్ నవ్వుతూ నిలబడున్నాడు; కానీ, మానస మాత్రం ఒక్క క్షణమయినా ఆగకుండా, ధర్మారావు తన ఆరోగ్యం గురించి తీసికోవలసిన జాగ్రత్తలూ, ఆహార విషయంలో తీసికోవలసిన జాగ్రత్తా పదే పదే నొక్కి చెపుతోంది. ఉపన్యాస ధోరణిలో, ఆమె నిరంజని వంక తిరుగనయినా లేదు. ఇంతలో గంట కొట్టారు. నిరంజని "మానసా! సెలవు. గుర్తుంచుకో!" అంది. దుఃఖంతో మానస గొంతు పూడిపోయింది మాటలు రాక అలానే అన్నట్లు తల ఊపింది. ధర్మారావు నిదానంగా "నన్ను తలుచుకొని బాధపడకు. సాధ్యమైనంత త్వరలో మర్చిపో," అన్నాడు.

ఆ మాటతో మానసకు కన్నీళ్లాగలేదు. స్టేషన్‌లో ఏడవటం సభ్యతకు విరుద్ధమని చేరుమాలుతో కళ్లెంత ఒత్తుకుంటున్నా అవి స్రవిస్తూనే ఉన్నై. రైలు గుండె అదరగొట్టే పెద్ద కూతతో కదిలింది. నిరంజనీ ప్రకాశరావులు, మానసా సుధాకర్‌లు తమ దృక్పథం లోంచి దాటి పోయేంతవరకూ, చెయ్యి ఊపుతూనే ఉన్నారు.

వడిలిపోయిన మానస ముఖమూ, ఎఱ్ఱబడిన ఆమె కళ్ళూ, వణుకుతున్న ఆమె పెదవులూ సుధాకర్‌కు మరొకలాగ అర్థమయాయి. అతని హృదయం ఈర్ష్యతో, ఏదో అవ్యక్త వేదనతో కుతకుత ఉడికింది. ఇద్దరూ ప్లాట్‌ఫారం బయటకు వచ్చారు. శంకరశాస్త్రిగారి కారు డ్రైవరు మానసకోసం ఎదురు చూస్తున్నాడు. సుధాకర్‌వంక తిరిగి "మీరు కూడా మా కారులో రండి మీ ఇంటి దగ్గర డ్రాప్ చెయ్యమని డ్రైవరుతో చెపుతాను," అంది మానస

"అక్కర్లేదు లెండి. నాకు వేరే పనుంది." కొంచెం నిర్లక్ష్యంగా, విసురుగా అన్నాడు. మానస విస్తుపోయి చూసింది. తలవంచుకుని, నెమ్మదిగా కారులో కూర్చుంది. అమాయకమైన ఆమె చూపులకు సుధాకర్ కదిలిపోయాడు. చటుక్కున తనుకూడా వచ్చి డ్రైవర్ పక్కన కూర్చున్నాడు.

ఎక్కడికి కని మానస అడగలేదు –

సుధాకర్ ఏమీ చెప్పలేదు –

కిటికీలోంచి రోడ్డుమీదకు శూన్యంగా చూస్తూ కూర్చుంది మానస.

శంకరశాస్త్రిగారి ఇల్లు సమీపించింది.




అప్పటికి మానస ఈ లోకంలోకి వచ్చింది. సుధాకర్‌ను చూసి "అరెరె! క్షమించండి. మీ ఇంటిదగ్గరకు తీసికొని పొమ్మని చెప్పటం మర్చిపోయాను. మీరైనా చెప్పకపోయారా?" అంది కలవరపాటుతో.

సుధాకర్ నవ్వి "పరవాలేదులెండి. మీలాగే నేనూ, ఏదో ఆలోచిస్తున్నాను. సరే! ఇంక వెళ్తాను" అన్నాడు. మానస కంగారుగా "వద్దు వద్దు. మా డ్రైవరే మిమ్మల్ని మీ ఇంటిదగ్గర దింపుతాడు." అంది.

సుధాకర్ కొంచెం చిలిపిగా "అంతే కాపీ, మీ ఇంటిదాకా వచ్చినందుకు కాస్త టీ నీళ్లయినా ఇవ్వరన్నమాట" అన్నాడు.

మానస నాలుక కరచుకుని "మీరు లోపలకు రండి. నామనసు బాగుండలేదు. ఏంచేస్తున్నానో నాకే తెలియటంలేదు. లోపలకు రండి," అంది.

'నా మనసుకూడా బాగుండలేదు.' అనుకున్నాడు సుధాకర్.

సుధాకర్‌ను డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోపెట్టి, మానస ఇద్దరికీ ఫలహారమూ, టీ తీసికొనివచ్చింది. వేడి వేడి టీ గొంతులో పడ్డాక, మానస కొంచెం తేరుకుంది. ఎన్నడూ, ఆలోచనను కానీ, ఆవేదనను కానీ ఎరుగని మానస, ప్రప్రథమంగా ఆమెకు కలిగిన కొద్ది మానసిక సంక్షోభానికి తట్టుకోలేక పోతూంది. ఎన్నడూ సుధాకర్‌తో హద్దు మీరి మాట్లాడనిది, ఒక విధమయిన కాతరస్వరంతో "నా మూలంగానే బావ అంత క్షోభపడుతున్నాడు. కానీ, నే నేం చెయ్యగలను చెప్పండి" అంది పసిపిల్ల లాగ—

సుధాకర్ విస్తుపోయాడు......

"అదేమిటీ!? మీ బావను మీ రేం క్షోభపెట్టారు."

"అవునండీ! నేను కావాలని చెయ్యక పోయినా కారణం నేనే. మా బావ నన్ను పెళ్ళి చేసికోవా లనుకొన్నాడు. మా అమ్మ వీల్లేదంది. అమ్మ వీల్లేదంటే అది అసంభవమే దానికి కారణం నాకు తెలియదు తెలిసికోవాలని కూడాలేదు. నాకీ విషయం చాలా సామాన్యంగా ఉంది. బావమాత్రం విపరీతంగా బాధ పడ్తున్నాడు. పసితనంనుంచీ బావా, నేనూ కలిసిమెలిసి ఆడుకున్నాం. చిన్న చిన్న చిలిపికజ్జాలుకూడా మా మధ్య ఉండేవి కావు చిత్రమేమిటంటే, బావ బాధపడ్తున్నాడని తప్ప ఇంకో రకమైన ఆవేద నేదీ నా అనుభవంలోకి రావటం లేదు. అసలు నిజం చెప్పాలంటే, బావ మాటలూ, ఈ ఆలోచనలూ, అన్నీ ఒక గొడవలాగ అనిపిస్తున్నాయి నాకు. అట్లాంటి ఆలోచన లేవీ, నా కెన్నడూ రావు. నాకు బావఅంటే ఎంత అభిమాన మయినా నా చేతుల్లో లేనిదానికి నే నేం చెయ్యగలనూ?"

సుధాకర్ వీనుల్లో అమృతం వర్షించిన ట్లయింది అంతకు ఒక క్షణంకాలం క్రింద ఈర్ష్యతో ఉడికిపోయిన అతని హృదయం ఆనందంతో ఊగిపోయింది. పసిపిల్లలా, అమాయకంగా తనవంక చూసే మానస అతని మనసుకు దేవతా మూర్తిలా భాసించింది. పద్మాలలా స్వచ్ఛంగా, స్నిగ్ధంగా మెరుగులీను తున్న ఆ మెత్తనిపాదాల నొక్కసారి తన హృదయానికి హత్తుకో గలిగితే!

ఉన్నత విద్యా సంస్కారాల నల వరచుకున్న ఈ పూర్ణయవ్వనవతిలో, ఇంతటి అమాయకత్వం ఎలా చోటుచేసి కొందో? దీర్ఘనిద్రలో ఉన్న ఒకానొక రాకుమారిని, ఒకానొక ప్రియయోపాసి మధురచుంబనం మేల్కొలిపిందట! తా నంతటి అదృష్టవంతుడు కాగలడా? స్పందన ఎరుగని ఈ నిర్మల హృద యాన్ని ఉద్వేగభరితం చేయగలడా?

"ఏమిటండీ? ఈ లోకంలో ఉన్నారా?" నవ్వుతూ అంది మానస.

"లేను."

"లేరూ?! అయితే ఏ లోకంలో ఉన్నారూ?"

"ఎప్పటికీ సర్వ మానవాళికీ ధ్యేయమై, ఏనాడూ ఏవరికీ అందని ఒక సుందర నందనవనంలో."

"బాబోయ్. మీరు కవులు కాదుగదా!"

"ఇంతవరకు కాననే అనుకుంటు న్నాను. దివ్యమైన వాతావరణంలో ఉన్న ప్పుడు ఎట్లాంటివాళ్ళకైనా కవిత్వం పుట్టుకొస్తుంది కాబోలు."

మానస అల్లరిపిల్ల!

"ఇంతకూ మీరు చెప్పింది కవిత్వమే నంటారు!" అని పకపక నవ్వింది.

సుధాకర్ చెక్కిళ్ళు కొద్దిగా ఎఱ్ఱ బడ్డాయి. నవ్వినప్పుడు కొద్దిగా విడివడ్డ గులాబిరేకులవంటి ఆమె పెదవులనూ, వాటి మధ్య తళుక్కున మెరిసే తీర్చిన

పలువరసనూ చూస్తూ తనను తాను మర్చిపోయాడు. మానస తన నవ్వు ఆపి "క్షమించండి. ఎంతో చికాకుగా ఉన్న నా మనసు మీతో సంభాషణవల్ల ఉల్లాసపూరిత మయింది. మీకు చాలా థాంక్స్" అంది.

"అంతమాట అన్నందుకు మీకు థాంక్స్. మీ కింత మాత్రంగానైనా నేను ఉపకరించానంటే, అంతకంటె నాకు కావలసిం దేముందీ?"

మానసకు ఈ మాటలు విచిత్రగాం విన్పించాయి సంకోచంలాంటి దేదో భావం కలిగింది. వెంటనే ఏ సమాధానం చెప్పలేకపోయింది. ఇంతలో బయటి నుంచి కారుడ్రైవరు "అమ్మా! అయ్యా గారు ఎనిమిది గంటలకల్లా క్లబ్ దగ్గరకు రమ్మని చెప్పారు. నేను వెళ్ళనా?" అని కేక వేశాడు.

అప్పుడే మానసకు టైము దగ్గర దగ్గర ఎనిమిదయిందని తెలిసింది. బేలగా సుధాకర్ వంక చూసింది. వెంటనే సుధాకర్ లేచి నిల్చొని "కబుర్లలోపడి ఆలస్యమయింది. నేను వెడతాను." అని సెలవు తీసికొని వెళ్ళిపోయాడు. మానస బెదురుగా లోపలకు అడుగులు వేసింది మధురదరహాసప్రపూర్ణ మయిన అన్న పూర్ణమ్మగారి ముఖమండలం మానసలో శాంతిని నింపింది. ఆరాత్రి మానసకు సుధాకర్‌తో నడిచిన సంభాషణ ప్రతి అక్షరమూ తిరిగి తిరిగి గుర్తుకు రాసాగింది. ఆ విధంగా గుర్తుకు రావటం ఆమెకు ఆహ్లాదకరంగానే ఉంది కానీ. అందుకు కారణంమాత్రం ఆమె కర్థం కాలేదు. ఆ కారణం తెలిసికోవాలని ఆమె ప్రయత్నించలేదుకూడా.

# 8

నౌకరు ఆరోజు టపా అంతా తెచ్చి బల్లమీద పడవేయగానే మానస ఎంతో ఆదుర్దాగా తన ఉత్తరాలకోసం వెతికింది. మానసకు కావలసింది దొరికింది— ధర్మారావు వ్రాసిన ఉత్తరం. మూడు రోజుల కొకసారైనా ధర్మారావు అక్కడి పూర్తి వివరాల ఉత్తరం వ్రాస్తూంటాడు. మానస వెంటనే సమాధాన మిస్తూం టుంది. ఈసారి ధర్మారావు వ్రాసిన ఉత్తరం చాలా బరువుగా ఉంది ఇంత పెద్దఉత్తర మేమిటబ్బా! అనుకొంటూ, తన గదిలోకి వెళ్ళి ఉత్తరం విప్పింది.

డియర్ మానసా!

నీ కొక చాలా సంతోషం కలిగించే వార్త చెప్తున్నాను! ఏమిటో ఊహించు; ఉహూ! నీ తరంకాదు. నీ కలాంటి ఊహాలు రావు. నేను వివాహం చేసికోవడానికి నిశ్చయించుకున్నాను. ఒక్క నిమిష ఆగు. వివరాలు చెపుతాను.

ఆ అమ్మాయితో నాకు పూర్వ పరిచయం యేమంత లేకపోయినా, ఇక్కడ ఏ ర్పడ్డ పరిచయాన్ని బట్టి ఆమె నా కన్నివిధాలా గృహిణిగా తగిన దనిపించింది. ఒకనాడు యాదృచ్ఛికంగా

ఒక సంగీత సభలో కలుసుకున్నాము. ఆనాడే నా కామె బాగా పాడుతుందని తెలిసింది. నాకు సంగీత మంటే ఉండే అభిరుచివలన ఆమె స్నేహాన్ని వాంఛించాను. ఆమెకూడా స్నేహశీలి. ఆ తమిళ రాష్ట్రంలో ఆంధ్రుల మయిన మేమిద్దరమూ, కొంత సన్నిహితులమయ్యాము. రెండు రోజుల కొకసారైనా మేము ఎక్కడో ఒకచోట కలుసుకునేవాళ్ళం.

ఆమె రూపసికూడా ! ఆమె అందాన్ని నీకు ఎలావర్ణించను ? అమె నొక్కసారి చూసినవారు తప్పక అమె పునర్దర్శనాన్ని అపేక్షిస్తారు. సౌకుమార్యమూ; కాఠిన్యమూ, మృదుత్వమూ, దృఢత్వమూ, ఉత్సాహమూ, కార్య దీక్ష, వినయమూ, ఆత్మవిశ్వాసమూ రంగరించుకొని ఉన్నాయి ఆమెలో. ఆమె నా జీవిత భాగస్వామిని అయితే అదృష్టవంతుడి ననేభావం నాలో క్రమంగా స్థిరపడింది ! సభ్యతా విరుద్ధం కాని విధంలో నా ఉద్దేశ్యా న్నామెకు తెలియపరిచాను. నా పూర్వపుణ్యవిశేషంవలన ఆమె అంగీకరించింది నీకు గుర్తుందా! ఒకప్పుడు నీ కిష్టంలేని ఏపనినైనా నేను చేయనని నీకు వాగ్దానం చేశాను. అందుకే నీ అంగీకారంకోసం ఈ ఉత్తరం వ్రాస్తున్నాను ఒక్కవిషయం మానసా: అమెది పంచమకులమట ! అయినా ఏకులమయితేనేం ? ఈ కులమత భేదాలు మానవుడు ఒకనాటి సంఘనిర్మాణపద్ధతి ననుసరించి వృత్తి నాశ్రయించి నిర్ణయించుకున్నవి. వ్యక్తికి ప్రధానం గుణం కానీ కులం కాదు. విద్యావతివీ, సంస్కారవంతురాలవూ అయిన నువ్వు నా భావాలతో పూర్తిగా ఏకీభవిస్తావని నమ్ముతాను. నీ సమాధానం చూసి అత్తయ్యకూ, మామయ్యకూ వ్రాస్తాను. అటు ఆమె తరఫునుంచికూడా, ఏ విధమయిన ఆక్షేపణా ఉండదట. తొందరగా సమాధానం వ్రాస్తావుకదూ ! నీ బావ,

ధర్మారావు ..

ప్రథమంలో ఎంతో ఉత్సాహంతో ఆనందంతో ఆ ఉత్తరం చదివిన మానసకు పంచమకులం అనగానే ఒకమాదిరి వెలపరం జనించింది. తన బావ వివాహం చేసుకో బోతున్నాడనే ఆనంద మంతా ఈ భావనతో తుడిచిపెట్టుకుపోయింది. ఇట్లాంటి వివాహంకంటె అసలు వివాహమే జరగకపోవటం నయమనే భావన కూడా ఆమె అంతరాంతరాలలో మెదిలింది. కానీ, అలా తన బావకు వ్రాయగలదా ? ఒకవేళ వ్రాసినా తన మాట మన్నిస్తాడా ? ఒకసారి బావ మనసుకు మానని గాయాన్ని కలుగజేసినదయింది. దాని కేదోవిధంగా ఉపశమనం కలుగుతూంటే మళ్ళీ తనే అడ్డుపడాలా? అయినా బావకు బుద్ధిలేదు. వెళ్ళి వెళ్ళి ఆ మాలపిల్లను ప్రేమించాలా- బ్రాహ్మణ కులాలలో పిల్లలే లేనట్లు ? మేనరికం లేదని తెలియగానే ఎంతమంది అమ్మ



చుట్టూ తిరగటంలేదూ? అయినా, ఏమిటో బావకి మొదటినుంచీ ఇదొకపిచ్చి!

మానస ఆలోచనాస్రవంతి ఇక్కడ చటుక్కున ఆగిపోయింది. ఈ పిచ్చి బావకేనా! తనకు లేదా? మానసకు ఆలోచించటం ఇష్టంలేకపోయింది. అదీగాక తనసంగతి వేరు. భిన్నవర్ణస్థులతో తను స్నేహంకూడా గాఢంగా ఏర్పరచుకోదు.

అన్నిటికంటె అన్నపూర్ణమ్మగారి విషయమెలా తీసుకొంటారనేది మానసకు పెద్దదిగులైంది. జ్ఞానం వచ్చిన నాటినుండీ తనకు తెలిసిన ఆవిడ స్వభావాన్నిబట్టి దీనికావిడ ఎంతమాత్రం అంగీకరించరనేది నిశ్చయం. కాని, బావకు "నువ్వు కోరిన వివాహం వీల్లే"దని తనెలా వ్రాయగలదు? బావ తనమీద గౌరవముంచి అంగీకారంకోసరం వ్రాసినందుకు తానిచ్చే ప్రతిఫలం ఇదా? మానస మనసు ద్వైధా ఊగిపోతోంది. ఆలోచించి, ఆలోచించి చివరకు ఒక నిశ్చయానికి వచ్చింది. ఈఉత్తరం తల్లికి చూపిస్తుంది. ఆవిడఅభిప్రాయాన్నిబట్టి బావకు సమాధానం వ్రాస్తుంది.

ఆ ఉత్తరం మానస చదవగా, వింటూండగానే అన్నపూర్ణమ్మగారి ముఖం రక్తపుబొట్టు లేనట్టు తెల్లబడింది. స్మృతి తప్పుతుందా అని మానస భయపడి, విచలితస్వరంతో "అమ్మా" అంటూ వచ్చి అన్నపూర్ణమ్మగారిని గట్టిగా పట్టుకొంది. ఆవిడ నిర్లిపంగా నవ్వి "నేనొక శిలని మానసా! నాకేమీకాదు" అన్నారు. ఉత్తరానికేం సమాధానం రాయమంటావని మానస అడగలేకపోయింది. వెలవెలపోతూ, తల్లిముఖంలోకి చూస్తూ అలాగే కూర్చుంది. అన్నపూర్ణమ్మగారి చూపులు తన అన్న ఛాయాచిత్రంవంకకు మరిలాయి. గొణుగుతున్నట్లుగా, "అన్నయ్యా! నా మానసను ఇవ్వనని అనగలిగాను. ఇప్పుడు నేనేం చెయ్యగలనో చెప్పు," అన్నారు. మానస గాభరాగా, అన్నపూర్ణమ్మగారి వంటి

మీద చెయ్యి వేసి "అమ్మా" అంది. అన్నపూర్ణమ్మగారు ఆ చెయ్యిని మృదువుగా తొలగించి, "పిచ్చిపిల్లా! నా కింకా పిచ్చెక్కలేదులే! నా దురదృష్టం! అడుగడుగునా నాకు అగ్నిపరీక్షలే?'' అన్నారు. ఆరాత్రి ఎన్నడూ లేనిది అన్నపూర్ణమ్మగారికి కొద్దిగా జ్వరం తగిలింది. మానస మతిపోయి తల్లిని వదిలిపెట్ట లేదు. జ్వరంలోకూడా ఆమె కిటికీ నేలమీద పీటను తలక్రింద పెట్టుకొని పడుకొన్నారు. ఆవిడ ముఖం వంక చూస్తూ పరుపుమీద పడుకోమని అనగలిగే సాహసం కలగలేదు. ఆరాత్రి మధ్యమధ్యలో చాలా చార్లు అన్నపూర్ణమ్మగారు "అన్నయ్యా! వన్నేం చెయ్యమంటావు?" అని కలవరిస్తూనే ఉన్నారు. మానస, ఈ వివాహానికి తల్లి అంగీకారం లభిస్తుందని ఆశ పెట్టుకోలేదు. కానీ, ఆవిడ ఇంతగా క్షోభిస్తారనికూడా ఊహించలేకపోయింది.

ఆ మరునాటికే అన్నపూర్ణమ్మగారికి జ్వరం తగ్గిపోయింది. కాని, ముఖం మాత్రం బాగా వడలిపోయి, పూర్తిగా కళా విహీనమై ఉంది. మానస ఆ దోశతో తల్లి దగ్గర కూర్చుని "నువ్వు బాధపడకమ్మా! నీ కిష్టం లేకపోతే ఈ పెళ్ళిజరగదు. బావ నీ మాట కాదంటాడా? నేను వద్దని వ్రాస్తే బావ తప్పక ఈ పెళ్ళి మానుకుంటాడని నా నమ్మకం!" అంది. ఆ సంగతి అన్నపూర్ణమ్మగారికీ తెలుసు. ఆవిడ వేదన ధ్వనించే కంఠంతో "పోనీ మానసా! మాటిమాటికీ ఇలా వాడి ఆనందాన్ని భగ్నం కావించే అధికారాన్ని నా కెవరిచ్చారో చెప్పు. చిన్నప్పటినుండీ వాడిని పెంచాను. నిజమే! కానీ, దానికి ఇంత నిష్ఠురమయిన ప్రతిఫలాన్ని కోరమంటావా?" అన్నారు.

మానస తల వంచుకొంది. మానస మనసులోనూ ఇవే ప్రశ్నలు కదలాడుతున్నాయి. ఏం సమాధానమియ్యగలదూ? అన్నపూర్ణమ్మగారు బరువుగా నిట్టూర్చారు. "అంతే! ఎప్పుడూ, అంతే! తానొకటి తలిస్తే దైవమొకటితలుస్తాడు," అన్నారు.

అంతలో మానస "ఏం కాదమ్మా! నువ్వు తలిచిన దానికి వ్యతిరేకంగా దేవుడుకూడా ఏం చెయ్యలేడు. ఇవాళే బావకు ఈ వివాహం ఎంతమాత్రం వద్దని వ్రాస్తాను. మనమీద ఏమాత్రమైనా ఆపేక్ష ఉంటే మానుకొంటాడు. బాధపడతాడు. నిజమే! అయితేనేం? ఇవి వరలో మాత్రం గాయపడి, ఆగాయాన్ని మాన్చుకోలేదా! మనం ప్రయత్నించి బావకు అన్నివిధాలా అనుకూలంగా ఉండే అమ్మాయిని అతనికి భార్యను చేద్దాం. కాలమే అన్ని గాయాలనూ మాన్పుతుంది" అంది.

అన్నపూర్ణమ్మగారు ఆశగా, దిగులుగా "అలా సాధ్యమౌతుందా?" అన్నారు.

"ఎందుకుకాదూ! తప్పక అలాగే జరుగుతుంది;" దృఢంగా అంది మానస. ఆ మాటలు విన్న అన్నపూర్ణమ్మగారి ముఖంలో ఆనందరేఖలు విరిశాయి. ఆ వెలుగు చూసిన మానస సంతృప్తిగా ధర్మారావుకు ఉత్తరంరాయటానికిలేచింది.

(సశేషం)

# సాగరసంగమము

ఆనందారామం



[ధర్మారావుకు, మానస తనతో వివాహానికి అభ్యంతర పరచడంతో, నిరుత్సాహం కలిగింది. మద్రాసుకు వెళ్ళి ఉద్యోగంలో చేరిపోయాడు. సుధాకర్‌కు క్రమంగా మానసపై ప్రేమ ప్రగాఢ మౌతోంది. చాలా కాలానికి అందిన ధర్మారావు ఉత్తరంలో తాను పంచమకులజను వివాహమాడ్తానని వ్రాయడము మానసను కలతపరచింది. మానస తల్లికి తెలిపి, తను బావను ఎలాగైనా విముఖుడిని చేస్తానని, తల్లి మనస్తాపాన్ని పోగొట్టుంది.] — తరువాత

## 9

సుధాకర్ మానసను తన ఇంటికి ఆహ్వానించటానికి సాహసించలేక పోయాడు. మానస ఒకటి రెండుసార్లు తనే 'నాకు మీ అమ్మగారిని చూడాలని ఉంది' అంటేకూడా, సంభాషణను మరల్చటానికే ప్రయత్నించాడు. కానీ, ఆనాడు సుధాకర్ వచ్చేసరికే, మానస బాగా తయారై ఉంది. "ఇవాళ మీ ఇంటికి వెళ్దాం పదండి!" అంది. సుధాకర్‌కు ఇంక తప్పించుకునే మార్గం లేకపోయింది.

తన ఇల్లు సమీపిస్తున్నకొద్దీ సుధాకర్ గుండెలు దడదడ లాడుతున్నాయి. ఏదో మహాపరాధం చేసినవాడిలాగ అతడి సర్వాంగాలూ వణుకుతున్నాయి. మానస మాత్రం హుషారుగా ఏవో కబుర్లు చెపుతూంది.

తన తల్లికి మానసను పరిచయం చేసినప్పుడు సుధాకర్ గొంతు కొద్దిగా వణికింది. మానస వెంటనే వంగి సీతమ్మ పాదాలకు నమస్కరించింది. సీతమ్మగారికి, సుధాకర్‌కూ ఇద్దరికీ అమితాశ్చర్యం కలిగింది. అయితే ఈ చర్య సుధాకర్‌లో సంతోషం ఎంత కలిగించిందో, ఆవేదనకూడా అంతే కలిగించింది. సీతమ్మ చటుక్కున వెనక్కు తగ్గింది. ఎవరైనా తనకు నమస్కరించినప్పుడు అలా వెనక్కు తగ్గటం అన్నపూర్ణమ్మగారి కలవాటే. అందువల్ల సీతమ్మ అట్లా వెనక్కు తగ్గటం మానసకు సహజంగా అనిపించింది.

మానసతో ఆనాడు లక్ష సంగతులు మాట్లాడాలని సంకల్పించుకొన్నాడు సుధాకర్ మొదట్లో. కానీ, తీరా మానస వచ్చి తన ఎదురుగా కూర్చునే సరికి, అతడు వాక్య నిర్మాణక్రమమే మర్చిపోయినట్లుగా అనుభూతి పొందాడు. సంభాషణ ఎలా ప్రారంభించాలో తెలియక యథాలాపంగా "ధర్మారావు దగ్గరనుండి ఉత్తరాలు వస్తున్నాయా?" అన్నాడు. ధర్మారావు దగ్గరనుండి ఉత్తరం అనగానే మానసకు అతని వివాహనిశ్చయం సంగతి గుర్తుకొచ్చింది. తన మనసులోని ప్రతి చిన్నవిషయాన్నీ నిస్సంకోచంగా సుధాకర్‌కు చెప్పటం బాగా అలవాటయిపోయింది మానసకు.

"బావ ఇలాంటిపని చేస్తాడని నేను కలలోకూడా అనుకోలేదు." అంది ఎలాంటి ఉపోద్ఘాతమూ లేకుండా—సుధాకర్, ఆశ్చర్యంగా, ఉత్సాహంగా "ఏమిటి సంగతి?" అన్నాడు.

"వింటే మీరు ముక్కుమీద వేలేసుకుంటారు. తాను ఒక పంచమ కులజను వివాహం చేసికొంటాడుట! అందుకు నా అనుమతి కావాలిట! వ్రాయటానికి చేతు లెలా వచ్చాయో? తను జన్మించిన వంశ మేమిటి, పుట్టి పెరిగిన వాతావరణ మేమిటి, చేస్తున్న పని ఏమిటి?"




మానస ఒక్కొక్క వాక్యమూ ఒక్కొక్క సమ్మెటపెట్టులా సుధాకర్ హృదయాన్ని తాకింది. తన ముఖంలోని భావపరిణామాన్ని మానస చూడకుండా న్యూస్‌పేపర్ ముఖానికి అడ్డం పెట్టుకొన్నాడు. అతిబలవంతాన తనలోని ఉద్వేగాన్ని అణచుకుని అతిసామాన్యంగా "ఇందులో అంత విడ్డూర మేముంది? ఒకనాడు ఇట్లాంటి సంఘటన విపరీతమైతే కావచ్చు; కానీ, ఇప్పుడు సర్వసాధారణమైనది. చదువుకొని సంస్కార వంతులమైన మనంకూడా ఆ బూజుపట్టిన అభిప్రాయాల్నే పట్టుకుని వేళ్ళాడట మేమిటీ?" అన్నాడు.

మానస ముఖం జేవురించింది.

"చదువుకొంటే? అసలు నిత్యజీవన విధానంలో మన కేవిధంగానూ ఉపకరించని, ఈ ఉద్యోగపు చదువులు చదవటంకూడా ఒకపెద్ద ... తే, ఇక సంస్కారం సంగతి...అసలు సంస్కార మంటే ఏమిటీ?"

సుధాకర్ ఉత్సాహంగా ముందుకు వంగి, "నిత్యజీవన విధానాన్ని, సాంఘిక వాతావరణానికి అనుగుణంగా ఉన్నతమైన మార్గంలో మలచుకోవటం; భావనలోనూ, పలుకులోనూ, ప్రవర్తనలోనూ, సంకుచితత్వాన్ని వదిలివేయడం; ప్రతి విషయాన్ని అన్ని కోణాలనుండీ పరిశీలించగలిగే విశాల దృక్పథాన్ని అలవరచుకోవటం;" అన్నాడు.

మానస ఒక్కక్షణ ప్రశంసతో అతని వంక చూసింది. సుధాకర్ కళ్ళు మెరిశాయి. అంతలో మానస చూపులు మరల్చుకుని, "ఒప్పుకుంటాను. కాని, ఉత్తమ బ్రాహ్మణకులంలో పుట్టి, మాల పిల్లను పెళ్ళి చేసికోవటం సంస్కార సూచకమా?" అంది.

ఆమెలో బుస కొడుతున్న కుల

భావానికి సుధాకర్ మనసు చాలా గాయపడింది. ఆమెపట్ల ఎంతటి గాఢాభిమానమున్నా, ఈ మాటలకు అతని అహం గూడా కొద్దిగా దెబ్బతింది. అయినా సాధ్యమైనంత మృదువుగా "తమ కులమే చాలా గొప్పది, మరొకరి కులము నీచమైనది అని భావించకుండా ఉండగలగటం సంస్కార లక్షణం," అన్నాడు.

అతడెంత మృదువుగా అన్నా ఈ మాటలకు మానస మనసు మండింది.

"ఏ కులంలోని నియమ నిష్ఠలూ, ఆహార విహారాలూ, ఆచార వ్యవహారాలూ ఉన్నతంగా ఉంటాయో, ఆ కులాన్ని ఉన్నత మనుకోడంలో తప్పేముందీ?"

"ఆ దృష్టితో ఆలోచిస్తే అసలీ రోజుల్లో కులభేదం లేదనే చెప్పాలి. ఎందుకంటే, ఇంచుమించు అందరి ఆచార వ్యవహారాలూ ఒక్కలాగే ఉన్నాయి."

"కాదు! కాదు! ఒక్కనాటికీ కాదు; అందుకు మన కుటుంబాలే నిదర్శనం," దృఢంగా అంది మానస.

సుధాకర్‌కు నోటమాట రాలేదు. అతని గుండెల నెవరో పిండుతున్నట్లుంది. లోపలుండి అతని అంతరాత్మ గగ్గోలు పెడుతూంది. కానీ, ప్రలోభం అతని నోరు నొక్కేస్తూంది. సుధాకర్ ముఖం చూసిన మానస, తాను అతని అభిప్రాయంతో ఏకీభవించనందుకు, అతడు నొచ్చుకుంటున్నాడని భావించి, కొంచెం తగ్గి "పోనీ. మీ రన్నట్లు ఒక కులం ఎక్కువ, ఇంకొక కులం తక్కువ కాకపోవచ్చు. ఏ కులానికా ప్రత్యేకత ఉంది. కానీ, వివాహ విషయంలో మాత్రం ఈ వర్ణసంకరం పనికిరాదు. ఏమంటారూ?" అంది.

"ఎందుకని?" నీరసంగా అడిగాడు సుధ.

"నే ననుకుంటున్న కారణం చెపితే మీరు నవ్వుతారేమో."

"నవ్వను, చెప్పండి."

"మన జీవన విధానం మన అనేక జన్మల సంస్కారం మీద ఆధారపడి ఉంటుందని నా నమ్మకం. ఒక్కొక్క జీవి తన పూర్వ జన్మ సంస్కారానుసారంగా, ఒక్కొక్క కులంలో జన్మిస్తాడు. తమతమ విభిన్న సంస్కారాల ఫలితంగానే. విభిన్న కులాలలో జన్మిస్తారు. అట్లాంటి వారి వివాహం ఏ విధంగానూ ఫలవంతం కాబోదు."

సుధాకర్ దిగ్భ్రాంతి పొందాడు.

"మీ వాదంలోనే. నా మాటల్ని సమర్థించుకొంటాను. మీరు చెప్పినట్లే జీవులు. తమ అనేక జన్మల సంస్కారాన్ననుసరించి, తమ జీవన గమనాన్ని మలచుకొంటూ ఉంటారు. ఆ జన్మజన్మగత సంస్కారమే కులమతాతీతమైన

అనుబంధాన్ని రెండు జీవులలో కలిగించిందని ఎందు కనుకోకూడదు ?"

మానస తెల్లబోయింది. ఆమెకు అంతరాంతరాలల్లో ఆ మాటలు నిజమే ననిపించకపోలేదు. కానీ, ఒప్పుకోలేక పోతూంది..

"ఎంత మాత్రమూ వీల్లేదు. ఒక క్షణానికి, కోటివిధాలా పరుగులెత్తే మన మనసును నమ్మి, జన్మసిద్ధమయిన సంప్రదాయాన్ని వదులుకోవటం, ఒక విధంగా ప్రలోభానికి లొంగిపోవటమే అవుతుంది. ఒక నియమాన్ని పాటించటం చాలా కష్టం; ఒక వ్యామోహానికి లొంగిపోవటం బహుసులభం; ఒక వ్రతాన్ని పాలించలేక, ఏవో కుంటి సమర్థనలతో, వ్యామోహానికి దాసులమవటం మన ఆధిక్యాన్ని నిరూపిస్తుందంటారా ?"

సుధాకర్ సమాధానం చెప్పలేదు. గదిలో విద్యుద్దీపాలు వెలుగుతున్నా, అంసికి తన చుట్టూ అంధకారం వ్యాపించినట్లయింది. అకస్మాత్తుగా ఇద్దరి మధ్యా నిశ్శబ్దం వ్యాపించింది. ఆ భయంకర స్తబ్ధత ఇద్దరి మనసుల్లోనూ ఏదో వెలితిని నింపింది. మానస లేచి, "ఏవో కబుర్లలో పడి ఆలస్యమైంది. ఇంక నేను వెళ్తాను," అని సీతమ్మకు నమస్కరించి, బయలుదేరింది.

శంకరశాస్త్రిగారికి వంట్లో బాగుండకుండా కాళీగా ఉన్నప్పుడు తప్ప మానసకు కారుమీద ప్రయాణం చెయ్యటానికి వీల్లేదు; మానసను ఇంటిదగ్గర దింపి రావటానికి సుధాకర్ కూడా బయలుదేరాడు. ఎప్పుడూ, సరదాగా నవ్వుతూ కబుర్లు చెప్పే సుధాకర్ ఆ రోజు ముభావంగా, బరువుగా అడుగులు వేసుకుంటూ, తన ప్రక్క నడవటం గమనించిన మానస మనసు కలతబడింది.

"సుధాకర్‌గారూ! తెలిసీ తెలియక మీ మనస్సు నొప్పించి ఉంటే క్షమించండి. బావ అట్లాంటి పెళ్ళి చేసుకోకూడదనే ఆవేశంలో ఏమేమో అన్నాను; కానీ, మీరు బాధపడటం మాత్రం నేను సహించలేను."

సుధాకర్ పేలవంగా నవ్వాడు.

"నా బాధ పోగొట్టడం కోసం మీరేమైనా చెయ్యగలరా ?"

ఈ మాటల నర్థం చేసుకోలేనంత ముగ్ధకాదు మానస. అంతే కాదు, చాలా అరుదుగా, సుధాకర్ నోటివెంట వచ్చే ఈ రకమైన మాటలకోసం ఆమె మనసు ఆత్రంగా ఎదురుచూస్తూ ఉంటుంది ఒక విధమైన మధురభావనతో మనసు ఊగిపోతూంటే, "అబ్బ! నా ప్రాణాలైనా ఇస్తాను," అంది.

సుధాకర్ వాలుగా ఆమె కళ్ళలోకి చూసి, "మీ ప్రాణాలు నా కెందుకూ ?" అన్నాడు నిదానంగా"

ఈ మాటలకు సమాధానంగా తను నాయిక చివరకు పచ్చిన మాటలను,

పెదిమెలు పళ్ళతో నొక్కిపట్టి ఆపు చేసుకొంది మానస. కానీ, రేవలేక లేవలేక లేచిన బరువైన కనురెప్పల క్రింద మెరిసే నల్లని ఆమె కనుపాపలు, ఆమె మనసులోని భావాన్ని ఆమె మాటలకంటే మధురంగా అతడికి తెలియజేసాయి — సమస్తాన్నీ, చివరకు తన ఉనికిని కూడా మరిపింపచేస్తూ. ఏదో మధురమయ ప్రణయ ప్రపంచం లోకి తీసుకుపోయే ఆ కళ్ళలోకి తన్మయత్వంతో చూస్తూన్న అతని మనసు 'కనీసం ఈ కళ్ళలోకి ఇలా చూడగలిగే అదృష్టాన్ని వదలుకోలేను.' అని దీనాతిదీనంగా అంతరాత్మముందు మొర పెట్టుకొంది. ఇంతలో బస్ రావటం, మానసా సుధాకర్‌లు బస్ ఎక్కటం జరిగింది. సుధాకర్ మానస కూర్చున్న సీటుకు, మరొక ప్రక్కగా ఉన్న సీటులో కూర్చున్నాడు. మానస, తన సీటులో ఒక ప్రక్కకు ఒరిగి సుధాకర్ వంక భావయుక్తంగా చూసింది. సుధాకర్ అది గమనించనట్లు, కిటికీలోంచి, బయటకు చూస్తూ కూర్చున్నాడు. మానస దెబ్బతింది. ఆత్మాభిమానంతో ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తన ఇల్లు సమీపించగానే ఒక్క మాటైనా మాట్లాడకుండా లోపలకు వెళ్ళిపోయింది. మానసను పూర్తిగా అర్థం చేసికొన్న సుధాకర్‌కు, ఈ చర్యలవల్ల, కోపానికి బదులు జాలి కలిగింది. నిస్పృహతో కూడిన ఒక్క నిట్టూర్పు వదిలి, అన్నపూర్ణమ్మగారితో చెప్పి తనయింటికి బయలుదేరాడు.

## 10

ఎగిరెగిరి పడే కెరటాలను అదుపులో పెట్టుకోలేక, తనలో సుళ్ళు తిరిగే నీటి గుండాలకు తట్టుకోలేక ఘోషిస్తుంది సముద్రం. దాని ఒడ్డున కూర్చున్న నిరంజని హృదయంకూడా అలానే ఘోషిస్తూంది. ఒక ఆలోచనరాదు— లక్ష ఆలోచనలు. ఆమెకు కొంచెందూరంలో ఉన్న ధర్మారావు ఇసుకను గుప్పిళ్ళతో తీసికొని పైనుంచి క్రిందకు పోస్తూ పిచ్చిగా ఆడుకుంటున్నాడు. నిరంజని తన కళ్ళలో సుడులు తిరిగే నీటిని అణచుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూంది

ఆ నిశ్శబ్ద వాతావరణానికి భంగం కలిగిస్తూ "నన్ను క్షమించండి నిరంజనీ! మానస ఇలా అంటుందని నేను కలలోకూడా అనుకోలేదు. ఏమాత్రమైనా, ఇలా ఊహించి ఉంటే మీకింత సన్నిహితుడనయి ఈ రోజు మీ కింత ఆవేదనను కలిగించే వాడిని కాను." అన్నాడు.

ఈ మాటలు తన ఆత్మాభిమానాన్ని మరింత గాయపరచగా, నిరంజనమనసు విలవిల లాడింది. ఇంతకంటె, "నిలో నా కొరకే పోయింది" అన్నా ఆమె సంతోషించగలిగి ఉండేది. లోకంలో

సాధారణంగా, ఏ స్త్రీకూడా ఊహించని దానికైనా, ఇష్టపడని విషయం, ఇది నెంతో సామాన్యంగా చెప్తున్నాడు. మానస వద్దందిట! పద్మనాభానికి మానస ఎవరు? మానస వద్దన్నంత మాత్రాన ఇతను మానెయ్యాలా? ఇతనిమీద ఆమె కంత ప్రభావం ఉందా? అట్లాంటప్పుడు తనతో వివాహ ప్రస్తావన చెయ్యటం దేనికి? [illegible] తనతో జరిగిన అనేక ప్రణయ సంభాషణలూ, ఇచ్చిన అనేక వాగ్దానాలూ, లేనివిడివ ఒక్క మానస ఆజ్ఞకు ఉందా!

ఒక్కసారి తలెత్తి ధర్మారావువంక చూసింది నిరంజన. ఎందుకో ఒక జుగుప్సలాంటి భావం ఆమె మనసును క్రమ్ముకొంది. అతిబలవంతాన [illegible] మనోభావాల నణచుకొని, శాంత [illegible] స్వరంతో "మిమ్మల్ని [illegible] అవసరం ఏముంది? మీరే నన్ను క్షమించాలి. మీరు నన్ను ప్రేమించారని ఆపోహపడ్డాను." అంది. ధర్మారావు తెల్లబోయాడు. అందమైన నిరంజన కనురెప్పలలో [illegible] బిగిసిన నీరు [illegible] అతని దృష్టి [illegible] తప్పించుకోలేదు. ఇన్నాళ్ళ [illegible] సంసారంలో నిరంజన ఎంత [illegible] [illegible] అర్థం చేసికొన్నట్టు [illegible] [illegible] తూంది. కాని, నిరంజన ఎలా [illegible]

చేసికొంటుంది? ఆమెకా [illegible] అబద్ధాలు చెప్పటం తన ఇష్టంలేదు. యదార్థాన్ని ఆమె జీర్ణం చేసికోలేదు. [illegible] ఎవరైనా అంటేనేమో! అయితే తన జీవిత మేం కావాలి? ఒక నాటి మానసను మనసారా అభిమానించాడు; ఆరాధించాడు. ఆమె ఇష్టానికి వ్యతిరిక్తంగా ఏనాడూ నడువనని వాగ్దానం చేశాడు. ఆ కారణం చేత, ఇంత తనకు వివాహమాడే [illegible] ఉంటుందా? అయినా, మానస ఇంత సంకుచితంగా ఎలా ప్రవర్తించ గలిగిందీ? తనకు కులభావం, అధికంగానే ఉండ వచ్చు గాక! అయినా తన వల్ల ఒక సారి గాయపడిన హృదయం తిరిగి కోలు కుంటున్నందుకు సంతోషించడానికి బదులు, ఆ హృదయాన్ని శాశ్వతంగా మూసివేస్తుందా! అంతటి కఠినురాలూ, సంకుచిత స్వభావురాలూ, మానస అయి నప్పుడు, ఆమె మాటను మన్నించవల సిన అవసరం మాత్రం ఏముందీ? ఏ నాడో ఒకానొక, భావోద్వేగంతో [illegible] తాను మరిచిన క్షణంలో మానస కిచ్చిన వాగ్దానం కోసం [illegible] మూర్తి లాంటి నిరంజనను వదులు కోవాలా? [illegible], నిష్కారణంగా, [illegible] హృదయము ఎంత క్షోభననుభవిస్తుందో! [illegible] చూసే, ఆమె చూపులలో [illegible] [illegible] జన్మలో

మరువగలడా? ఎంత సున్నితంగా మెత్తని చెప్పుతో కొట్టిందీ?

నిరంజని చటుక్కుని లేచింది. "ఇంక వెళ్దాం పదండి" అని బయలు దేరింది.

"నిరూ!" బాధగా అన్నాడు. ఇన్నాళ్ళ ఇంతటి సాన్నిహిత్యంలోనూ, అత డెన్నడూ, ఆమె నలా సంబోధించ లేదు. ఏమాత్రమూ తన హద్దుల నతిక్రమించడానికి ప్రయత్నించలేదు। అందుకే అతడంటే ఎంతో గౌరవం నిరంజనికి.

ఆవేదనతో కూడిన ఆ ఆత్మీయతా సూచక సంబోధన ముందుకుసాగే ఆమె పాదాల నుబంధించివేసింది. ఆగి వెనక్కు తిరిగింది. ధర్మారావు ఒక్కసారి తలెత్తి నిరంజని ముఖంలోకి చూశాడు. గుండెలను కదిలించివేసే దీనాతిదీనమైన ఆ చూపుకు నిరంజని ద్రవించిపోయింది. ఆ క్షణంలో ధర్మారావు ఏమీ తెలియని పసిపాపలా కన్పించా డామెకు...

ఎందు కన్నట్లుగా చూసింది అతని వంక.

"మిమ్మల్ని కష్టపెడుతున్నాను. కానీ మరొక్క పది నిముషాలు కూర్చోగలరా?"

మనసులో అభిమానం ఎంత రగులుతున్నా అతని అభ్యర్థనను తిరస్కరించ లేకపోయింది. ముభావంగా కొద్ది దూరంలో కూర్చుంది.

ఒక్క క్షణకాలం నిరంజని వాలిన కళ్ళవంక చూశాడు ధర్మారావు. అవి బరువుగా ఉన్నాయి; విషాదంగా ఉన్నాయి; కానీ, ద్వేషాన్ని మాత్రం కక్కటం లేదు.

"నేను మిమ్మల్ని ప్రేమించినట్లు, మీరు నిజంగా భావిస్తే అది అపోహ అనుకోనక్కర్లేదు నూటికి నూరు పాళ్ళూ యదార్థం."

ఈ సంగతి నిరంజనికీ తెలుసు. ధర్మారావు నిరంజని దగ్గర ఏ విషయమూ దాచలేదు. అతడు మానసతో తన అనుబంధాన్ని వర్ణించినప్పుడు నిరంజని అసూయపడలేదు. సరిగదా, అతని నిర్మల స్వభావాన్ని మరింత ప్రశంసించింది.

"నేను ఒకప్పుడు మానసను ఎంతో ప్రేమించాను. ఆమె నాదికానపుడు నాకు బ్రతుకే లే దనుకున్నాను. కానీ, కాలం ఎంతటి దారుణమైన గాయాలనైనా, మాన్పగలదు. నిరంజనీ! మీరాక నాలో వెలితిని నింపటమే గాక నన్నాదరించు కుంది. మీ చల్లని వ్యక్తిత్వపు నీడతో, నా ఆవేదన చల్లారటమే గాక, నా ఆశలు చిగురించాయి. గతాన్ని నా దురదృష్టంగా కాక, అదృష్టంగానే భావిస్తున్నా నంటే మీరు నమ్మగలరా, నిరంజనీ!"

అని అత డమాయకంగా అడిగినప్పుడు, నిరంజని మనసారా ఆ మాటల్ని నమ్మింది. తన అదృష్టాన్ని అభినందించుకుంది. ధర్మారావు గృఢ వ్యక్తి




త్వంలో, అతని ఎడల హృదయంలో ఆమెకు అపారమైన నమ్మకం. నిరంజని తన కులాన్ని గురించి ధర్మారావుకు ప్రత్యేకం చెప్పుకోనక్కర్లేక పోయింది. సుధాకర్ ద్వారా అతని కది వరకే తెలుసు. ఈ విషయమే ఆమె ధర్మారావు దగ్గర ఎంతో సంకోచంగా ప్రస్తావించటోయినపుడు, ధర్మారావు పెద్దగా నవ్వి "బాగుంది! ఇదీ ఒక అభ్యంతరమేనా?" అన్నాడు ఎంతో తేలికగా. ఈ మాటలు నిరంజనిలో అతనిపట్ల గౌరవాన్ని ద్విగుణీకృతం చేశాయి! నిరంజని ధర్మారావుకు ఎంతగా వశమైందంటే, అతడు నడచిన నేలకూడా, ఆమెకు మహాద్భుతంగా, అత్యంత పవిత్రమైందిగా అనిపిస్తూంది. నిండైన విగ్రహమూ, ఆకర్షణీయమైన ముఖమూ, ఉదాత్తమైన ప్రకృతి, ఉన్నతమైన విజ్ఞానమూ గల ఈ యువకుని, మానవ ఏ విధంగా వదులుకో గలిగిందా అని ఆమె విస్తుపోతూ ఉంటుంది. తరచు వాళ్ళిద్దరూ ఎక్కడో ఒకచోట కలుసుకుంటూనే ఉండేవారు. కలుసుకున్నప్పుడల్లా వదలలేక వదలలేక విడిపోయేవారు. ఎన్నడూ ధర్మారావు సాధారణ స్నేహపు పరిమితి దాటి ఒక్క అడుగుకూడా ముందుకు వేయలేదు. ధర్మారావు ఎంతో నెమ్మదిగా తనతో వివాహప్రస్తావన చేసినప్పుడు సంతోషంతో తనను తాను మర్చిపోయింది. ఆనాడు మెరుస్తున్న తన కళ్ళలోకి ఉత్సాహంగా ధర్మారావు చూసి కొంటెగా నవ్వినప్పుడు. ఈ యావత్ ప్రపంచాన్ని జయించినంత గర్వం కలిగింది. 'ఒక్కసారి తనను దగ్గరకు తీసుకోండి.' అనే ఆలోచనతో పులకరించిపోయింది. కానీ ధర్మారావు అలాగే ఎడంగా కూర్చున్నాడు. అ[illegible]ంగా

నవ్వుతూ "మీ రలా చూడకండి! నా మీద నాకు నమ్మకం తగ్గిపోతూంది." అన్నాను అల్లరిగా.

తత్పూర్వము తన కనుభవంలేని సిగ్గుతెర ఏదో తనను కప్పివేయగా ముకుళించుకుపోయింది. ఆ క్షణం వరకూ, తనలో అంత సిగ్గుందని తనకే తెలియదు. అతికష్టంమీద తనను తాను నిగ్రహించుకొని, కళ్ళెత్తేసరికి ధర్మారావు తనను కళ్ళతో త్రాగేస్తున్నాడు. తనకు ఒళ్ళు జలదరించినట్లు కాగా చటుక్కున లేచి, "ఇక వెళ్తాం" అంది. అంతరాంతరాలలో, తనను ధర్మారావు బలవంతాన ఆపుచేస్తాడనే ఆశ మెదిలింది; కానీ, ధర్మారావు తనుకూడా లేచి, "వెళ్ళండి, పాపం! ఇంకెన్నాళ్ళు నన్ను ఆజ్ఞాపించగలరు కనుక!" అన్నాడు.

తను నవ్వింది. ఎంత నిగ్రహవంతుడో, అంత అల్లరివాడు. ఉత్సాహమూ, సచ్ఛీలమూ రంగరించుకున్న ఉన్నత ఆదర్శమూర్తి పాదాలదగ్గర, ఆ క్షణమే, నిరంజని తన్ను తాను మనసా అర్పణ చేసికొంది.

కానీ, ఈనాడు మానస కాదన్నదన్న చిన్న కారణానికి. ఆ అద్భుత సుందర సౌధాలన్నీ మంటగలిసిపోతున్నాయి. బావురుమని ఏడవాలనిపించింది నిరంజనికి. తాను తెగించి, ధర్మారావు గుండెలలో తల దాచుకొని, "ఈ స్థానం నాది— ఇక్కడనుంచి త్రోసివేసే అధికారం ఎవ్వరికీ లేదంటే. ధర్మారావు తనను త్రోసివేయగలడా? కానీ నిరంజని ఏదీ చేయలేకపోయింది. ఓరగా ధర్మారావు వంక చూసింది. నిరంజని ముఖంలోకే శ్రద్ధగా చూస్తున్నాడు ధర్మారావు. ఆ చూపులలో భయమూ, ఆశా, దైన్యమూ నిండుకొని ఉన్నాయి. నిరంజని కేమీ అర్థం కావడంలేదు. అసహాయంగా ఒకానొక విరక్తిభావం తన్ను కమ్ముకోగా, "యథార్థ మెన్నడూ ఇంత ఓటి పునాదులమీద నిలబడదు." అంది కొంత కఠినంగా—

ధర్మారావు గతుక్కుమన్నాడు. నిరంజనివంక ప్రాధేయపూర్వకంగా చూస్తూ, "నన్ను అర్థం చేసికోండి. నిరంజనీ! నేను ఇంతవరకూ ఎన్నడూ మాట తప్పలేదు. ఏ విషయంలోనూ, తన ఇష్టానికి వ్యతిరేకంగా నడువనని మానసకు వాగ్దానమిచ్చాను. ఆనాడు నేను మానస ఇంత సంకుచితస్వభావురా లని ఊహించలేదు. పైగా ఆమె మాటలను బట్టి నాపై నిర్మలమైన అభిమానం ఉందనికూడా భ్రమ పడ్డాను. ఆనాటి నా వాగ్దానం, ఒకనాటికి నా జీవితంలో అత్యంత ప్రధానమైనవాన్నీ, అమూల్యమైనదాన్నీ వదులుకొనచేస్తుందని నే నేమాత్రమైనా ఊహించగలిగితే...

"క్షమించండి! నాకు కొంత సమయ మివ్వండి; నేను ఏదీ నిర్ణయించుకోలేక పోతున్నాను."



అతని కంఠంలో ధ్వనించే ఆవేదనకి పూర్తిగా కరిగిపోయింది నిరంజని. అదీగాక, అతని మాటలామె కెంతో తృప్తి నిచ్చాయి. ధర్మారావు ఈ వివాహానికి సందేహించడానికి బలమైన కారణం మానస మీద అతనికి గల అభిమానం కాదు; తన వాగ్దానానికి భంగం కలిగించుకోలేక పోవటం. ఈనాడు తన జీవిత సర్వస్వాన్నీ పణంగా పెట్టి, అతనిస్తున్న గౌరవం, మానస అభిప్రాయానికి కాదు, తానామె కిచ్చిన మాటకి. ఇది అతని ఆధిక్యతను మరింత అధికం చేస్తూందే కాని, న్యూనపరచటం లేదు. కాని, ఎలా? — ఎలా?

ఆమె ఆలోచనల కంతరాయం కలిగిస్తూ ధర్మారావు "కులాని కింతటి అనవసర ప్రాధాన్య మిచ్చే మానస మీతో అంతటి గాఢస్నేహ మెలా చేయగలిగింది. అర్థం కావటం లేదు" అన్నాడు ఆలోచనగా. నిరంజని ఉలిక్కిపడింది. ఆమె ముఖం వెలవెల పోయింది. దానిని ధర్మారావు మరొక విధంగా అర్థం చేసికొన్నాడు.

"క్షమించండి — మిమ్మల్ని కించపరచడాని కనలేదు మానస స్వభావాన్ని గురించి ఆలోచిస్తూ అన్నాను." ఓదారుస్తున్నట్లు అన్నాడు.

నిరంజని తల మరింత క్రిందకు వంగింది. ఏదో చెప్పాలని ప్రయత్నించింది. కానీ ఆమె గొంతు పెగలలేదు.

మెరుపులాగ నిరంజని మస్తిష్కంలో ఒక ఊహ కదిలింది. సిగ్గుగా ధర్మారావువంక చూస్తూ "మన వివాహ విషయంలో, మానస అంగీకారం నేను పొందగలిగితే, మీకు అభ్యంతరం ఉండదు కదా!" అని అడిగింది.

ధర్మారావు తెల్లబోతూ, "అభ్యంతరమూ? ఎగిరి గంతేస్తాను. కానీ, అదెలా సాధ్యం?" అన్నాడు.

"ఎలాగో సాధిస్తాను. మీ అనుబంధాన్ని మీరు పరీక్షించుకున్నారు. మా స్నేహాన్ని నేను పరీక్షిస్తాను. కానీ, ఇందులో మీ రేం కల్పించుకోకూడదు."

"అలాగే కల్పించుకోను. కానీ, అసంభవ మనిపిస్తోంది నాకు."

"చూద్దాం," అంటూ నిరంజని లేచింది. ఆమె ముఖంలో మబ్బులు మాయమయి ప్రసన్నంగా ఉంది. ధర్మారావు అనేక రకాల ఆలోచనలతో ఊగిపోతూ, ఆమె ననుసరించాడు.

## 11

నిరంజని తన హాస్టలు కొచ్చేసరికి వార్డెన్, సుధాకర్ దగ్గరనుండి వచ్చిన ఉత్తరం అందించింది. బట్టలైనా మార్చుకోకుండా, బద్ధకంగా ఆ ఉత్తరం విప్పింది.

'నిరూ! నీకు నేను వ్రాయబోయే ఈ విషయాలు శుభమైనవో, అశుభమైనవో, నాకు తెలియడం లేదు. నువ్వెలా అర్థం చేసికొంటావో, అసలు ఊహించలేకుండా ఉన్నాను. విధాత మానసాదేవి శరీరాన్ని సృష్టించడానికెంత ప్రత్యేకమైన శ్రద్ధ తీసికొన్నాడో, ఆమె మనసు విషయంలో అంత నిర్లక్ష్యం చేశాడు. ఆమె మనసు నవనీతమైనమాట నిజమే; విశాల హృదయురాలనికూడా చెప్పవచ్చును కానీ, క్రీ. పూ. పుట్టవలసిన వ్యక్తి. ఆమె భావాలకు నవ్వాలో, ఏడవాలో కూడా అర్థం కాదు. ఏది ఏమైనా ఒకసారి తాను ఉత్తమమని నమ్మిన మార్గంలోంచి ఆమె ఎన్నటికీ మరలదు. అది అసంభవం. అంతే కాదు, ఎదుటి వ్యక్తులను అర్థం చేసికోగలగటం కానీ, సూక్ష్మమైన పరిశీలనా జ్ఞానం కానీ ఆమెకు తక్కువ. అద్భుత సౌందర్యవతి అయిన ఈ యువతిలో శైశవ లక్షణాలే ఎక్కువగా కన్పిస్తాయి.

'నిరూ! తెలిసో, తెలియకో నేనామె జీవితంలో చోటు చేసుకొన్నాను. అంతే కాదు, ఆమె హృదయంలో స్థానం సంపాదించుకొన్నానని కూడా చెప్పటానికి సాహసిస్తున్నాను. ఇందువల్ల నాకెంత సంతోషం కలుగుతూందో, అంత ఆవేదన కలుగుతూంది. మా పరిచయమూ, ఈ ప్రేమా, అన్నీ అసత్యమైన భావనలమీద నిలువబడి ఉన్నాయి. ఆ ఆధారాలు కదిలిననాడు ఏం జరుగుతుందో ఊహించలేకుండా ఉన్నాను. ఒక్కటి మాత్రం నిశ్చయం, కలరూపు తెలిసిననాడు, మా కలయిక అసంభవం. ఆనాడు మానసకు మతి పోతుందో, ఆత్మహత్య చేసికొంటుందో, నేనేమవుతానో, ఆ సృష్టికర్తకే తెలియాలి. మానస ముగ్ధ—ఆమె ముగ్ధత్వమే ఆ బేలతనమే, ఆ అమాయికత్వమే నన్నామె వైపుకు

మరింత ఆకర్షిస్తోంది. నా కామె పట్ల చాలా ప్రేమ అనటం కన్న, నా కామె అంటే వెఱ్ఱి అంటే, సరిగ్గా చెప్పినవాడ నవుతానేమో! మానస దగ్గిర కనీసం ఒక్క క్షణం గడపటానికి. ఏమైనా. వదులుకోవటానికి సిద్ధంగా ఉన్నాను. ఆమె స్నేహం కోసరం జీవితపు విలువలనే వదులుకొంటున్నాను. నే నెంత నీచానికి దిగజారుతున్నానో నాకు తెలుసు. కానీ ఏం చెయ్యను, అసహాయుణ్ణి నిరూ! ఏ రహస్యాన్ని ఆధారంగా చేసికొని ఆమె అభిమానాన్ని పొందగలుగుతున్నానో, ఆ రహస్య మే క్షణంలో బయట పడుతుందో ననే భయం నన్ను అనుక్షణమూ వేధిస్తూనే ఉంటోంది; కానీ, ఒక్క విషయం నిరూ! నా ఈ మాయా సౌధం ఏనాటికో కూలక తప్పదని నాకు బాగా తెలుసు. అందుకనే కూడని చనువేదీ నేను తీసికొనటం లేదు. అయినా మానస మనసుతో నిర్దయగా ఆడుకుంటున్న నాకే శిక్ష ఉచితమో నీవే చెప్పు. కానీ ఈ బంగారు కల కరిగిపోనియ్యకు. ఎల్ల కాలమూ, ఇది కలగానే, నిలిచిపోవాలి. ఈ కల పండాలని కూడ నేను వాంఛించటం లేదు. ఈ మాత్రపు ఆనంద మే చాలు నాకు. ఇది ఎలా సాధ్యం నిరూ! ఏనాడో ఒకనాడు, నేను అతి ప్రయత్నం మీద తప్పించు కొంటూ వచ్చిన ప్రశ్నకు సమాధానం చెప్పుకోవద్దా? ఆ అగ్ని పరీక్షకు తట్టుకోగలనా? ఏమో! భూత భవిష్యత్తుల గురించి ఆలోచించటానికి భయం వేస్తోంది. వర్తమానంలోని ఈ ఆనందాన్ని ఎన్నాళ్ళు నిలుపుకోగలను?

ఏది ఏమైనా, చెల్లెలిగా నిన్నొకటి అర్థిస్తున్నాను. మన కులం సంగతి మానస కెన్నడూ తెలియనివ్వకు. నిన్ను కూడా ఈ సుడిగుండంలోకి లాగుతున్నానని బాధపడ్తున్నాను?

'ధర్మారావు నిన్ను వివాహ మాడ గోరటం నా కెంతో ఆనందాన్ని కలిగించింది. నిజంగా ధర్మారావులాంటి భర్త లభించటం ఏ స్త్రీకయినా గర్వ కారణం. మానస నాతో, ధర్మారావు మాలపిల్లను చేసికో బోతున్నాడని చెప్పింది. ఆది నీవే కావచ్చునని ఊహించాను. మానస ఈ వివాహాన్ని వ్యతిరేకంగా నా ఎదురుగానే మాట్లాడుతున్నప్పుడు నా మనసు ఎలా ఉడుకిపోయిందో నీకెలా వ్యక్తీకరించను. ధర్మారావు మానసకు తాను వివాహమాడబోయేది నీవేనని ఎందుకు వ్రాయలేదు? అందుకు నీ సూచనే కారణమా? మీ వివాహానికి ఆహ్వానం ఎప్పుడా అని నిరీక్షిస్తున్నాను. మీ ఇద్దరికీ నా శుభాకాంక్షలు. అమ్మ, పిన్ని, మానస అందరూ కులాసాగా ఉన్నారు. మీ అందరి క్షేమం వ్రాయి.

నీ అన్న,
సుధ.

ఉత్తరం ముగించి, బాడిగా మూలిగింది నిరంజని. ధర్మారావుతో తన పేరు మానసకు వ్రాయవద్దని తానే చెప్పింది ఒక్కసారిగా మానసను ఆశ్చర్యపరచాలని తప్ప వేరుఉద్దేశ్యమేమీలేదు అప్పట్లో! కానీ, అదికూడా మరొక క్రొత్త సమస్యను సృష్టించింది. ధర్మారావు తన పేరుగూడా వ్రాసిఉంటే తాడోపేడో వెంటనే తేలిపోయిఉండేది. కానీ, సుధన్వయ్యకు అది పెద్ద దెబ్బ అవుతుంది. మానస ప్రేమ ఎటువంటిది? తానుగా ఏమీ ఆలోచించలేక, తల్లి వద్దన్నందుకు ధర్మారావును తిరస్కరించింది సుధన్వయ్య విశ్వప్రయత్నం చేత, అతని ఆకర్షణకు మొగ్గింది. ఈనాడు అన్నిటికీ అతీతంగా తనను తాను, సుధన్వయ్యకు అర్పించుకోగల స్థితిలో ఉందా మానస? ఊహు! మానస అలా ఎప్పటికీ ఉండదు. ఏ చమత్కారాన్ని ఉపయోగించి మానస గాఢ స్నేహాన్ని పొందగలిగిందో, అదే చమత్కారాన్ని ఉపయోగించి ఈమె వివాహానికి మానస అనుమతి పొందాలి.

వెంటనే మానసకు ఉత్తరం వ్రాసింది.

'వదినా! ఈ సంబోధన నీకు క్రొత్తగా ఉంది కదూ! కానీ, నా హృదయపూర్వకమైన సంబోధన అది.

"నేను ధర్మారావుగారివల్ల విన్నదాన్నిబట్టి, నేను ఊహించినదాన్నిబట్టి, నువ్వు మా అన్నను మొదటినుండి నిరంతర భావంతోనే అభిమానిస్తున్నావని భావించాను. ఆ భావంతోనే నిన్ను మనసార "వదిన" అని సంబోధించాను. ఇంతకంటె సమర్థంగా నా హృదయాన్ని నీకెలా విప్పిచెప్పగలను! మానసా నిన్ను చిన్నప్పటినుండీ ఎరుగుదువు. నన్ను నీ వదినెగా అంగీకరించగలవా? నీ ఊహలో, నేను ధర్మారావుగారికి తగిన గృహిణిని కాగలనా? నీ సమాధానంపైనే నా భవిష్యత్తంతా ఆధారపడి ఉంది. తొందరగా సమాధానం వ్రాయవూ?

నీ

నిరంజని..."

మానస దగ్గరనుండి సమాధానానికి నిరంజని ఎక్కువరోజులు ఎదురుచూడవలసిన అవసరం లేకపోయింది.

ఆ రోజు మానస దగ్గరనుండి వచ్చిన ఉత్తరాన్ని ఎంతో ఆందోళనగా, ఆత్రుతగా, గుబగుబలాడే గుండెలతో విప్పింది.

"వదినా!

నిన్నిలా సంబోధించగలిగిన అదృష్టం నాకు కలిగించినందుకు నీకు నా కృతజ్ఞత ఎలా తెలుపుకోవాలో అర్థం కావటం లేదు. నీ సంబోధన నాలో నేను కొన్నికోట్లసార్లు చదువుకున్నాను. ఒక్కసారి నీ దగ్గరకు వాలి, నిన్ను కౌగలించుకొని, నోటితో వదినా అని పిలిపించుకొని, మురిసిపోవాలని ఉంది. నువ్వు భార్యవయిననాడు, మా

బావ కంటె అదృష్టవంతు లుండరు. నువ్వు సరిగా ఊహించవు. మా బావను నేను మొదటినుండీ, నా అన్నగానే భావించాను. కానీ, చిత్ర మేమిటంటే నువ్వు స్పష్టం చేసేవరకూ, ఈ విష యంలో నన్ను నేనే అర్థం చేసుకోలేక పోయాను.

'నిరూ! నీకు నిజంగా వదినెను కాగలిగే అదృష్టాన్ని నాకు భగవాను డెప్పుడు ప్రసాదిస్తాడో కదా?

నీ
మానస'

ఉత్తరం చదువుకొని నిరంజని నవ్వు కొంది. ఉత్తర మంతటా మానస ముగ్ధ హృదయం దోబుచులాడుతూనే ఉంది. మానస ఒట్టి వెర్రిపిల్లా కాదు. ఆమె హృదయం స్పందన నెరుగనిదీ కాదు.. కాకపోతే ఏ విషయాన్నీ లోతుగా ఆలో చించేది కాకపోవచ్చును. ఆమె ప్రగాఢ ప్రణయ మాధుర్యం ఆ ఉత్తరం లోని ప్రతి అక్షరంలోనూ ప్రతిఫలి స్తూంది. అంతులేని సంతోషమూ, భయమూ, జాలీ, ఆమె మనసు నొక్క సారిగా క్రమ్ముకొన్నాయి. పర్యవసా నాన్ని గురించి ఊహించలేక పోతూంది. ఆ సాయంత్రం తనను బీచ్‌లో కలిసికో వలసిందని, ధర్మారావు లాడ్జికి టెలి ఫోను చేసింది. ధర్మారావు కనపడగానే విజయగర్వంతో, మానస ఉత్తరం అందించింది. ధర్మారావు దూాంత్రి కంగా అది చదివి, నిర్లిప్తంగా క్రింద పడేశాడు. నిరంజని బిత్తరపోయింది. అయోమయంగా ధర్మారావు వంక చూసింది. ధర్మారావు నిరసనగా నిరం జని వంక చూస్తూ "ఇంతవరకూ మీరు చాలా ఉన్నతులని నేను భావిస్తూ వచ్చాను. సత్యాన్ని ఎదుర్కోలేని పిరికివా ళ్ళని అనుకోలేదు" అని అర్థంకానట్లు చూసే నిరంజని చూపులకు సమాధా నంగా మానస తనకు వ్రాసిన ఉత్తరం అందించాడు. నిరంజని గాభరాగా విప్పింది.

"బావా!

ఎంతటి దుర్మార్గుడవు నువ్వు. విషం లాంటి విషయాల్ని వెంటనే తెలియజేసి, అమృతంలాంటి సంగతుల్ని దాచుకొం టావా? ఎవతెనో మాలపిల్లను చేసికోవా లన్నప్పుడు వెంటనే ఉత్తరం వ్రాశావా!! నిరంజనిలాంటి అమృతమూర్తిని చేసికో బోతున్న విషయం మాత్రం నువ్వే దాచుకొన్నావూ!! కొంపదీసి నీ వీ మాలపిల్లను చేసికోవడానికి వీలు లేద న్నందుకు నామీద కోపం రాలేదు కదా! బావా! ఈ ఉత్తరం నీకు వ్రాసేటప్పుడు, నన్ను నేను ఎలా చిత్ర వధ చేసుకొన్నానో, నువ్వేలా ఊహించగలవూ? వర్ణసంకరం నా కిష్టం లేనిమాట నిజమే అయినా, బాధతోనయినా నీ సంతృప్తికోసరం, నీ సుఖం కోసరం, నా అభ్యంతరం

బయటపెట్టి ఉండేదానిని కాను. కానీ, అమ్మ కన్నీళ్ళు నేను చూడలేక పోయాను. నీ ఉత్తరం విన్న అమ్మ ఆ వేదనలో విలవిలలాడిపోయింది. జ్వరం కూడా వచ్చింది. అందులో నిన్ను గురించే కలవరింతలు. విధిలేక ఏడుస్తూ నీ కా ఉత్తరం వ్రాశాను. మా ధర్మాత్ముడైన ఏనాడూ ధర్మపథాన్ని తప్పడని నాకు తెలుసు. ఎంతటి దారుణాఘాతాన్నైనా సహించి తన మాట మీద నిలబడతాడనికూడా నాకు తెలుసు. అందుకే నువ్వు నా కొకనాడు, అమ్మ అనురాగంతో ఇచ్చిన వాగ్దానాన్ని రాక్షసంగా ఉపయోగించుకొన్నాను. నిన్ను వేధించమని అడగటానికికూడా నోరు రావటం లేదు.

పోనీయ్ బావా! అంతా మన మంచికే జరిగింది. నిరంజనిని గురించి నీకంటే నా కెక్కువే తెలుసు. ఒకటికి రెండు సార్లు నీ మనసుకు నావల్ల కలిగిన గాయం, ఆమె చల్లని ప్రేమలో, మచ్చ కూడా లేకుండా కరిగిపోతుంది. నిరంజని ఏం వ్రాసిందో తెలుసా? నేను నిన్ను ఉన్నట్లా అభిమానిస్తున్నానంది. నిజమే కదూ! లేకపోతే, నిన్నెంతో వెర్రిగా అభిమానిస్తు కూడా, నీ కోరికను తిరస్కరించటంలో అర్థమేమిటి? తొందరగా సమాధానం వ్రాయి.

నీ సోదరి
మానస..."

ఉత్తరం ముగించి తల దించుకొంది నిరంజని. అంతకు క్షణం క్రిందటి ఆమె ఉత్సాహమంతా నీరుగారిపోయింది. క్షమించరాని నేరం చేసి న్యాయాధిపతి ఎదుట నిలబడిన ముద్దాయిలా ఉంది, ఆమె మనఃపరిస్థితి - ధర్మాత్ముడి మనసు కుతకుత ఉడికిపోతూంది. ఏ మాత్రపు అధర్మాన్నీ, కౌటిల్యాన్నీ అతడు సహించలేడు.

"మీరు నటిగా చాలా చక్కగా రాణిస్తారు నిరంజనీ!" అన్నాడు కర్కశంగా, వెటకారంగా. అంతవరకూ అపరాధభావంతో కృంగిన నిరంజని హృదయం ఈ మాటలకు రోషంతో బుసలు కొట్టింది

"క్షమించండి! నే నెవ్వరి దగ్గరా, ఏ విధమైనా నటనా చేయలేదు. ఎదుటివారు తమంతట తాము ఏవో అపోహలు పెంచుకొంటే, అందుకు బాధ్యత నాదా?"

"అవును పాపం! అట్లాంటి అపోహ ఉన్నదని తెలిసీ దానిని పోషించటంలో కూడా మీ బాధ్యత ఏంలేదు. మీరు కష్టపడి సంపాదించిన మానస సమాధానానికి విలువలేదు. అట్లాంటి సమాధానం కోసరం ఎదురు చూడవలసిన అవసరమూ లేదు. అంతకంటె వాగ్దానానికి విలువ లేకుండా చేసుకోవడమే చాలా ఉత్తమం; కానీ, నేను మొదటినుంచీ మీతో అన్ని విషయాలలోనూ, ఏ అర



మరికా లేకుండా వ్యవహరించినపుడు, మీ రిలా ఎందుకు దాగుడు మూత లాడాలో అర్థం కావటం లేదు."

నిరంజని ఇక నిగ్రహించుకోలేక పోయింది రెండుచేతులలో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. ధర్మారావు ఉదాసీనంగా కూర్చున్నాడు. నిరంజని కొంతసేపటికి కళ్ళు తుడుచుకుని, స్థిరంగా ధర్మారావు ముఖంలోకి చూస్తూ. "జరిగింది జరిగినట్లు చెపుతున్నాను వినండి నేను బ్రాహ్మణి నని. నేను మానసతో ఏనాడూ చెప్పలేదు. నేను శాకాహారిని కావటం వల్లనో, మ రెందువల్లనో. మానస నేను బ్రాహ్మణి నని భావించింది. ఆమె ఆ విధంగా భావిస్తూందని నాకు మొదట్లో తెలియనే తెలియదు. తెలిసిఉంటే ఆమెకు దగ్గిర కావటానికి ప్రయత్నించేదానిని కాను మేము గాఢ స్నేహితుల మయిన తరువాతనే ఒకనాడు కాకతాళీయంగా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు. మొట్టమొదటి సారిగా, ఆమె కులానికెంత ప్రాముఖ్య మిచ్చేదీ తెలిసి విస్తుపోయాను. అప్పుడే, నా కులాన్నిగురించి ఆమెకు చెప్పాలని పించింది. కానీ అప్పటికే మా మధ్యపెరిగిన స్వచ్ఛమైన స్నేహలతను, ఇంతటి చిన్న కారణానికి త్రుంచి వేయలేక. ఇందువల్ల ఎవరికిమాత్రం జరిగే అపకార మేముంటుందని భావించబట్టే తటస్థంగా ఊరుకొన్నాను. నా అపరాధమిదే. ఇక ఇప్పుడు నిజంగా నా కులాన్నిగురించి చెప్పవలసిన అవసరం ఉంది. నేను ఇప్పుడుగూడా చెప్పలేకపోవటంలో నా స్వార్థం లేదనను. కానీ, అంతకంటే బలవత్తరమైన కారణం ఉంది," అంది.

ధర్మారావు శ్రద్ధగా విన్నాడు.

"ఆగిపోయారేం? ఆ కారణం నాకు చెప్పకూడదా?" కొన్ని క్షణాలు నిరంజని

మాట్లాడలేకపోయింది. తరువాత "అది నాకు సంబంధించినది కాదు. అయినా ఇంతవరకూ వచ్చాక మీదగ్గర ఇంకేమీ దాచను. మీరు నా కేశిక్ష విధించినా సరే" అని, సుధాకర్ తనకు వ్రాసిన ఉత్తరం కోసం తన హేండ్ బాగ్‌లో వెతికింది. అదృష్టవశాన అది దొరికింది. దాన్ని ధర్మారావు చేతి కిచ్చి, "ఇది చదువు కోండి సమస్తమూ మీకే బోధపడ్తుంది" అంది

ధర్మారావు గబగబ ఉత్తరాన్ని ఆద్యంతమూ చదివాడు. అతనికి తల గిఱ్ఱున తిరిగింది. అందుకు కారణం సుధాకర్ మీద ఈర్ష్య కాదు. ఈ విపరీత సంఘటనల దారుణపరిణామాన్ని తలచు కొని ఆనాడు మానస అనుభవించబోయే ఆవేదనను ఊహించలేక!....

రెండు చేతులతోనూ తల పట్టుకొని కూర్చున్న ధర్మారావుని జూచి నిరంజని వణికిపోయింది ధర్మారావు నెలా ఓదార్చాలో, ఏవిధమయిన మాటలతో జరిగినదానిని సమర్థించుకోవాలో ఆమె కర్థం కావటంలేదు

ధర్మారావు ఆకస్మాత్తుగా "ఇంక ఈ నాటకం సాగటం నా కిష్టంలేదు నిరంజనీ!" అన్నాడు.

"నాకూ ఇష్టంలేదు కానీ తెర ఎలా దించాలో అర్థం కావడంలేదు"

"ఇందులో అంత తల పగలకొట్టు కోవలసిం దేముందీ! ఉన్నది ఉన్నట్లు మానసకు వ్రాస్తాను." అన్నాడు.

నిరంజని అదిరిపడింది. కాతర స్వరంతో "వద్దు వద్దు! సుధన్నయ్య మానస దృష్టిలో నీచు డవుతాడు. మానస పైన తనకు గల వెఱ్ఱివ్యామోహాన్ని నిగ్ర హించుకోలేక, ఈ మాత్రపు అధర్మా నికి తల ఒగ్గాడు కానీ, సుధన్నయ్య ఎలాంటివాడో మీకు తెలుసును, సుధ న్నయ్యకోసరం మిమ్మల్నా విధంగా చేయవద్దని ప్రాధేయపడుతున్నాను."

ధర్మారావు దిగులుగా, చికాకుగా, "కానీ దీనికి అంతెక్కడ?" అన్నాడు.

నిరంజని తల వంచుకుని "మ రేదైనా పరిష్కారమార్గం ఆలోచించండి" అంది.

సుధాకర్ ఎటువంటివాడో ధర్మా రావుకు బాగా తెలుసు. అతని పట్ల స్నేహ భావంతోపాటు ఎంతో గౌరవం ధర్మా రావుకు. ఎటూ దారీ తెన్నూ తోచక, చికాకుగా ప్రకాశరావు లేచి బయలు దేరాడు. నిరంజని దిగులుగా అతడి ననుసరించింది.

## 12

ఇంచుమించు ప్రతిరోజూ సుధాకర్ మానస ఇంటికి రావడం జరుగుతూనే ఉంటుంది. కాని, ఆనాడు మానస రోషంగా, ఒక్కమాటైనా మాట్లాడ కుండా వచ్చేసినదగ్గర్నుంచీ సుధాకర్ మానస ఇంటికి రావడం మానేసాడు.



మనసు ఎంత ఆరాటపడి తున్నా. అభిమానంకొద్దీ. తనను తాను అతికష్టంమీద నిగ్రహించుకొంది మానస అప్పటికి వారం రోజుల్నుంచీ సుధాకర్ రావటం లేదు. నిముష మొక యుగంలాగ, అతని రూపే ధ్యానంచేస్తూ గడిపింది మానస. ఇక ఆమె నిగ్రహం సడిలిపోయింది. నిరంజని వంకతో బయలుదేరకుండా ఉండలేకపోయింది. దారిలో ఆమెకు 'సుధాకర్‌కు నిజంగా కోపం రాలేదు కదా?' అని అనుమానం వచ్చింది. ఆ ఆలోచనకే వణికిపోయింది ఆమె సుధాకర్ కోపంకంటె. ప్రపంచంలోని ఇంక ఏవిధమయిన కష్టమైనా హాయిగా అనుభవించగలదు.

వాలుకుర్చీలో పడుకుని, చేతిలో పుస్తకం పట్టుకొని గోడమీది సాలెగూడు వంక శ్రద్ధగా చూస్తున్నాడు సుధాకర్. అడుగుల చప్పుడుకు తలెత్తి ఎదురుగా దేవతలాగ ప్రత్యక్షమయిన మానసను చూసి దిగ్భ్రాంతి పొందాడు సుధాకర్. నిష్కారణంగా మానస తడబడుతూ "మీ చదువుకు విఘ్నం కలిగిస్తే క్షమించండి ప్రత్యేకమైన పనిఉండి వచ్చాను. లేకపోతే రాకపోదును" అంది. వెనుకటి తన ప్రవర్తనకు లక్ష క్షమార్పణలు దారిపొడుగునా ఆలోచించుకుంటూ వచ్చిన మానస పలికిన మాట లివి.

అనవసరమైన ఆమె కంగారుకు సుధాకర్ చిరునవ్వు నవ్వి, ఆమెకు కుర్చీ చూపించి, "కూర్చోండి. మీ రాక వల్ల నా పనికి విఘ్న మేమిటి? చకోర పక్షి చంద్రుడి రాకకు విసుక్కొంటుందా?"

ఏ కోపమూ లేకుండా మామూలుగా సుధాకర్ మాట్లాడినందుకు మానస మనసు తేలికపడింది. కుర్చీలో కూర్చుంటూ, "వారం రోజుల్నుంచీ మా ఇంటికి రావటంలేదేం?" అని అడిగింది.

సుధాకర్ మానస కళ్ళలోకి ఆప్యాయంగా చూశాడు. "ఏడు రోజులే నా ఐందీ? నా కేడేళ్ళు ఐనట్లుగా ఉంది."

"నా కేడుయుగాలయినట్లుగా ఉంది."

మానస నవ్వుతూంటే, సుధాకర్ కూడా శృతి కలిపాడు. ఇద్దరి మనసులూ ఒకానొక మధుర భావనతో పరవశించాయి.

"నేను రాని రోజులు మీరు కూడా లెక్క పెట్టుకుంటున్నారన్న మాట."

తృప్తిగా అన్నాడు సుధాకర్.

"లెక్క పెట్టింది రోజులు కాదు. క్షణాలు. నామీద కోపం వచ్చిందిగదూ!"

"మీమీద కోపమా! ఈ రోజే కాదు, ఏనాడూ కూడా మీమీద కోపం తెచ్చుకోగలిగే శక్తి నాకు లేదు."

మానస తన మనసులోని అనురాగమంతా తన కళ్ళలో కురిపిస్తూ, "మరి నాకింత శిక్ష విధించటానికి కారణమేమిటో చెప్పండి?" అంది.

స్వచ్ఛమైన సరోవరంలో అప్పుడే వికసించిన నల్లకలువ రేకుల్లాంటి ఆమె కళ్ళు, అనురాగంతో ఈషద్రక్తిమ వహించి తన కళ్ళలోకి చూస్తూంటే సృష్టి స్థితికి మూలమైన. ఏదో ఒక మహా దివ్యశక్తి తమ మధ్య ప్రవహిస్తున్నట్లుగా అనుభూతి చెందాడు సుధాకర్.

"నేను విధించిన శిక్ష మీకు కాదు. నాకు నేనే విధించుకున్నాను."

మానస నవ్వింది.

"ఎందుకూ? ఏమపరాధం చేసారని?"

"నేను చేసిన అపరాధం మీకు తెలియజెప్పుకోలేకనే మీకు తప్పుకు తిరగాలని అనుకొంటున్నాను నా అపరాధాన్ని మీరు క్షమించలేరని నాకు తెలుసు!"

ఆ మాటలను సుధాకర్ గంభీరంగా అన్నా. మానస నవ్వులాటగా తీసికొంది.

"మీరు అపరాధం చేస్తారంటే నేను నమ్మను. భగవంతుని పరమైన దుర్గుణాలు కూడా పవిత్రమయి పోతాయట! అలా మీరు చేసే అపరాధం కూడా సత్కార్యం అయిపోతుంది—"

"అబ్బ బాబోయ్! మానసా దేవీ! నన్ను భగవంతుడితో పోల్చి లోకంలో భగవంతుడికి విలువ లేకుండా చేస్తారా?"

మానస కనురెప్పలు వాల్చుకొంది.

"నేను మాట్లాడినది లోకం విషయం కాదు. నా సంగతి"

సుధాకర్ కంఠంలో నుండి అప్రయత్నంగా ఆవేదనా సూచకమైన మూలుగు వెలువడింది.

మానస కంగారుగా లేచి సుధాకర్ నుదుటి మీద చెయ్యి వేసి "అదేం? ఒంట్లో బాగులేదా?" అంది. మానసా సుధాకర్ల నడుమ ఈ మాత్రపు చనువు కిదే ప్రారంభం. న్యాయాన్యాయాల సంఘర్షణలో వేడెక్కిన అతని నుదిటి పై మానస చెయి అమృతధారలు వర్షించింది. ఎందుకనో అతనికి ప్రప్రథమంలో మానసను ముసలిదానిగా భావించి, తాను చేయి పట్టుకుని తీసికు

వెళ్ళడం గుర్తు కొచ్చింది. ఆ క్షణంలో, అతడు తన మనస్సంక్షోభాన్నంతా మరిచి పోయాడు. తన నుదుటిపై నున్న మానస చేతి మీద తన చేతిని ఉంచి మృదువుగా నొక్కుతూ "నా బ్రతుకు వ్యర్థం కాదను కోవటానికి. ఈ ఒక్క దివ్య క్షణం చాలు మానసా!" అన్నాడు.

కొద్ది క్షణాల వరకూ అతడు తన చేయి తొలగించ లేక పోయాడు. మానస కూడా, తన చేతిని వెనక్కు తీసికోలేదు. అంతలో సుధాకర్ మత్తు లోంచి మేల్కొని మానస చేతిమీది నుండి తన చేతిని తొలగించి "ఇంతకూ, మీరు వచ్చిన ప్రత్యేకమైన పని ఏమిటి?"

మానస ఇంకా, తన కలలోంచి మేల్కోలేదు; మేల్కొనటం ఆమె కిష్టం లేదుకూడా! సుధాకర్ సంభాషణా మార్గాన్ని మరలించటంలో, చేసేది లేక, నిరంజని తనకు వ్రాసిన ఉత్తరం సుధాకర్ చేతి కిచ్చి, "ఇది చూపించటం కోసం వచ్చాను'' అంది. ఆ ఉత్తరం చదువుతూనే సుధాకర్ ముఖం రక్తపు బొట్టు లేకుండా, తెల్లగా పాలిపోయింది. అది చూసి మానస తెల్లబోతూ "అదేం? మీ రెంతో సంతోషిస్తారని భావించాను."

"నాకు చాలా సంతోషమే! మీ కెలా ఉంది?"

"నా కింత కంటే సంతోషకరమైన వార్త ఉండదు; కాని, మీరెందుకూ, అలా అయిపోయారు?"

సుధాకర్ తన మనసులోది చెప్పాలని మానస ముఖంలోకి చూశాడు. ఆమె కళ్ళతో తన కళ్ళు కలవగానే, అతని గొంతు పూడుకుపోయింది. చివరకు, "ఏదో గుర్తు కొచ్చింది. మీకు ఇప్పు డేం చేప్పలేను. కానీ, ఎప్పుడో ఒకనాడు— నాకు నేను బ్రతుకులో ఆసక్తి లేకుండా చేసికో గలిగిననాడు. మీ కన్నీ వివరాంగా చెపుతాను. ఇప్పుడేమీ అడగకండి." అన్నాడు. మానస మనసంతా వ్యాకుల మయింది. ఆమెకంతా అయోమయంగా ఉంది. ఏదో మాట్లాడా లని ప్రయత్నించే లోగానే, సుధాకర్ లేచి, చెప్పులు తొడుక్కొని "రండి! మీ ఇంటి దగ్గర దింపి వస్తాను. నేను మంచివాణ్ణి కాదు. మీరు మా ఇంట్లో ఎక్కువకాలం గడపటం మీకు క్షేమం కాదు." అన్నాడు.

మానస కదలలేకపోతూంది అతనితో ఏవేవో చెప్పాలని. ఆమె మనసు ఆరాటపడుతూంది, కాని అప్పటికే, సుధాకర్ గది బయటకు వచ్చేశాడు. మానసకు కోపం వచ్చి, తనతో రానక్క ర్లేదని అందా మనుకుంది. కానీ ఆ కొద్ది సేపైనా లభించే అతడి సాహచర్య భాగ్యాన్ని వదులుకోలేక, అతని వెంట బయలు దేరింది.

## 13

కౌస్తుభ్యాన్ సుధాకర్‌కు రెండు పత్రాలందించాడు — ఒకటి మానస దగ్గి

ర్నుంచి. వెంటనే విప్పాడు సుధాకర్.

"సుధాకర్ గారూ!

నా సాహసాన్ని మన్నించగలరా? వణుకుతూన్న నా చేతితో, స్థిరంగా, ఈ అక్షరాలు వ్రాయగలగటం కష్టంగా ఉంది. నన్నెందుకిలా అయోమయంలో ఉంచుతున్నారు? అమృత భాండాన్ని పెదిమలవద్దకు తెచ్చి అందించటానికి ఎందుకు సందేహిస్తున్నారో అర్థం చేసికో లేకపోతున్నాను ఒకవేళ నేనే పొరపాటుగా అర్థం చేసుకోడం లేదుగదా! క్షమించండి. ఈ అయోమయావస్థకన్న, ఎంత చేదైనా, యదార్థం తెలిసికోవాలని ఉంది. మీ సమాధానంకోసరం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తూంటాను. అదృష్ట వంతురాలి నయితే మా అమ్మతో మాట్లాడుతాను మీ పాదసేవకు అర్హురాలిని కాలేని నిర్భాగ్యురాలి నయితే, ఇకమీద మిమ్మల్ని విసిగించను. తప్పక సమాధానం వ్రాయవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

మరొక్కసారి నా సాహసానికి క్షమించమని ప్రార్థిస్తున్నాను

మానస"

తన కన్నీళ్ళతో అక్షరాలు అలుక్కుపోయి, సరిగా చదవటానికి వీలు కానంత వరకూ, సుధాకర్‌కు, తన కనులవెంబడి నీరు స్రవిస్తూందని గానీ, తాను పదే, పదే, అదే ఉత్తరాన్ని అర్థరహితంగా చదువుతున్నా నని గానీ, తెలియనే తెలియలేదు, ఎదురుచూస్తూన్న-తప్పించు కొందామని ప్రయత్నిస్తూన్న – భయంకర ముహూర్తం వచ్చేసింది. ఇక తన బంగారుకల కరిగిపోవటానికి ఎక్కువ వ్యవధిలేదు ఒక నీరసభావం సుధాకర్‌ను క్రమ్ముకొంది. అతని చేతుల నుండి అప్రయత్నంగా మానస ఉత్తరం క్రిందకు జారిపోయింది శూన్యంగా చూస్తున్న అతని దృష్టిపథంలోకి అప్పుడు రెండవ ఉత్తరం వచ్చింది. అది ధర్మారావు రాశాడు. ఆ ఉత్తరంవిప్పుతూంటే, సుధాకర్ గుండె దడదడ లాడింది.

"డియర్ సుధా!

నిరంజని వల్ల సమస్తమూ తెలిసికొన్నాను. నేనెప్పుడూ నీ స్నేహానికి గర్విస్తూండేవాడిని ఈనాటికి, నీవు నా స్నేహితుడవైనందుకునేనుతలవంచుకొనేలాగ ప్రవర్తిస్తావా? ఎందుకంత పిరికివాడి వయిపోతున్నావు? నీ అనురాగం, నీ ప్రియురాలి మూర్ఖత్వాన్ని కరిగించలేనిదయినపుడు దానికి విలు వేముందీ? నాలుగు జీవితాలు తమ అదృష్టనిర్ణయం కోసం తహతహతో నిరీక్షిస్తున్న తరుణమిది. ఇక తాటస్థ్యాన్ని వహించకు! లే! అనంతమైన నీ ప్రణయ వాహినిలో మానస హృదయంలో పేరుకొన్న కులభావమాలిన్యాన్ని కడిగివెయ్యి. నీ ప్రయత్నంలో విజయం కలగాలని ఆశిస్తున్నాను. నీ వ్యక్తిత్వంలో నాకు అపారమైన విశ్వాసం. నీ గౌరవానికి భంగం

కలుగకుండా ఇంతవరకూ మన మాడిన నాటకాన్ని ముగించే భారాన్ని నీమీదనే ఉంచుతున్నాను. నా విశ్వాసాన్ని వమ్ము కానివ్వవని నమ్ముతున్నాను

సీ. ధర్మారావు"

ధర్మారావుకు చెతు లెత్తి నమస్క రించా లనిపించింది సుధాకర్‌కు. తాను పాల్పడిన నీచాన్ని ధర్మారావే. మానసకు వ్యక్తం చేసిఉంటే తన గతి ఏమయి ఉండేది ? చిరస్థాయిగా మానస దృష్టిలో ఒక మోసగాడయి ఉండేవాడు. ధర్మా రావు తనను విశ్వసించినందుకు, తన విధిని, నిర్వర్తించాలి.

సుధాకర్ అనుభవిస్తూన్న భావ తీవ్ర తకు చిహ్నంగా, అతని చేతిలో ఉత్తరం ముక్కలు ముక్కలై క్రిందకు రాలింది.

* * *

పోస్ట్‌మ్యాన్ కోసం తన గది కిటికీ లోంచి బయటకు చూస్తున్న మానసకు సుధాకర్ రాక సంతోషాన్నీ సంభ్ర మాన్నీ కలుగజేసింది. ఎప్పుడూ, సుధాకర్ వచ్చాడని తెలియగానే శర వేగంలో అతని నెదుర్కొని, తగు మర్యాదలతో ఉక్కిరి బిక్కిరి చేసే మానస ఈనాడు గదిని వదిలి రాలేక పోయింది. ఆమె హృదయస్పందన తీవ్ర మైంది. శరీరమంతా చెమటలు క్రమ్ముకొన్నాయి. లేవబోయేసరికి కాళ్లు వణికాయి. తూలి కుర్చీలో కూలబడి తిరిగి లేవలేక పోయింది.

అన్నపూర్ణమ్మగారు సుధాకర్‌ను సాదరంగా ఆహ్వానించి, కుశల మడిగి లోపలకు పోబోయారు. సుధాకర్ మానస ఎప్పటిలా తన దగ్గరకు రాకపోవటాన్ని గమనించాడు అందుకు కారణంకూడా ఊహించాడు. జాలితోనూ ఆవేదనతోనూ అతని మనసు సుడులు తిరిగింది. ఇదీ మంచిదే అయింది. మానస ఎదురుగా ఉంటే తన మాటలతో ఆమెపై పిడుగులు కురిపించటం తనకు సాధ్య మయ్యేది కాదు. పోబోతున్న అన్నపూర్ణమ్మగారిని ఆపి "మీతో కొంచెం మాట్లాడాలని వచ్చాను" అన్నాడు. ఆమె ఆశ్చర్యంగా చూశారు. ఆ చూపులను తప్పించు కొంటూ తల వంచుకొని లోగొంతుకతో, "మానస ఎన్నడూ నన్నూ, నా కులాన్నీ గురించి ప్రశ్నించలేదు. ఆమె నన్ను బ్రాహ్మణునిగా భావిస్తూందని తెలిసే, కొన్ని కారణాలవల్ల నిజం చెప్పలేక పోయాను. ఈనాడు నిజం చెప్పవలసిన అవసరం వచ్చింది.' మేము హరిజనులం. ఈ సంగతి మానసతో చెప్పండి. చేతులు మోడ్చి ఆమె క్షమాపణ లర్థిస్తున్నానని చెప్పండి. ఆమె నన్ను క్షమించ గలిగితే ఆమె ఆజ్ఞకు సర్వదా బద్ధుడినని తెలియ జేయండి." అని పాఠం అప్పజెపు తున్నట్లు పలికి, తలైనా ఎత్తకుండా, సమాధానం కోసరమైనా ఎదురు చూడ కుండా పారిపోయాడు.

(సశేషం)

# సాగరసంగమము

ఆనందారామం

(ధర్మారావు పంచమకులజను పెళ్లి చేసుకోవడాన్ని మానస విమర్శించుతూంటే సుధాకర్ మనసు కలత చెందింది; తర్కించి ఫలశూన్యమైంది మానస అభిప్రాయం పురస్కరించుకొని ధర్మారావు నిరంజని మనసును క్షోభింప చేస్తాడు. మానసా నిరంజనుల మధ్య జరిగిన వుత్తర ప్రత్యుత్తరాలవల్ల అనేక విషయాలు ధర్మారావుకు తెలిసినయి.

సుధాకర్ మానసను చాలా దినాలుగా కలుసుకోకపోవడంతో మానసే సుధాకర్ వద్దకు వచ్చి, అతను తనయెడ చూపిన అలక్ష్యానికి కోపగించి వెళ్లిపోయింది. సుధాకర్‌కు మానసవద్ద నుంచీ, ధర్మారావువద్ద నుంచీ వచ్చిన రెండు వుత్తరాలవల్లా మనసు కల్లోలమయింది. వెంటనే ఏదో నిర్ణయంతో మానస యింటికి వెళ్లి తన కులం విషయం అన్నపూర్ణమ్మగారికి చెప్పేసి బయట పడ్డాడు)

—ఇక చదవండి.

అన్నపూర్ణమ్మగారు విభ్రాంతితో వెలతెల పోయారు. ఆమెలో ఆలోచించే శక్తికూడా లేకపోయింది...మానస ఈ దెబ్బ కెలా తట్టుకోగలదో ఆమె ఊహించ లేకపోయారు. దిగులుగా మానస గదిలోకి నడిచారు.

మానస తన గదిలోనే పరువుమీద వాలి ఊహలలో తేలిపోతూంది...సుధాకర్ వస్తాడు. తను కనపడదు. అమ్మనడుగుతాడు. అమ్మ తనగదిని చూపిస్తుంది; లోపలకు వస్తాడు. పరధ్యానంలో ఉన్న తన కళ్ళు అతని బలమైన చేతులతో మృదువుగా మూసేస్తాడు. కలలోనైనా ఊహామాత్రంగానైనా తనను పరవశింపజేసే ఆ స్పర్శను తాను గుర్తించటం కష్టంకాదు. నెమ్మదిగా 'నా దేవత' అని అతని చేతులను తొలగించి వేస్తుంది. అతడు వంగి తన చెవిలో తమ వివాహ నిర్ణయాన్ని గురించి చెపుతూ, చేతులలో తనను చుట్టేస్తాడు. అంతలో అక్కడికి అమ్మ వస్తుంది...

'మానసా!' అన్న అన్నపూర్ణమ్మ

గారి పిలుపుతో ఉలికిపడి ఈ లోకంలోకి వచ్చింది మానస, సంభ్రమాన్ని సర్దుకొంటూ. "ఏమమ్మా? సుధాకర్‌గారు నన్ను రమ్మంటున్నారా?" అంది.

అన్నపూర్ణమ్మగారు నిర్లిప్తంగా "లేదమ్మా! ఆయన వెళ్ళిపోయారు." అన్నారు. మానస బిత్తరపోయిచూసింది

"నాతో మాట్లాడివెళ్ళారు" అన్నారు అన్నపూర్ణమ్మగారు. మానస ముఖం ఎర్రబడింది సిగ్గుగా. బెదురుగా అన్నపూర్ణమ్మగారి మొహంలోకి చూసింది మానస. అన్నపూర్ణమ్మగారు మానస దగ్గరగా వచ్చి, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని తల నిమురుతూ నించున్నారు. కొద్దిక్షణాలాగి మానస నిగ్రహించుకోలేక "ఏం మాట్లాడారమ్మా" అంది.

అన్నపూర్ణమ్మగారి గొంతు వణికింది.

"సుధాకర్‌గారే కులస్థులు మానసా?"

మానస బిత్తరపోయింది. పిచ్చిగా తల్లివంక చూస్తూ "నిరంజని బ్రాహ్మణుల పిల్ల! ఆమె అన్న బ్రాహ్మణుడు కాకేమవుతాడు?" అంది.

"నిరంజని! తాను బ్రాహ్మణి నని నీతో చెప్పిందా?

మానసకు ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లు తోచింది. ఏమిటిది? ఏం జరుగుతోంది? నిరంజని బ్రాహ్మణులపిల్ల కాదా? తను ఆమె బ్రాహ్మణి అని భావించి, ఒకటికి పదిసార్లు ఆ అర్థం వచ్చేలాగ మాట్లాడినపుడుకూడ తాటస్థ్యం వహించడానికి కారణ మేమిటి? తాను ఎన్నిసార్లు ఆహ్వానించినా భోజనానికి రాకపోవటానికీ, తనను ఎన్నడూ భోజనాని కాహ్వానించక పోవటానికీ. ఇదే కారణమా? మరి సుధాకర్!... అవును అతడుగూడా ఎప్పుడూ కులాన్నిగురించి ప్రస్తావించలేదు. అంతులేని అభిప్రా



నాన్ని వ్యక్తపరుస్తూకూడా, సుధాకర్ తనకు దూరంగా ఉండటాని కిదే కారణమా? భగవాన్!...

మానసకు కళ్ళు తిరుగుతున్నాయి.

ఆమెది బేలగుండె. అల్లారుముద్దుగా, ఆడింది ఆటగా పెరిగిన ఆ యువతి ఏ మాత్రపు ఉద్వేగాన్నీ భరించలేదు.

సుధాకర్ ఎంత నిగ్రహించుకున్నా.



వ్యక్తం కాకమానని అతని అనురాగం మీది నమ్మకంతో సాహసించి అతనికి ఉత్తరం వ్రాసింది; కాని, అది పోస్ట్ చేసిన మరుక్షణంనుంచీ అంతులేని ఆరాటా న్నను భవిస్తూంది. ఈనాడు సుధాకర్ స్వయంగా తమ ఇంటికి రావటంతో, వివిధభావసంఘర్షణలతో, అనిర్వచనీయ మైన ఉత్కంఠతతో ఆమె మస్తిష్కం వేడెక్కి ఉంది. దానికిపైగా, అన్నపూ ర్ణమ్మగారి మాటలతో, ఆమె కేదో మైకం ఆవహించినట్లయింది.

అన్నపూర్ణమ్మగారు జాలిగా మానస తల నిమురుతూ, ప్రారంభించారు. "సుధాకర్‌గారు పంచమ కులస్థులట! ఆయన నీతో..."

అన్నపూర్ణమ్మగారి వాక్యం పూర్తి కాకుండానే మానసకు స్మృతి తప్పి పోయింది. ఆవిడగుండె గుభిల్లుమంది. మానస విపరీతంగా బాధ పడవచ్చునని ఊహించింది కాని, మరీ ఇంతగా స్పృహ తప్పిపోతుందని అనుకోలేదు. కంగారుగా నౌకరును కేకేసి డాక్టర్ దగ్గ రకు పంపించారు.

## *14*

మానసకు స్మృతి వచ్చి కళ్ళు తెరిచే సరికి ముందుగా దైన్యం గూడుకట్టుకొని ఉన్న, అన్నపూర్ణమ్మగారి ముఖం కన పించింది.

ఆ ముఖంవంక చూడలేక, మానస తల తిప్పుకొంది. అన్నపూర్ణమ్మగారు ఆప్యాయంగా, మానసతలను తనవైపు తిప్పుకొని "ఎలా ఉందమ్మా" అన్నారు.

"నన్ను క్షమించగలవా అమ్మా! నా మూర్ఖత్వంతో అమృతమూర్తివయిన నిన్నుకూడా మైల పరిచాను." జాలిగా బాధగా అంది మానస.

"హుష్, అనవసరంగామాట్లాడకు."

ధర్మారావు గొంతు విని ఎదురుగా చూసింది మానస.

తన మంచం పక్కనే కుర్చీలో కూర్చునిఉన్నాడు.

"బావా?"


"అత్తయ్య వైరిస్తే వచ్చాను. విశ్రాంతి తీసికో. అత్తయ్యా! మానసకు జ్వరం నూటమూడు డిగ్రీ లుంది. ఎక్కువ మాట్లాడనివ్వకు.

కానీ మానస ఆగలేదు.

"అత్తకు బుద్ధిచెప్పి కోడలు గడ్డి తిం దిట. నన్ను నేను ఏ విధంగా శిక్షించుకో వాలో చెప్పవా బావా?"

"ఇప్పుడు శిక్ష అనుభవించవలసి నంత మహాపరాధ మేదీ నువ్వు చెయ్య లేదు అయినా, ఇప్పుడు నీకు నువ్వు విధించుకొన్న శిక్ష నీపొరపాటుకు వేయిరె ట్లెక్కువయింది. ఇంక మాట్లాడకు మానసా!" లాలనగా అన్నాడు ధర్మా రావు.

"ఒద్దు బావా! నన్ను మాట్లాడనియ్యి. నాలాంటివాళ్లు చావరులే!"




కసిగా అంది మానస. అన్నపూర్ణమ్మ గారు చటుక్కున మానస నోరుమూసి "ఈ నా కంఠంలో ప్రాణం ఉండగా అలాంటి మాటలు మాట్లాడకు మానసా!" అన్నారు.

"నామాట వినవా మానసా!" ఆజ్ఞాపించునట్లు లాలనగా అన్నాడు ధర్మారావు.

మానస కొన్ని క్షణాలు మాత్రమే ఊరుకొంది.

"బావా! నువ్వు తొందరపడకుండా వెనుకా ముందూ ఆలోచించి అన్ని విషయాలూ తెలిసికొని నీకు న్యాయమని తోచిన మార్గాన్ని ఎన్నుకొన్నావు. నేను వెట్టి వ్యామోహంలో కళ్ళు మూసుకుపోయి నిజానిజాలు తెల్సుకొనే ప్రయత్నమైనా చెయ్యలేదు. ఇంతటి నీచురాలిని నన్నెలా క్షమించగలవు బావా!?"

"ధర్మారావు వ్యాకులమానస పాటుతో రెండుచేతులూ పట్టుకొని "మానసా! బంగారు తల్లీ! నువ్వు వెర్రితల్లివమ్మా! అప్పుడే కళ్ళు తెరిచిన పసిపాపవంటి, నిర్మలమూర్తివి. నీ తప్పేమీ లేదు. ఎవరి తప్పూలేదు. ఇది చాలా సాధారణ విషయం. దీనిని తేలికగా తీసుకో మానసా; స్థిమితపడు!..." అన్నాడు

కానీ, మానసకు జ్వరం మరింత తీవ్రమయింది. మధ్యమధ్య స్మృతికూడా కోల్పోతూంది. స్మృతిలేని సమయాల్లో ఆమె పెదిమలు నిరంతరమూ సుధాకర్ అన్న నాలుగక్షరాలనే ఉచ్చరించేవి. ఈ పరిస్థితి చూసి ధర్మారావు సుధాకర్‌ను పిలుచుకొనివచ్చాడు. సుధాకర్ పిచ్చెక్కినవాడిలాగ ఉన్నాడు. ప్రలోభానికి లొంగిపోయి, స్వార్థపరత్వంతో, ఈ అమాయక నిర్మలమూర్తినింతటి దారుణహింసకు పాల్పడజేసినందుకు అతడు కుమిలిపోతున్నాడు. మానస కప్పుడే కొద్దిగా తెరిచి కలిగింది. ఎదురుగా సుధాకర్ కనబడగానే, అరక్షణం ఆమె

ముఖం వెలిగింది. కానీ మరుక్షణమే. అంతటి జ్వర తీవ్రతలోనూ. ఆమె కనుబొమలు ముడిపడ్డాయి. విసుగ్గా తల తిప్పుకుంది. సుధాకర్ ముఖం వాలిపోయింది. తన తలదగ్గిరగా కూర్చున్న అన్నపూర్ణమ్మగారితో మానస కర్కశంగా "అమ్మా! నావాళ్లు తప్ప ఇక్కడెవరూ ఉండక్కర్లేదు" అంది.

ధర్మారావు సుధాకర్‌వంక చూశాడు. సుధాకర్ తలవంచుకొని గదిలోంచి బయటకు నడిచాడు, అడుగుల చప్పుడు దూరమయిన తరువాత మానస అడిగింది.

"వెళ్ళిపోయాడా!"

"ఆఁ!" జాలిగా అన్నాడు ధర్మారావు.

మళ్ళీ మానసకు స్పృహ తప్పింది. అన్నపూర్ణమ్మగారు విహ్వలభావంతో "ధర్మారావూ! నా మానసను దక్కించుకొనే ఉపాయమేమీ లేదా!" అన్నారు.

ధర్మారావు గంభీరంగా నిట్టూర్చాడు.

"ఒకమార్గం ఉంది అత్తయ్యా! కానీ నువ్వేమంటావో?"

అన్నపూర్ణమ్మగారు ఆందోళనగా "చెప్పు ధర్మా! నా బిడ్డకోసం నేనేమైనా చేస్తాను" అన్నారు.

"మానసా సుధాకర్‌ల వివాహానికి నువ్వు అనుమతిస్తే మానస బయటపడవచ్చు!"

"ఓస్! ఇంతేనా! నేను అభ్యంతరం చెప్పిందెప్పుడూ? మానసా సుధాకర్‌ల వివాహాన్ని నేను సంతోషంగా ఆమోదిస్తాను."

ధర్మారావు ఆశ్చర్యంగా మేనత్తవైపు చూసాడు ఆమె ముఖం నిర్మలంగా ఉంది. ఆమె ఈ మాటలు మనసారానే అన్నారు.

డాక్టర్ ఇచ్చిన ఇంజెక్షన్ కొంచెంసేపటికి మానస మళ్ళీ కళ్ళు తెరిచింది. అన్నపూర్ణమ్మగారు ఆమె తల నిమురుతూ, "మానసా. పిచ్చితల్లీ. నీ మనస్సు పాడుచేసుకోకు. నువ్వు సుధాకర్‌గారిని వివాహం చేసికోవటానికి నేను హృదయపూర్వకంగా అంగీకరిస్తున్నాను." అన్నారు.

మానస, ఏడుస్తున్నట్లు నవ్వింది.

"అమ్మా! నువ్వా విషయం మాట్లాడకు. అతని పేరు నాదగ్గర ఎత్తకు. ఒకనాడు, నా వివాహ నిర్ణయం జరిగినప్పుడు నువ్వెంత ఆవేదన ననుభవించావో నేను గుర్తించలేదు. నా మీద ప్రేమతో నువ్వు నీ నిర్ణయం మార్చుకోవచ్చు. కానీ నేనంత బుద్ధిహీనురాలిని కాను."

అత్యంత నిరసస్థితిలో ఆన్నిమాటలు మాట్లాడి. మానస ఆయాసపడింది. అన్నపూర్ణమ్మగారు నిస్సహాయంగా ధర్మారావువంక చూశారు.

ధర్మారావుకు మెరుపులాగ ఒక ఆలోచన తట్టింది. మానస దగ్గిరగా వచ్చి, "మానసా! మిగిలిన సంగతులన్నీ పోనియ్యి. నీకు అత్తయ్యంటే ఇష్టమే

కదూ!" అన్నాడు.

మానస అదోరకలా నవ్వి అంది. "ఇదీ ఒక ప్రశ్నేనా? ఏం? నీ కేమైనా అనుమానంగా ఉందా?"

"ఎంతమాత్రమూ లేదు అందుకనే చెప్తున్నాను. ఒక్కసారి అత్తయ్యను చూడు. ఈ వారంరోజుల్నుంచీ, తిండీ తిప్పలూ లేకుండా బెంగపెట్టుకొని నీ మంచందగ్గిరే కూర్చుంది. నీకు ఇంకా తగ్గకపోతే ముందు అత్తయ్య కేమైనా కావచ్చు. నీకు మీ అమ్మమీద ఏమాత్రం ప్రేమ ఉన్నా ముందర నువ్వు బాగు పడాలి. నువ్వు మిగిలిన ఆలోచనలన్నీ వదిలి ప్రశాంతంగా ఉండకపోతే నీ జబ్బు నయంకాదు. నీ జబ్బు నయంకాక పోతే అత్తయ్య ఏమవుతుందో!"

మానస గుండె ఝల్లుమంది. ఆమె మనసులోని భయం ఆ కళ్ళలో స్పష్టంగా కనుపించింది. ధర్మారావు మంత్రం అద్భుతంగా పనిచేసింది తర్వాత రెండు రోజులకే జ్వరం తిరుగుముఖం పట్టింది. మూడవరోజున నార్మల్‌కు వచ్చింది.

అకస్మాత్తుగా సుధాకర్ గొంతు వినిపించి, మానస శరీరంలోని ప్రత్యణువూ వ్యగ్రత వహించింది. "మానస కెలా ఉందండీ! కొంచెమయినా కోలుకుందా?"

ధర్మారావుబావ గొంతు సమాధాన మిచ్చింది.

"ఆ! ఇవాళ నార్మల్‌కు వచ్చింది. ఫరవాలేదు, ఇక కోలుకోవచ్చు."

సుధాకర్ తన దగ్గిరకు వస్తాడని, కొంచెంసేపు ఎదురు చూసింది మానస. అతడు రాలేదు ఏదో ఉడుకుమోతుతనం మనసును కుతకుతలాడించగా ప్రక్క మీంచి లేస్తే తూలిపోయే అపరిస్థితిలో హాలులోకి వచ్చి, సుధాకర్ వంక క్రూరంగా చూస్తూ, "అడ్డమైనవాళ్ళూ నా ఆరోగ్యంగురించి కనుక్కోనక్కర్లేదు. సంస్కారాల ముసుగులతో జరిపే పైశాచిక కృత్యాలను చూస్తూ కూర్చోవడానికి ఇక్కడ వెంగళప్పలెవరూ లేరు మాది ఉత్తమ బ్రాహ్మణవంశం. మాలమాదిగల రాకతో మా ఇల్లు అపవిత్రం కావటం నా కిష్టంలేదు" అంది.

సుధాకర్ వంచిన తల ఎత్తలేదు. అన్నపూర్ణమ్మగారు నిర్ఘాంతపోయారు. ధర్మారావు నిస్సహాయంగా సుధాకర్ వంకా, మానసవంకా జాలిగా చూశాడు.

విసురుగా వెనక్కు తిరిగిన మానస, కళ్ళుతిరిగి తూలి పడబోతూ "అబ్బా!" అంది.

సుధాకర్ గబుక్కున లేచి పడబోతూన్న ఆమెను పొదివి పట్టుకున్నాడు.

"ఛీ! నన్ను ముట్టుకోవద్దు." చీదరించుకుంటూ గర్జించింది మానస. ధర్మారావు తొందరగా అక్కడకు వచ్చి మానసను తాను అందుకొని లోపలికి తీసికెళ్ళి మంచంమీద పడుకోబెట్టి సుధాకర్ దగ్గిరకు వచ్చాడు. సుధాకర్ తల ఎత్తి, "క్షమించు ధర్మా! వెడుతున్నాను."

అన్నాడు. ధర్మారావు హృదయం ద్రవించిపోయింది. దుర్భర విషాదం తాండవమాడే సుధాకర్ ముఖంలోకి చూడలేకపోయాడు. అనునయించటానికి మాటలు దొరకక అతని భుజంపై చెయ్యి వేసి నొక్కాడు. సుధాకర్ బెరుగ్గా చేతిని తొలగించబోయాడు. కానీ, ధర్మారావు అతని భుజాన్ని ఆప్యాయంగా నొక్కిపట్టి, "నేను సుధా!" అన్నాడు.

సుధాకర్‌తోపాటు ధర్మారావుకూడా బయటకు వచ్చారు.

సుధాకర్ దీనంగా "ధర్మా..."అని ప్రారంభించి మాటలు దొరకక ఆగిపోయాడు. ధర్మారావు అతని భుజం ఆప్యాయంగా తడుముతూ "సిగులు పడకు సుధా! ఒక విషయం నీకు చెపుతున్నాను నమ్ము. మానస నిన్ను హృదయపూర్వకంగా ఆరాధిస్తోంది." అన్నాడు. సుధాకర్ బరువుగా నిట్టూర్చి ఆ సంగతి నాకు తెలుసు ధర్మా! అలా కాకపోతేనే బాగుండి ఉండేదని కోరుకుంటున్నాను ఇప్పుడు." అన్నాడు.

ధర్మారావు సుధాకర్ చేతిని తన చేతిలోకి తీసికొని అప్యాయంగా నీ వేం దిగులుపడకు సుధా! కొన్నాళ్లు ఓపిక పట్టు. నాకు మా అత్తయ్య విశిష్టవ్యక్తిత్వంలో నమ్మకం ఉంది. ఆవిడ అమృతమూర్తి. ఈ కథను సుఖాంతం చేయగలిగేసామర్థ్యం ఆవిడకే ఉంది; చేస్తుందికూడా!" అని గుడ్‌నైట్ చెప్పి వెనక్కు వచ్చేశాడు.

వచ్చీ రాగానే, ముందు చప్పుడు కాకుండా మానసగదిలోకి వెళ్ళాడు. మానస తలదిండు పూర్తిగా తడిసిఉంది. కనురెప్పలు ఉబ్బిఉన్నాయి. ధర్మారావు కంగారుగా మానసదగ్గిరకు వచ్చి ఆమె కళ్ళు తుడిచేసరికి. ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. ధర్మారావు ఆమె తలదిండు మార్చి "మానసా! ఎందుకు నిన్ను నువ్విలా చిత్రవధ చేసుకొంటున్నావ్?" అన్నాడు ధర్మారావు. మానస సమాధానము చెప్పలేదు. కొంతసేపాగి ధర్మారావు మళ్ళీ అన్నాడు.

"నీ కివాళే నార్మల్ వచ్చింది ఇలా ఏడుస్తే మళ్ళీ జ్వరంరాదూ?"

"వస్తే నేం బావా? చచ్చిపోతానా? అంత అదృష్టవంతురాలినా?"

ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ ఆవేదన అనేమాట కర్థంతెలియకుండా పెరిగిన మానస ఈ విధంగా మాట్లాడటము అతను సహించలేకపోయాడు.

"అదిగో మళ్ళీ! అత్తయ్య ముఖం చూడు?"

"ఎందుకూ? అమ్మకు నాలాంటి కూతు రుండటంకన్న లేకపోవడమే మంచిది." విరక్తిగా అంది మానస. ఇంక మానసతో మాట్లాడి ప్రయోజనం లేదని తెలిసి, ఇవతలకు వచ్చేశాడు. మానసకు జ్వరం పూర్తిగా తగ్గింది. అన్నపూర్ణమ్మగారు తన ఇష్టదైవానికి



మనసారా నమస్కరించి, సంతృప్తిగా నీరాజనం సమర్పించుకొన్నారు

ఆరోజు తమ ఇంటి ప్రాంగణంలోని పూలమొక్కల మధ్య నిరాసక్తంగా అటూ ఇటూ తిరుగుతూంది మానస. అంతలో, కలలోనైనా తనకు నూతనోత్తేజాన్ని కలిగించే కంఠధ్వని వినిపించి, మానస చటుక్కుని ఆగిపోయి, శ్రద్ధగా వినసాగింది.

"అయితే, పూర్తిగా తగ్గినట్లేనా?"

"ఆ తగ్గింది బాబుగోరు! కానీ ఆ యమ్మేటో ఇదివరకులా లేరు - ఎప్పుడూ దిగులుగుంటారు. ఎప్పుడూ నవ్వుతూండే ఆమె ముఖాన నవ్వే కానరాటంలేదు."

ఈ గొంతు తమనౌకరు వెంకయ్యది.

"ధర్మారావు వెళ్ళిపోయాడా!"

ఆ ధ్వని వినవచ్చిన దిక్కుగా ఎత్తైన కాంపౌండు గోడవంక, వాళ్ళంతా కళ్ళు చేసికొని చూసింది మానస. తన తీవ్రభావన, ఆ ఇటుక ముక్కలలో, తన దివ్యమూర్తి ప్రతిబింబాన్ని చూపిస్తుందని భ్రమ కాబోలు!

లేదుబాబూ! యాడికో ఎల్లిండ్రు. కూసింత సేపులో రావచ్చు"

"ఒకపని చేస్తావా?"

"సెప్పండి బాబూ!"

"మానసకు సాహిత్యమంటే ఎంతో అభిరుచి. ఈ నవలలు ధర్మారావు కిచ్చి మానస కియ్యమని చెప్పు. వీటి సహాయంతో ఆమె తన దిగులు కొంతవరకూ మరిచిపోవచ్చు"

"అట్లాగే బాబూ!"

"జాగ్రత్తగా ఇయ్యి. ఇంద! ఏమైనా కొనుక్కో."

"దండాలు బాబూ!"

ఇక మాటలు వినిపించలేదు.

మానస తూలుతూ లోపలకు వచ్చేసింది. ఆ సాయంత్రం చేతిలో నవలల్తో మానస గదిలోకి వచ్చాడు ధర్మారావు.

మానసా! కొత్తగా ఏం తోచకుండా

ఉన్నావు ఇవి చదువుకో! శాస్త్ర శాల్ల క్షేపంగా ఉంటుంది "

మానస ధర్మారావు ముఖంలోకి చూస్తూ "కొన్నావా?" అంది.

ధర్మారావు గతుక్కుమని మానస ముఖంలోకి పరిశీలనగా చూసి. "లేదు ఒక స్నేహితు డిచ్చాడు," అన్నాడు.

"నా గదిలో వాటి నుంచకు బావా! కావాలంటే నీ గదిలో పెట్టుకో! లేక పోతే అవతల పారెయ్యి."

ధర్మారావు తెల్లబోతూ. "నీకు తెలుసా?" అన్నాడు

మానస ముఖం తిప్పుకొంది. ధర్మారావు కిక ఏం మాట్లాడేందుకూ సాహసము లేక ఇవతలికొచ్చేశాడు. కొంచెం సేపయిన తరువాత, మానసతో ఏమైనా కబుర్లు చెపుదామని వెళ్ళిన ధర్మారావుకు మానస దిండులోనికి తలదూర్చి హృదయవిదారకంగా రోదిస్తూ కనుపించింది. ఆమె మనఃక్షోభ మవశమింప జేయగలిగినది కన్నీ రేనని భావించి చప్పుడు చేయకుండా ఇవతలకు వచ్చేశాడు

## 15

"అత్తయ్యా! సెలవు పెట్టడానికి వీల్లేదు. రేపు వెళ్ళిపోవాలి" అన్నాడు ధర్మారావు. అన్నపూర్ణమ్మగారి దగ్గరకు వచ్చి.

అన్నపూర్ణమ్మగారు దిగులు పడి పోయారు.

"ధర్మా! మానస సంగతి చూస్తున్నావా? నాకు దారితోచటంలేదు. దాన్ని మళ్ళీ మామూలుగా చూడగలమా?"

"అంతా నీ చేతుల్లోనే ఉందత్తయ్యా! నువ్వు నచ్చజెబితే, మానస సుధాకర్‌ను వివాహం చేసికుంటుంది. అప్పుడు లోకంలోని సంతోషమంతా దానిదే అవుతుంది "

"నేను కాదన్నానా ధర్మా! లక్షసార్లు చెప్పాను. ఇప్పుడు మళ్ళీ చెపుతాను." అని ధర్మారావుతో కూడా అన్నపూర్ణమ్మగారు మానస గదిలోకి వచ్చారు. వేళగానివేళ మానస పడుకొని ఉంది. ఆమె నిజంగా, నిద్రపోతోందో, లేక నీరసంతో పడుకుందో వారి కర్థం కాలేదు ఆమె చెక్కిళ్ళపై కన్నీటి చారికలు స్పష్టంగా కనపిస్తున్నాయి. ఆమె కుడిచేతిలో ఒక కాగితం చుట్టిఉంటే, దాన్ని జాగ్రత్తగా తీసి చూశాడు ధర్మారావు. ఆ కాగితంనిండా "సుధాకర్... సుధాకర్..." అని వ్రాసిఉంది.

ఒక నిట్టూర్పుతో ఆ కాగితాన్ని అన్నపూర్ణమ్మగారి కిచ్చాడు. ఆమె, దాన్ని చూసి జాలిగా మానసవంక చూశారు.

లా నెమ్మదిగా "మానసా!" అని పిలిచారు.

మానస చటుక్కుని కళ్ళు తెరిచింది.

"ఇప్పుడు నిద్రపోతున్నావేమిటమ్మా?" లాలనగా అడిగారు అన్న

పూర్ణమ్మగారు

"నిద్రపోవటం లేదమ్మా! ఊరికేనే పడుకున్నాను" కొంచెం సిగ్గుపడుతూ అంది మానస.

"నీతో ఒక సంగతి చెపుదామని వచ్చాను మానసా?"

మానస ప్రశ్నార్థకంగా చూసింది.

"చూడు తల్లీ! నువు సుధాకర్ గారిని ఎంతగా అభిమానిస్తున్నావో నాకు తెలుసు. మీ రిద్దరూ భార్యాభర్తలయితే, కళ్ళవేడుకగా చూడాలని ఉంది. నాకోసమైనా ఆయనను వివాహం చేసుకో మానసా?"

మానస నిర్లిప్తంగా తల్లివంక చూసింది.

"నీ కూతురికోసం నువ్వేమైనా వదులుకోగలవమ్మా! కానీ, నా విలువలు నా కున్నాయి. జన్మ సిద్ధాంతంలోనూ, కర్మ సిద్ధాంతంలోనూ, నాకు నమ్మకముంది. నా అనేక జన్మల సంస్కార ఫలితంగా నేనీ బ్రాహ్మణ కులంలో పుట్టాను. ఒక మాలవాడితో బాంధవ్యాన్ని ఏర్పరచుకోలేను. ఇక, ఆవేదనంటావా? అది నా కర్మ! అనుభవించక తప్పదు."

అన్నపూర్ణమ్మగారూ, ధర్మారావూ, ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు.

అన్నపూర్ణమ్మగారు చాలా సేపటి వరకు అలా స్థాణువులా కూర్చుని చివరకు, ఏదో నిశ్చయానికి వచ్చినట్లు తల పైకెత్తి, "మానసా! ధర్మా! నా ప్రాణం పోయాక కాక, పైకి రాకూడదనుకున్న విషయాలు, ఈనాడు తప్పనిసరికావటంవల్ల చెపుతాను. వినండి" అన్నారు.

ఏ కారణంవలననో ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. మానసా ధర్మారావు లిద్దరూ ఆశ్చర్యపోయి శ్రద్ధగా వినసాగారు.

... ... ...

"మీ రిద్దరూ నాకు బిడ్డలు. ఏం సిగ్గుపడకుండా జరిగింది జరిగినట్లు చెపుతాను. ఆ రోజున పెద్దల నిర్ణయం ప్రకారం అందరు స్త్రీలలాగే, ఎన్నో ఆశలతో, ఎంతో సిగ్గుతో, జీవితంలోని సం[illegible] మలుపులో అడుగుపెట్టాను. ఎంతసేపటికీ, నా భర్తదగ్గరనుండి నాకే విధమయిన సమాశ్వాసనా లభించలేదు. నాకై నేను వారి నెలా సమీపించగలను? చాలా సేపటికి వారు నన్ను సమీపించారు. నా గుండె గుబగుబలాడింది.

"'నిన్నింత వికారంగా ఏ దేవుడు పుట్టించాడూ?'

"కర్కశంగా ఉంది వారి గొంతు. అదిరిపడ్డాను. భర్తదగ్గరనుంచి లభించిన తొలియనురాగ మిలాంటిది! లజ్జతో తల వంచుకుని నిలబడ్డాను.

"'నీతో ఒక గదిలో ఉండాలంటేనే, వెలపరం పుడుతోందే? ఏకళయ్యా

గతుడి నేలా కాగలనూ? అంతకంటె కొత్త విషం మింగమంటే, హాయిగా ఉంటుంది.'

"వణికిపోయాను అవమానంతో, అభిమానంతో, ఆవేదనతో. మనసు మూలుగుతూంది. అప్పటికీ ఏమీ మాట్లాడలేదు.

"'చింత మొద్దా! ఏం మాట్లాడవేం? ఈ శవి బ్రతికున్నంతకాలం నాకు తప్పదా?'

అప్పటికి నాకు సంకోచం తగ్గి కొంత స్థయిర్యం కలిగింది. ధైర్యంగా ఒకసారి వారి కళ్ళలోకి చూశాను అవి నిప్పులు కక్కుతున్నాయి. అయినా, నా కెందుకనో భయం కలుగలేదు. ధైర్యంగా ఆయనవంక చూసి 'క్షమించండి! నా వల్ల మీ కింతకష్టం కలుగుతూందని నాకు తెలియదు. మీ రీ లోకంలోనే ఉండవద్దంటేకూడా, అలాగే ఉండకుండా వెళ్ళిపోతాను.' అన్నాను. ఆయన ఏమీ మాట్లాడకుండా రోషంగా బుసలు కొడుతూ, పోయి మంచంమీద పడుకున్నారు. నేను కటికనేలమీద పడుకున్నాను. ఐహిక విషయాలను గురించి నేను దారుణంగా దుఃఖించిన మొదటి రాత్రీ, చివరిరాత్రికూడా అదే! ఆ రాత్రే నిన్ను నేను మనసా, జగద్రక్షకుడైన భవవంతుడికి కర్పించుకున్నాను. ఆ మరునాటినుంచీ, నేను పక్క వదిలిపెట్టాను; నిలాసవస్తువులు వదిలివేశాను; అలంకరణకు స్వస్తిచెప్పాను; సుఖదుఃఖాలకు అతీతంగా ఉండటానికి సాధన చేశాను; కర్తవ్య నిర్వహణా, భగవత్సేవా ఈ రెంటిలోనూ బ్రతుకంతా నింపుకోవటానికి ప్రయత్నించాను. వారు ఏం చేస్తున్నారో, ఎక్కడకు వెళ్తున్నారో, ఎప్పుడు వస్తారో, ఇవేవీ నేను పట్టించుకొనేదానిని కాను. గృహకృత్యాలు నిర్వర్తించుకోవటం, వచ్చినవారికి వడ్డించటం, ఇంతవరకే. ఇంటితో నాకు సంబంధం. స్త్రీలూ పురుషులూ ఎవరెవరో వచ్చేవారు. ఎవ రని నేను అడిగేదాన్నికాను నా శ్రీరామచంద్రునకుతప్ప. నా మనసులో మరి దేనికీ స్థానం ఉండేది కాదు — నా స్వామిని నేను చేరుకోవా లనే కఠోరమైన వ్రతనియమాల నవలంబించాను. కాలగమనంకూడా తెలియని, ఒకానొక తన్మయత్వంలో నా రోజులు గడిచిపోయేవి. మీరు నమ్మగలరో లేదో, నా హృదయంలో ఏకోశానా అసంతృప్తి ఉండేదికాదు. ఈ రకంగా ఎన్ని రోజులు గడిచాయో నాకు తెలియదు. ఒకనాడు వారు చేతిలో రెండునెలల పసిగుడ్డుతో దీనమైన ముఖంతో ఇంటికి వచ్చారు. నేను అప్పుడే పూజ ముగించుకొని ఇవతలకు వచ్చాను. వా రా పసికందును కటిక నేలమీద నా పాదాలదగ్గిర పడుకోబెట్టారు. ఆ పాప కెవ్వుమంది. అప్రయత్నంగా ఆ పాపను ఎత్తుకొని గుండెల కదుముకున్నాను. ఆ క్షణంలో స్త్రీకి జన్మసిద్ధ

మయిన మాతృత్వపు మాధుర్యం నా గుండెలలో నిండి, ఆ పాప నావరించిన ట్లయింది. ఆ పాప రోదన, నా స్వామి పిలుపులా వినిపించింది. ఎన్నడూ ఏ భావోద్వేగమూ అనుభవించని నా శరీరం ఆ పసిపాప స్పర్శతో అణువణువూ పరవశించింది. ఆ క్షణంలో నేను నిజంగా తల్లిని ఆ పాపకు నేను శారీరకంగా తల్లిని కాను. కానీ, నా మానసిక బలంతో మాతృమూర్తి నయ్యాను. అందుకనే ఆ పాపకు "మానస" అని పేరు పెట్టుకున్నాను. ఆనాటినుండీ ఐహికమైన నా జీవితమంతా మానసలో కేంద్రీకృతమయిపోయింది. ఆ పాప ఎవరని కానీ, నా కెందుకప్పగించారని కానీ, నేను వారి నడుగలేదు. కానీ, వారే చెప్పారు. వారికొక వేశ్యతో సంబంధం ఉండేదట! ఆమె సహాపైననే వ్యాపారం ప్రారంభిద్దామని తన పదెకరాల పొలా న్నమ్మితే, ఎనభై వేల రూపాయలతోసహా మాయమైందట – నోరులేని పసికూనమాత్రం ఆయన పాపానికి సంజాయిషీ అడుగుతున్నట్లు ఉండిపోయిందట! వారికి మతిపోయిన ట్లయిందట! ఆ వేశ్య అద్భుత సౌందర్యవతియట! ఆమెపట్ల వారికి అమితమైన లాలన ఉండేదట! డబ్బుపోయినందుకుగాక, ఆమె పారిపోయినందుకు వ్యధ ననుభవిస్తూ ఆ ఇల్లు వదిలి రాబోతూంటే, పసిపాప ఆక్రందన వినిపించిందట! మానవత్వం పూర్తిగా నశించలేదుగనుక, ఆ పసిగుడ్డు నెత్తుకొని నా కప్పగించారట!

"తరువాతకూడా చాలా రోజులు వారా వేశ్యను తలచుకొని కుమిలిపోతూ ఉండేవారు. కేవలం ఆమె కనబడవచ్చుననే ఆశతో అనేక ఊళ్ళకు ప్రయాణమయ్యేవారు. వార్తాపత్రికలో ప్రకటించాలనుకున్నారుకానీ, పరువుప్రతిష్టల ప్రశ్న ఉదయించి ఆ ప్రయత్నం విరమించుకున్నారు. మానస ఇంట అడుగు పెట్టిన దగ్గరనుంచీ ఆయన ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. చిట్టిమానసలో ఆమె తల్లిని చూసుకొనేవారో ఏమో, క్షణమైనా దానిని వదిలేవారుకారు. వెనుకటి అలవాట్లుకూడా మారిపోయాయి. ఇంటికెవరినైనా తేవటంగానీ, లేక తామె ఎక్కడికైనా వెళ్ళటంకానీ పూర్తిగా మానేసారు. ఒకటికి పదిసార్లు 'నువ్వు దేవతవు పూర్ణా! ఇంతటి సహనశక్తి, ఔదార్యమూ ఎవరికీ ఉండదు. దాని కన్నతల్లికూడా పాప నింత చక్కగా పెంచగలిగేదికాదు,' అనేవారు. వారలా అన్నప్పుడల్లా, నాలో జుగుప్స జనించేది. నే నా పాపను, వారికోసంగానీ లేక జాలి చేతగానీ, నా గుండెల్లో దాచుకోలేదు. ఏ క్షణంలో నా పూజామందిరం ద్వారం వద్ద, నా పాదాలదగ్గిర రోదిస్తున్న ఆ పాపను అందుకున్నానో, ఆ క్షణంలోనే నే నామెకు మనసా తల్లి నయ్యాను. ఆ పాప నా బిడ్డ. తల్లి బిడ్డను పెంచటంలో

దైవత్వంకానీ, సహనంకానీ, ఔదార్యం కానీ ఏముంటుంది?

"వారిలో ఇంకొక విచిత్రమైనమార్పు వచ్చింది. రోజూ నాకోసం పూలూ పళ్లూ లేక బట్టలూ, ఏవైనా తెచ్చేవారు కొన్ని రోజులు వాటివంక చూడనైనా చూసే దాన్ని కాదు. 'నన్ను అసహ్యించుకోడం నీకు న్యాయమే। కానీ, వీటిని స్వీకరించు పూర్ణా!' అని ప్రాధేయపడ్డారు నా కెవరి మీదా అసహ్యంలేదు అమాటే చెప్పాను. ఆ మరునాటినుండీ, ఆయన నాకు బహూకరించే వస్తువులన్నీ స్వీకరించి, నా స్వామి కర్పించుకోవటం ప్రారంభించాను. పూలతో అలంకరించేదాన్ని – పళ్ళు ఆరగింపు చేసేదాన్ని – వస్త్రాలు స్వామి సన్నిధిని ఉంచి, నాకవసరమైతే నేను ఉంచుకుని, లేకపోతే ఎవరికైనా అనాధల కిచ్చేదానిని–వారు నిర్ఘాంతపోయే వారు–నాకు లీలగా అనుపించసాగింది. వారు నాకు దగ్గిర కావటానికి ప్రయత్నిస్తున్నారని–ఈ భావం రాగానే భయంతో వణికిపోయాను. భగవంతుని కర్పించిన ఈ శరీరాన్నీ, మనసునూ మరొకరు మైలపరచటమా?

"భయపడుతూన్న ముహూర్తం వచ్చింది. వారు నాముందు మోకరిల్లి, 'పూర్ణా! క్షమించమని అడిగే అర్హత కూడా నాకు లేదు ఈ మానసిక సంక్షోభాన్ని భరించలేకపోతున్నాను. నాకు ప్రశాంతిని కలిగించవా?' అన్నారు. నా మనసులో శ్రీరామచంద్రుని ధ్యానించుకొన్నాను.

"స్థిరంగా వారివంక చూస్తూ 'మానవ జీవితమే అశాంతికి నిలయం ఎండ మావులవంటి కోరికలు నిరంతరమూ మానవుని తరుముతూంటే, అహమహమికతో ముందుకు పరుగులెత్తే ఈ జీవితంలో విశ్రాంతి ఎక్కడ? ఒక్క భగవత్సన్నిధిలో తప్ప ప్రశాంతి అనేది ఈ ప్రపంచంలో లేదు' అన్నాను ఆయన నావంక జాలిగా చూస్తూ 'ఆనాడు ఆమె నన్ను హత్య చెయ్యకుండా ఎందుకు పారిపోయిందో, అర్థం కావడం లేదు.' అన్నారు

"నేను గతుక్కు మన్నాను. 'ఎందుకలా మాట్లాడుతారు? మానవజీవితం కర్మాధీనము. సంచితాగామి, ప్రారబ్ధ కర్మలు జ్ఞాతాజ్ఞాత రీతులలో మన వెన్నంటి నడిపిస్తూనే ఉంటాయి. మనను మనం తెలిసికొని కర్మను జయించిన నాడు తప్ప, మన అభీష్టాలకూ, మన అదృష్టాలకూ సంబంధం ఉండదు. ఆ స్థితికి వచ్చిననాడు, అదృష్టానికీ, దురదృష్టానికీ, భేదమే లేకుండా పోతుంది.'

"వారికి నా మాట అర్థమయాయో లేదో తెలియదు. ఒక రకమైన విసుగుదల వారి కళ్ళలో ప్రకటిత మయింది. 'నా మీద నీకు దయ గలుగదా?' అన్నారు. వారి 'మనోచాంచల్యానికి నాకు నవ్వొచ్చింది. మీకు యథార్థాన్ని చెవుతున్నాను

వినండి. సౌందర్యానికి, ప్రపంచంలో చాలా ప్రధానమైన స్థానం ఉంది. కొందరు సౌందర్యాన్ని దర్శించి ఆనందిస్తారు. మరికొందరు లాలసతో దానిని అనుభవించాలని కాంక్షిస్తారు. ఇంకా కొంతమంది విపరీతమైన సౌందర్యారాధనతో తమ జీవితాన్నే సౌందర్యానికంకితం చేసికొని, అందులో విలీనమయి పోతారు. మీరీ మూడవ తెగకు చెందినవారు. ఈనాడు శాలో, గౌరవమో మిమ్మల్ని నా సమీపానికి తెచ్చి ఉండవచ్చు. కర్తవ్య దీక్షగానీ, లేక మరి ఏదైనా భావంగానీ, మిమ్మల్ని జీవితాంతం ఈ బంధానికి కట్టుబడ జేయనూ వచ్చును. కానీ, సౌందర్య పిపాసాపూరితమైన మీ హృదయం అనుక్షణమూ, అపశ్రుతులను పలుకుతూంటే, నేను గావించే ఆత్మార్పణమ స్వీకరించటం పూర్తిగా అసంభవమవుతుంది. మీరు మిమ్మల్ని మరిచిపోయేలాగ పరవశింపజేసి రసజగత్తులోకి తీసికొని పోగలిగే సామర్థ్యం నా శరీరానికి లేదని నాకు తెలుసు. దయచేసి నన్ను రెంటికీ చెడిన రేవడిని చేయకండి,' అని చేతులు జోడించాను. ఏ మనుకున్నారో, ఏమో, ఆయన మౌనంగా వెళ్ళిపోయారు. ఆ తరువాత నన్ను మరి సమీపించనేలేదు.

"మన కుటుంబాలు ఆచార సంప్రదాయాలకు ప్రసిద్ధి కెక్కినవి. 'బాల్యవివాహాలూ, మూఢనమ్మకాలూ, వెట్టి చాదస్తాలూ, వేళ్ళూనిపోయిన వంశాలు మనవి. నా కతి బాల్యంలో వివాహం జరగరటమే, కొంతవరకు, నా సంసార పరిస్థితికి కారణం కావచ్చును. మానసను నేను స్వీకరించినందుకు బంధువర్గమంతా నన్ను శతవిధాల దూషించి కత్తిగట్టింది. చివరకు, వాళ్ళింద నన్ను పెళ్ళి పేరంటాలకు పిలవక వెలివేసారు. 'మరీ మంచిది' కున్నాను. కొందరు శ్రేయోభిలాష మంచి మంచి సలహాలు కూడా ఇచ్చా కానీ, నేను వేటికీ చలించలేదు. ఎన్నో బంధువుల ఇంటికి పోనిదాన్ని అన్నయ్య మరణ సమయంలో వార్త రావటంవల్ల వెళ్ళాను. ప్రాచీన సాంప్రదాయం జీర్ణించుకుపోయిన అన్నయ్య, తన మరణ శయ్యమీద నుండి నా దగ్గిర 'మానసను ధర్మ భార్య కానీయనని' వాగ్దానం తీసికొన్నాడు. ఆ కారణం వలననే అనాడు నేను ధర్మారావు కోరిక తిరస్కరించాను.

"ఈ సంగతులు నేను ఎన్నడూ బయట పెట్టదలచుకోలేదు. కానీ, విషమ పరిస్థితులలో బయటపెట్టక తప్పలేదు.

"మానసా! ఇంక నీకు సుధాకర్ గారిని వివాహం చేసికోటానికి అభ్యంతరం ఉండదు కదూ!"

## 16

ఏమీ మాట్లాడకుండా, కన్నీళ్ళతో కదలక శిలావిగ్రహంలా కూర్చున్న

మానసను — చూచి ధర్మారావు కంగారుగా, ఆమె భుజాలు పట్టుకుని కుదుపుతూ, "మానసా! మానసా!" అన్నాడు.

మానస శూన్యంగా ధర్మారావువంక ాసింది.

"ఎందుకంత కంగారు బావా! సారీ! ుచు. నిన్ను బావాఅని పిలిచే అర్హత క్కడిదీ?"

న్నపూర్ణమ్మగారు దిమ్మెర ారు.

'అదేం మాట మానసా! నువ్వు ాకర్‌గారిని వివాహం చేసికోవా ునే ఊహతో. ఈ కథంతా చెప్పానుకానీ. దానివల్ల మన సంబంధ బాంధవ్యాలు దెబ్బతింటాయా?"

"హుం! సుధాకర్‌గారు నన్ను పెళ్ళి చేసికొంటారా? ఆయనకు కులం ఉంది. నాకు కులంలేదు, నీతిలేదు. విశాల హృదయమూలేదు. కనీసం సాధారణ మానవులకుండే విలువలుకూడా లేవు. ఒక దొంగకూ, పతితకూ, ఒక జారునికీ జన్మించిన నేను ఇలాంటిదాన్ని కావటంలో ఆశ్చర్య మేముంది?"

అన్నపూర్ణమ్మగారు, నిస్సహాయంగా చూస్తూ —

"మానసా! మానసా! అలా అనకు తల్లీ! నీకు నేను పెట్టినపేరే నువ్వు నా బిడ్డవని ఘోషిస్తూంటే, నువ్విలా మాట్లాడటం న్యాయమేనా?" అన్నారు.

మానస సమాధానం చెప్పలేదు. వంచిన తల ఎత్తలేదు. అన్నపూర్ణమ్మగారి వంక చూడనైనాలేదు. ఆ తిరస్కారం, కొరడాదెబ్బలాగ చెళ్ళున ఆమె హృదయానికి తగిలింది. ఆ తీవ్రఘాతానికి, ఆమె హృదయం విల విల లాడి పోయింది. పసితనంనుండీ, ఏనాడూ, ఈషత్తూష్ణీభావంకూడా మానస తల్లిపట్ల ప్రదర్శించి ఎరుగదు. ఈనాడు, ఈకథ విన్నమానస, తనను మాతృస్థానాన్నుండి బహిష్కరించిందా? ఇరవయ్యేళ్ళ తమ అనుబంధానికిదే పర్యవసానమా? నేటి సమాజానికెదురీది, తన గుండెలలో దాచుకునిపెంచిన అనురాగానికిదా ప్రతిఫలం?

ధర్మారావుకు పరిస్థితి అయోమయంగా ఉంది. వెంటనే, అతడు లేచివెళ్ళి సుధాకర్‌ను వెంటబెట్టుకుని వచ్చాడు. సుధాకర్ గదిలోకి రాబోతూ, సందేహంగా గుమ్మందగ్గిర ఆగిపోయాడు. అడుగులచప్పుడుకు తలెత్తిన మానస కళ్ళు జాలిగా బెదురుగా చూసే సుధాకర్ కళ్ళతో కలుసుకున్నాయి. మరుక్షణంలో ఆమెకళ్ళు అశ్రువులతో నిండిపోయాయి. రెండు చేతులతోనూ ముఖం కప్పుకొంది. ధర్మారావు హమ్మయ్య అనుకొన్నాడు. మానసలో ఈ విధమైన సంచలనం కలిగించటంకోసమే, అతడు సుధాకర్‌ను తీసికొనివచ్చాడు. ధర్మారావు సైగతో సుధాకర్ మానస దగ్గిరగా వచ్చి, "మానసా! నీసమస్య ఈ కాలపుది కానే



కాదు. వ్యర్థంగా విపరీతమైన ఆవేదన ననుభవిస్తున్నావు. ఇలా చూడు. నీ పెదిమెలపై చిరునవ్వు చూడటంకోసం ఏం చెయ్యడానికైనా సిద్ధంగా ఉన్నాను. నామాట వినవూ?" అన్నాడు, అనురాగం ఉట్టిపడే కంఠస్వరంతో.

ఆ అనునయస్వరం మానస మనసును మరింత కదిలించింది. ఆమె కన్నీళ్ళాగటం లేదు వెక్కిళ్ళ మధ్య. "మీరంతా వినేవచ్చారా?" అంది.

"ఆఁ అంతా విన్నాను. ఇందులో కొంప మునిగిపోయిందేముందీ? ఈ కులతత్వాలు మంచుతెరలవంటివి, ఒకనాటి వాతావరణంలో. అవి పృథక్త్వాన్ని వహించి సంఘసంక్షేమానికి ఆవశ్యకమయ్యాయి. ఈనాటి వాతావరణంలో అవి కరిగిపోయి నామమాత్రావశిష్టాలయ్యాయి. ఏమీ లేని దానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నావు. జన్మ జన్మల సంస్కారాన్ననుసరించి మానవుడు జన్మించటమూ వగైరా ఎంత ఆధారరహితమైన అభిప్రాయాలో బోధపడిందికదా!

"ఆఁ, బోధపడింది. నీ అభిప్రాయాల్లో ఏమీదోషం లేదు. అవును, నా సంస్కారం అటువంటిది కనుకనే, ఒక వేశ్యగర్భాన జన్మించాను. శిక్షణవలన కొంత సంస్కారం అలవడ్డా, నా జీవలక్షణంలో ఆ చాంచల్యం ఉండనే ఉంది. కాబట్టే మీరు విగ్రహంతో దూరంగా ఉన్నా, నేనే మీకు దగ్గర కావటానికి ప్రయత్నించాను. మీరు తటస్థంగా ఊరుకొన్నా, నేనే నా మనస్సును మీముందు బయట పెట్టుకొన్నాను. తమ అనేక జన్మల సంస్కారాన్ననుసరించి మానవులు తమ జీవనమార్గాన్ని మలచుకుంటారనటాని కింతకంటె నిదర్శనమేం కావాలీ? నామీది అనురాగంతో మీరు నన్ను స్వీకరించడానికి స్థిరపడినా, మిమ్మల్ని మనసారా అభిమానిస్తున్న నేను మీ కంతటి దురదృష్టాన్ని కలిగించను."

ధర్మారావూ, సుధాకర్." అన్నపూర్ణమ్మగారూ కూడ తలలు పట్టుకొన్నారు.

మానస అన్నపూర్ణమ్మగారి వంక తిరిగిచూడకుండానే, ఇన్నాళ్ళూ దయతో కాపాడారు ఇంక నా బ్రతుకు నేను బ్రతుకుతాను" అంది.

అమ్మా. అనైనా పిలువలేదు అన్నపూర్ణమ్మగారికి తన గుండెలను బంపంతో కోస్తున్నట్లుగా ఉంది. తొలియవ్వనంలో, జీవితంమీద ఎన్నో ఆశలతో. అందమైన కలలతో చేరబోయిన తనను, క్రూరంగా భర్త తిరస్కరించిననాడు కూడా ఆమె ఇతటి ఆవేదన నను భవించలేదు అంతవరకూ. అన్నపూర్ణమ్మగారికన్నీ రెవరూ చూడలేరు. ఆ సమయంలో నిరాసక్తయయిన, ఆమె కళ్ళనుండి రెండు నీటి బిందువులు జారాయి. గాద్గదికంగా, గంభీరంగా, "మానసా! నీకు జన్మ ఎవరిచ్చారనేదే ముఖ్యమైనట్లుంది. రెండు నెలల పసికందుని నిన్ను ఆనాడు నా మనసులో ఇముడ్చుకున్నాను. నా మనసులో నీకు తల్లి నయ్యాను. దానికి విలువ లేదంటావా? ఎక్కడో ఎవరికో పుట్టి నాకు కూతురివి కావటమే ఈరకమైన భావాల లోని బలహీనతకు నిదర్శనం కాదా!" అన్నారు

"మానస విసురుగా తలెత్తింది. ఆమె కళ్ళలోనుండి నిప్పులు రాల్తున్నాయి! ఆమె తల్లితో ఆ విధంగా మాట్లాడటం ఎవరూ చూడలేదు. చనువుగా 'నువు' అనైనా సంబోధించలేదు.

"మీరు అత్యద్భుతమైన ఆత్మౌన్నత్యము కలిగినవారు; జాలిగుండె గలవారు; లోకంలోని సమస్త ప్రాణులనూ సమాన భావంతో ఆదరించగలిగినవారు. కాని, నన్ను కూతురిగా మాత్రం మీరు స్వీకరించలేరు. నేనే మీ కూతురి నయితే నన్ను ముట్టుకొన్నప్పుడుకూడా స్నానం చెయ్యవలసిన అవసరం వచ్చేదా? మీ భగవంతుడి గదిలోకి అడుగుపెట్టే అర్హత నాకు లేకుండాపోయేదా? మీ మేనల్లుడు పంచమ కులజను, చేసికొంటానంటే, తల్లడిల్లిపోయిన మీరు, సుధాకర్‌తో నా వివాహాని కంత తేలికగా ఎలా సమ్మతించగలిగారు? మీలో కుల భావమే లేకపోతే, ధర్మారావుగారు నిరంజనిని చేసికొంటానన్నప్పుడంత ఆవేదన దేనికి? మీరు నన్ను అపారమైన దయతో ఆదరించారు కాని, నాకు తల్లి మాత్రం కాలేకపోయారు. నేను మీ బిడ్డను కాను:- కాను! - ఒక్కనాటికి కాలేను." వెఱ్ఱి ఆవేశంతో ఈ మాటలన్న మానస స్మృతి తప్పిపోయింది. ఆమె ఇటీవలనే తీవ్రమైన జ్వరంపడి లేచింది అప్పలామెకు కలిగిందే మనోవ్యాధి. ఒక దెబ్బనుండి, పూర్తిగా కోలుకోకుండానే, మరొక దారుణమైన దెబ్బ తగిలింది. ఈ దెబ్బ మరీ అసాధారణమయినది. ఆమె ఆరాధనకూ, ఆమె

యువ

అహంకారానికీ, ఆమె వ్యక్తిత్వానికీ దెబ్బ. ఏ ఆధారం మీద సగర్వంగా తాను నిలబడిందో, ఆ ఆధారమే సమూలంగా నాశనమైంది. ఈ దెబ్బకు మానస తట్టుకోలేకపోయింది.

శంకరశాస్త్రిగారు డాక్టర్‌ను తీసికొని వచ్చారు అన్నపూర్ణమ్మగారు, ఈ పరిస్థితిలోనైనా, గతమంతా బయలు పరచటం ఆయన కిష్టంలేదు. కాని, నిస్సహాయుడు. తన మానస నేవిధంగా దక్కించుకోవాలో అర్థంకాలే దాయనకు డాక్టర్ మానసను పరీక్షించి పెదవి విరిచాడు. సుధాకర్ పసిపాపలా ఘొల్లుమన్నాడు. ధర్మారావు తన ఆవేదన నణుచుకుంటూ అన్నపూర్ణమ్మగారిని సముదాయించడానికి ప్రయత్నిస్తున్నాడు. అంతలో అన్నపూర్ణమ్మగారు చటుక్కున ఇరువదేళ్ళ మానసను, పసిపాపలాగ చేతులతో ఎత్తుకొని, తాను నిత్యమూ ప్రార్థించే తన ఆరాధ్యదైవం శ్రీరామచంద్రుని పాదాలదగిర పడవేసి, చేతులు జోడించారు. ఐహికమయిన సమస్త విషయాలకూ, తనను తా నతీతురాలిని కావించుకున్న ఆ కర్మయోగిని ఆ క్షణంలో, చేతులు జోడించి ఏమని ప్రార్థించారో? బహుశః నిష్కామ ప్రవర్తనకూ, దృఢవ్రత పరిపాలనకూ, స్వచ్ఛమైన ఆదరణకూ, విలువ అనేది ఉంటే, మానస తన బిడ్డేనన్న విషయం ఋజువు చేయమని కావచ్చు. ఏనాడూ తెరువబడని ఆమె పూజామందిరద్వారా లానాడు బారుగా తెరువబడ్డాయి.

ధర్మారావూ, సుధాకర్, శంకరశాస్త్రి స్థాణువులై క్షణమొక యుగంగా నిరీక్షిస్తున్నారు. డాక్టర్ తన ఆఖరి ప్రయత్నంగా, ఒక ఇంజక్షన్ ఇచ్చాడు. ఆ క్షణంతో తన పూజా మందిరంలోకి ఎవరు ప్రవేశిస్తున్నారో, ఎవరు ప్రవేశించకూడదో అనే ఆలోచన చేయగలిగే స్థితిలో లేరు అన్నపూర్ణమ్మగారు. ఆమె చేతులు జోడించి ఉన్నాయి. కనులు మూతలు పడ్డాయి. చూసేవారికి ఆమెకూడా స్మృతి కోల్పోయిందా అని భ్రమ కలిగేలా ఉన్నారు ఊదు వత్తుల సువాసనలు; స్వామి నలంకరించిన పుష్పాల పరిమళాలు; వీటన్నిటినీ మించి ఏదో తెరలా వచ్చి క్రమ్ముకున్న ఒకానొక దివ్య పరిమళము తనను తట్టి మేల్కొలుపగా నీరసంగా కళ్ళు తెరిచింది మానస ఎదురుగా ఆంజనేయ సీతా సౌమిత్రీ సహితుడై, పుష్పమాలాలంకృతుడై విశ్వప్రేమాభివ్యోతక మందహాసవదనారవిందుడై, అభయ హస్తంతో తన నాశీర్వదిస్తున్నట్లుగా ఉన్న శ్రీరామచంద్రుని చూసి, అప్రయత్నంగా చేతులు జోడించింది మానస. ఆ దివ్యమూర్తి సందర్శనమాత్రాన ఆమె మనసులో భగభగలాడే ఆవేదనాగ్ని కలలకు పన్నీటి జల్లులయి కురిశాయి. అందరి ముఖాలూ వెలిగాయి. డాక్టర్ ఆదంతా

తన ప్రజ్ఞే అయినట్లు మీసం మెలివేసి కొన్నాడు. తన ప్రక్కనే సమాధి నిష్ఠ రాలైన యోగినిలాగ చేతులు మోడ్చి కూర్చున్న తల్లిని చూసి "అమ్మా!" అంది మానస నీరసమైన కంఠధ్వనితో మధురమైన ఆమె పిలుపుకు కళ్ళు తెరి చారు అన్నపూర్ణమ్మగారు. చిరునవ్వు వెలిగే మానస ముఖసందర్శన మామెకు భగవత్సాక్షాత్కార మైనంత ఆనందాన్ని కలిగించింది. మానస తలను ప్రేమగా తన ఒడిలోకి తీసికొని "మానసా" అన్నారు. "అమ్మా! నా కోసం నీ నియమా లన్నీ వదులుకున్నావా?" అంది మానస, ప్రేమా, జాలీ, ఆనందమూ కలిపి.

అన్నపూర్ణమ్మగారు మానస నోరు మూసి "ను వ్విప్పు డేమీ మాట్లాడకు. నీకు తరువాత వివరంగా చెపుతాను." అన్నారు. తరువాత సుధాకర్ సాయంతో అన్నపూర్ణమ్మగారు మానసను మంచం మీద పడుకోబెట్టారు. డాక్టర్ వైద్యం కంటె సుధాకర్ నిరంతం సాన్నిధ్యం మానసను త్వరలోనే పరిపూర్ణారోగ్య వంతురాలిని చేసింది

మానస పూర్తిగా కోలుకున్న తరు వాత ఆమెను, తన పూజామందిరంలో, తన ప్రక్కన కూర్చోపెట్టుకుంటూ అన్నపూర్ణమ్మగారు ఇలా అన్నారు.

"మనసా! ఆ భగవంతుని సాక్షిగా చెపుతున్నాను విను నిన్ను పూజా మంది రంలోకి రానియ్యకపోవటానికీ, పూజకు ముందు, నిన్ను ముట్టుకుంటే స్నానం చేయటానికీ, కారణం నువ్వు వేశ్యాకుల సంజాతవు కావటంకాదు. నా జీవితానికి పరమార్థం ఈ స్వామి పాద సేవ మాత్రమే! ఈ విషయంలో నేను స్వార్థ పరురాలి నయ్యాను. నేను పూజ చేసే సమయంలో, ఇంకొకరు నా ప్రక్కన ఉండటం కానీ, జన లింకొక రెవరైనా నా మందిరంలోకి ప్రవేశించటం కానీ సహించలేకపోయేదానిని. నేను పూజకు కూర్చోబోయే ముందు నె న్నెవరైనా ముట్టుగుంటే ఐహికమైన విషయవాసనలు నన్నావరించినట్లు అనుభూతిచెంది తిరిగి స్నానం చేసేదానిని. అది నీ ఒక్కదాని విషయంలోనే కాదు. ఎవరైనా అంతే జరిగేది కాని మన ఇంట్లో నా పూజా మందిరంలోకి రావడానికి ప్రయత్నిం చేదీ, నన్ను ప్రత్యేకం ముట్టుకొనేదీ, నువ్వొక్కదానివే కావటం వలన, నీ వొక్కదాని విషయంలోనే ఇలా జరుగు తూందని నువ్వు భావిస్తున్నావు. ఇక ధర్మ సంగతి! అన్నయ్య నిన్నూ ధర్మనూ భార్యాభర్తలు కానియ్యవద్దని నన్ను కోరింది తన వంశంలో వర్ణ సాంకర్యం జరగరా దనే ఉద్దేశ్యంతో! అంతేకాని, నీమీద ప్రత్యేకమైన కక్షతో కాదు; అలాంటప్పుడు ధర్మ నిరంజనిని చేసికొంటే అన్నయ్య ఆత్మ శాంతి స్తుందా? అందుకని ఆవేదన పొందాను.



జన్మతః నాలో జీర్ణించుకుపోయిన ఆచారాలను నేను భౌతికంగా పాటిస్తాను. క్రమరహితమైన జీవనంకంటె క్రమబద్ధమైన జీవనమే హృదయ వికాసానికెక్కువ తోడ్పడుతుందని నా భావన. తొలినుండీ నేనేలాటి క్రమానికలవాటు పడ్డానో. ఆ క్రమాన్ని వదలివేయవలసినంత ప్రత్యేకమైన అవసరం నాకు కనబడలేదు. నా హృదయానికి సమస్త ప్రాణకోటి సమానమే. అదీగాక నీకూ సుధాకర్‌కూ నడుమగల అనురాగం సత్యమయినదని నా కనిపించింది. నాకు దూరమైన జీవన సౌభాగ్యాన్ని నీకైనా అందజేయాలనే తపనతో నేను వెంటనే మీ వివాహానికి అంగీకరించాను. ఇప్పుడు నన్నర్థం చేసుకోగల వనుకుంటాను "

మానస ముఖం సిగ్గుతో కందిపోయింది.

"నన్ను క్షమించమ్మా! నువ్వు నా కన్నతల్లివి కావన్న నగ్న సత్యాన్ని జీర్ణించుకోలేని ఉన్మాదస్థితిలో ఇష్టమొచ్చినట్లు వాగాను. నీ ఔన్నత్యాన్ని కనీసం అర్థంచేసికోగలిగే శక్తికూడా మాకు లేదు "

అన్నపూర్ణమ్మగారు నిర్వికారంగా నవ్వారు.

"పోనీలే! మంచిదే జరిగింది. నేను ఇంకో పాఠం నేర్చుకొన్నాను. నాలోని కొద్దిపాటి సంకుచితత్వంకూడా వదిలిపోయింది. మనసులో ఏకాగ్రత ఉండాలే కాని. ఏకాంతం దేనికి? మీ అందరి సమక్షంలోనే నా స్వామిని ఆరాధిస్తాను."

* * *

నిరంజనీ ధర్మారావులకు, మానసా సుధాకర్‌లకు ఒకసారే వివాహాలు జరిగాయి. నిరంజనీ ధర్మారావులు, మానసా సుధాకర్‌లు భక్తితో అన్నపూర్ణమ్మగారి పాదాలకు నమస్కరించారు. ఆమె సాదరంగా ఆ నవదంపతులను ఆశీర్వదించారు.

తియ్యని సెలయేళ్లూ, వానలూ, వరదలూ, ఉప్పుటేరులూ, సమస్త జీవనదులూ సాగరంలో విలీనమయి, అనంత గంభీర జలరాశిమాత్రమే దృగ్గోచరమయినట్లు అన్నపూర్ణమ్మగారి దివ్య మానవత్వంలో సమస్తకులాలూ విలీనమయి, బేధభావంలేని గాఢానురాగమే అందరినీ ఆవరించుకొంది.

మానసా, నిరంజనీలు, ఒకరినొకరు 'వదినె' అని చిలిపిగా సంబోధించుకొని వేళాకోళాలు చేసికొన్నారు.

నిరంజనీ, ధర్మారావులు మెడ్రాస్ వెళ్ళిపోయారు. కొత్తకోడలు తనకు పాదాభివందనం చేసినపుడు సీతమ్మ తెగ మురిసిపోయింది.

"నేను మాలవాడిని, నన్ను ముట్టుకోకు!" అన్నాడు సుధాకర్ కొంటెగా.

మానస అంతకంటె చిలిపిగా, "మాలేమిటి? మాదిగేమిటి? నన్నెవడు పోషిస్తే వాడే నాకు దేవుడు," అంది.

ఇద్దరూ నవ్వుకొన్నారు సుధాకర్ గేలిచేస్తున్నట్లు, ఇప్పటికైనా నీ జన్మసిద్ధాంతాలూ, జన్మజన్మ గత సంస్కారాలూ, ఈ గొడవా వదిలిపెడ్తావా?" అన్నాడు.

మానస పెంకిగా ఒక్కనాటికీ వదిలిపెట్టను. నా పూర్వజన్మ సంస్కారం మహోత్కృష్టమయినది కనుకనే, ఒక వేశ్యకు జన్మించినా, అమ్మవంటి దివ్యురాలి చేతిలో పెంచబడ్డాను. మీవంటి ఉత్తముడిని భర్తగా పొందగలిగాను. కులభేదాలు మంచుతెరవంటివనీ, ఒక వాతావరణంలో దృఢమైన సంఘ సంక్షేమానికావశ్యకమయిన, నేటి వాతావరణంలో వాటి అస్తిత్వమే కరిగిపోయిందనీ, అర్థం చేసికోగలగటమేకాక, అనుభవంలోకి తెచ్చుకోగలిగాను," అని నవ్వింది.

సుధాకర్ ఓడిపోక తప్పలేదు. తన ఓటమిని అంగీకరించలేక, తాను నిశ్చయంగా ఆమె నోడించగలిగే మరియొక మధురమైన మార్గాన్ని గురించి ఆలోచించసాగాడు

(అయిపోయింది)

